# లోకల్ గైడ్ తెలంగాణ

ద్విభాషా దినపత్రిక

LGTV

www.localguidenews.com

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 12, | సంచిక 178, | పేజీలు -12 | మంగళవారం - 13 - మే - 2025 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,







## బంగ్లాదేశ్ హసీనా బిగ్ షాక్

### షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీని నిషేధం



ఉగ్రవ్యతిరేక చట్టం నిబంధనల ప్రకారం అవామీ లీగ్‌ను నిషేధించినట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటన

సలహాదారుల మండలి(కేబినెట్) నిర్ణయం మేరకే నిషేధం విధించామని, నిషేధానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఇస్తాం

## వాణిజ్య యుద్ధానికి తెర పడేనా?

### అమెరికా- చైనా అధికారుల టారిఫ్ చర్చలు మొదలు



చర్చలు ఎక్కడ జరుగుతున్నాయనే కచ్చితమైన ప్రదేశాన్ని మాత్రం వారు బహిర్గతం చేయలేదు

ఈ టారిఫ్ చర్చలు పురోగతి సాధించే అవకాశం కనిపిస్తోందని సమాచారం.

## అమెరికా-చైనా మధ్య చర్చలు

### చైనాతో చర్చల్లో గణనీయమైన పురోగతి కన్పించింది

వాణిజ్య యుద్ధంలో నష్టాన్ని తగ్గించే దిశగా ట్రేడ్ డీల్ కు ఇరుదేశాలు సుముఖత



అమెరికా-చైనా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్..!

వాణిజ్య యుద్ధ ఆందోళనల వేళ ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా రెండు రోజుల పాటు చర్చలు

## పాక్ తో చర్చల్లో బిగ్ ట్విస్ట్, ప్రధాని పట్టు

- అనూహ్య పరిణామాలు..!!

భారత్ డిమాండ్ల పైన పాక్ స్పందనకు అనుగుణంగానే నడుచుకోవాలని త్రివిధ దళాలకు ప్రధాని స్పష్టం

పాక్ ను పూర్తిగా ఫిక్స్ చేసే లక్ష్యంతోనే చర్చలు వాయిదా

రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డీజీ ల మధ్య హాట్ లైన్ లో చర్చలు



ఢిల్లీ: భారత్ - పాక్ చర్చల వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డీజీ ల మధ్య హాట్ లైన్ లో చర్చలు జరగాల్సి ఉంది. ప్రధాన మోదీ ఉన్నత స్థాయి సమీక్ష ఏర్పాటు చేసారు. చర్చల వేళ తన వైఖరిని తేల్చి చెప్పారు. భారత్ డిమాండ్ల పైన పాక్ స్పందనకు అనుగుణంగానే నడుచుకోవాలని త్రివిధ దళాలకు ప్రధాని స్పష్టం చేసారు. ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుందని క్లారిటీ ఇచ్చారు. దీంతో,

మిగతా..2లో




## చత్తీస్‌గఢ్ లో ఘోర రోడ్డు ప్రమాదం .. 13 మంది దుర్మరణం

- ప్రయాణికులతో వెళుతున్న వాహనాన్ని ఢీకొన్న ట్రక్కు
- తొమ్మిది మంది మహిళలు, నలుగురు చిన్నారులు మృతి
- మరో 30 మందికి గాయాలు
- రాయ్‌పూర్ - బలోద బజార్ మార్గంలో దుర్ఘటన



## మీ సేవలు అసామాన్యం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అంతర్జాతీయ నర్సుల దినోత్సవం
- పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో పవన్ భేటీ
- విశిష్ట సేవలు అందించిన 8 మంది నర్సులకు సత్కారం
- వైద్యరంగంలో నర్సుల సేవలు వెలకట్టలేనివన్న డిప్యూటీ సీఎం

(లోకల్ గైడ్):అమరావతి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విశిష్ట సేవలు అందించిన 8 మంది నర్సులను ఉపముఖ్యమంత్రి సత్కరించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ... వైద్య రంగంలో

# సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్

### హైదరాబాద్‌లో సొనాటా సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

-“తెలంగాణ రైజింగ్” అనే ఆలోచనలో ఈ దార్శనికత ఇమిడి ఉంది

- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటన

- నగరం సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందన్న సీఎం
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళిక




వివరాలు 2లో..

(లోకల్ గైడ్):హైదరాబాద్: ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటే సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని సమతుల్యం చేసుకుంటూ సమగ్రమైన సమ్మిళితమైన అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. “తెలంగాణ రైజింగ్” అనే ఆలోచనలో ఈ దార్శనికత ఇమిడి ఉందని అన్నారు.



నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళికలను ఈ వేదికగా వివరించారు. అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడంలో, తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం ముందు చాటడానికి ప్రతి ఒక్కరి సహకారం కావాలని, హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు. “హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల హబ్ గా మారింది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఏఐ -రెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోంది. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించాయి.

## ఓ వైపు భానుడి భగభగలు.. మరో వైపు వరుణుడి ప్రతాపం..!

### ఇదేం వాతావరణం బాబోయ్..!



దేశవ్యాప్తంగా వింత వాతావరణం ఏర్పడుతున్నది

పలు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి

ఉత్తర, మధ్య, పశ్చిమ భారతంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదు

(లోకల్ గైడ్):ఢిల్లీ: దేశవ్యాప్తంగా వింత వాతావరణం ఏర్పడుతున్నది. పలు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర, మధ్య, పశ్చిమ భారతంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. అదే సమయంలో ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో వాయువ్య భారతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రాబోయే మూడు నుంచి ఐదురోజులు 4 నుంచి 6 డిగ్రీల వరకు పెరగవచ్చని పేర్కొంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఒడిశా మరియు జార?ండ్‌లలో ఉష్ణోగ్రతలు 2 నుండి 4 డిగ్రీల వరకు పెరుగుతాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆయా ప్రాంతాల్లో

మిగతా..2లో



## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

(లోకల్ గైడ్):హైదరాబాద్: రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. భారత్-పాక్ ఉద్రిక్తతలు, దేశంలో జరిగిన పరిణామాల దృష్ట్యా సమావేశ మయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులను గవర్న రకు ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్ర మంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.




- అసలు యుద్ధం అంటే ఏం తెలుసా?...
- యుద్ధం అంత రొమాంటిక్‌గా ఉండదు.
- యుద్ధానికి వెళ్లడానికి నేను సిద్ధమే అయినా దౌత్యాన్ని తొలి అవకాశంగా చూస్తాను




## పీవోకేలో భారత్ ఆపరేషన్ సక్సెస్

### మా పోరాటం ఉగ్రవాదులపైనే..

### పాక్ నష్టానికి బాధ్యత వారిదే

(లోకల్ గైడ్):ఢిల్లీ: ‘ఆపరేషన్ సిందూర్’లో భాగంగా మే 7న జరిపిన దాడుల్లో ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే తమ పోరు అని ‘ఆపరేషన్ సిందూర్’పై నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు.

మిగతా..2లో



## రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు
- టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారు
- టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారు
- కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారు

## పహల్గామ్ దాడి సాకుతోనే భారత్ మాపై దాడికి దిగింది

.. పాక్ ప్రధాని సంచలన ఆరోపణ

కాల్పుల విరమణ మా చారిత్రక విజయమన్న షెహబాజ్ షరీఫ్

తమ సైనిక ప్రతిస్పందన వల్లే కాల్పుల విరమణ అన్న పాక్ ప్రధాని

భారత సైనిక స్థావరాలను ధ్వంసం చేశామన్న షరీఫ్

పహల్గామ్ దాడిని భారత్ సాకుగా తీసుకుందని ఆరోపణ

(లోకల్ గైడ్):ఢిల్లీ: ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడిని ఒక సాకుగా చూపి భారత్ తమ దేశంపై దాడికి పాల్పడిందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని తమ దేశ ‘చారిత్రక విజయం’గా అభివర్ణించారు. భారత దురాక్రమణకు తమ సైన్యం సమర్థవంతంగా బదులిచ్చిందని ప్రశంసించారు. కొన్ని రోజుల పాటు కొనసాగిన తీవ్ర



మిగతా..2లో

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
మంగళవారం - 13 - మే - 2025

# బంగ్లాదేశ్ హసీనా బిగ్ షాక్

## షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీని నిషేదం

**(లోకల్ గైడ్):**ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో ముహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం మాజీ మహిళా ప్రధానమంత్రి షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీని నిషేధించింది. ఉగ్రవ్యతిరేక చట్టం నిబంధనల ప్రకారం అవామీ లీగ్‌ను నిషేధించినట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. సలహాదారుల మండలి(కేబినెట్) నిర్ణయం మేరకే నిషేధం విధించామని, నిషేధానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. అవామీ లీగ్, ఆ పార్టీ అగ్ర నేతలపై అంతర్జాతీయ నేరాల ట్రిబ్యూనల్‌లో కొనసాగుతున్న కేసుల విచారణ ముగిసేదాకా ఈ రాజకీయ పార్టీపై నిషేధం అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టంచేసింది. షేక్‌హసీనా సారథ్యంలోని ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు 2024 జూలైలో ఉద్యమించిన విద్యార్థి సంఘాలు, నేతలు, సాక్షుల భద్రత, పరిరక్షణ కోసం అవామీ పార్టీపై నిషేధాజ్ఞలు అమలుచేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 1949లో అవామీ లీగ్ పార్టీ ఏర్పడింది. తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీలకు స్వయంప్రతిపత్తి హక్కులు దఖలుపడాలన్న లక్ష్యంతో అప్పట్లో అవామీ లీగ్ ఉద్యమం చేసింది. చివరకు స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావానికి కారణమైంది.

# వాణిజ్య యుద్ధానికి తెర పడేనా?

## అమెరికా- చైనా అధికారుల టారిఫ్ చర్చలు మొదలు

**(లోకల్ గైడ్):**జెనీవా: ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య వివాదాన్ని తగ్గించే లక్ష్యంతో అమెరికా ట్రెజరీ కార్యదర్శి, అత్యున్నత వాణిజ్య ప్రతినిధి ఉన్నతస్థాయి చైనా అధికారులతో చర్చలు ప్రారంభించారు. ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్‌లు ప్రీమియర్ హీ లిఫెంగ్ నేతృత్వంలోని చైనా ప్రతినిధి బృందంతో సమావేశాలు ప్రారంభించారని చైనాకు చెందిన షిన్హువా న్యూస్ ఏజెన్సీ తెలిపింది. రెండు వైపుల దౌత్యవేత్తలు కూడా చర్చలు ప్రారంభమయ్యాయని ధ్రువీకరించారు. చర్చలు ఎక్కడ జరుగుతున్నాయనే కచ్చితమైన ప్రదేశాన్ని మాత్రం వారు బహిర్గతం చేయలేదు. ఈ టారిఫ్ చర్చలు పురోగతి సాధించే అవకాశం కనిపిస్తోందని సమాచారం. రెండు దేశాలు ఒకదానికొకటి విధించుకున్న భారీ టారిఫ్‌లు తగ్గించుకుంటాయనే ఆశలు చిగురిస్తున్నాయి. ఇది ప్రపంచ మార్కెట్లు, పసిఫిక్ మహాసముద్రం రెండు వైపులా అమెరికా-చైనా వాణిజ్యంపై ఆధారపడిన కంపెనీలకు ఉపశమనం కలిగించే చర్యగా భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచిన సంగతి విదితమే. దీనికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. ఇలా అధిక టారిఫ్‌లు విధించుకోవడం అంటే ఈ దేశాలు ఒకదానికొకటి ఉత్పత్తులను బహిష్కరించుకోవడం కిందే లెక్క. గత ఏడాది ఈ రెండు దేశాల మధ్య వాణిజ్యం 660 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తాజా చర్చల ప్రారంభానికి ముందే, చైనాపై అమెరికా సుంకాలు తగ్గించవచ్చని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. 80 శాతం సుంకాల విధింపు సరైనదిగా భావిస్తున్నామని తెలిపారు.

# అమెరికా-చైనా మధ్య చర్చలు

## చైనాతో చర్చల్లో గణనీయమైన పురోగతి కన్పించింది

**(లోకల్ గైడ్):**ఢిల్లీ: ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య వివాదాన్ని తగ్గించే లక్ష్యంతో అమెరికా-చైనా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ముగిసినట్లు తెలుస్తోంది. వాణిజ్య యుద్ధంలో నష్టాన్ని తగ్గించే దిశగా ట్రేడ్ డీల్ కు ఇరుదేశాలు సుముఖత చూపించినట్లు సమాచారం. చైనాతో చర్చల్లో గణనీయమైన పురోగతి కన్పించిందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ తాజాగా ప్రకటించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను (అమెరికా కాలమానం ప్రకారం) మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు. వాణిజ్య యుద్ధ ఆందోళనల వేళ ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయి. స్కాట్ బెసెంట్, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్.. చైనా ప్రతినిధులతో సమావేశమయ్యారు. దీనిపై బెసెంట్ మాట్లాడుతూ.. చర్చలు ఫలప్రదంగా జరిగాయని తెలిపారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఇరుదేశాలు పరస్పరం విధించుకున్న టారిఫ్‌లు భారీ స్థాయిలోనే ఉన్నాయని, వాటిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే, సుంకాల తగ్గింపునకు అంగీకరించారా లేదా? అన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. అనంతరం గ్రీర్ స్పందిస్తూ.. ఇరుదేశాల మధ్య 1.2 ట్రిలియన్ డాలర్ల వాణిజ్య లోటును తగ్గించుకునేందుకు ఇరువైపులా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా దీనిపై ట్రూత్ వేదికగా పోస్ట్ చేశారు. "చైనాతో మంచి భేటీ జరిగింది. చాలా విషయాలు చర్చకు వచ్చాయి. కొన్నింటిపై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరింది. రెండు దేశాలకు ప్రయోజనకర నిర్ణయాలు తీసుకోవాలనే మేం కోరుకుంటున్నాం. మంచి పురోగతి లభించింది" అని ఆయన రాసుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. ఇలా అధిక టారిఫ్‌లు విధించుకోవడం అంటే ఈ దేశాలు ఒకదానికొకటి ఉత్పత్తులను బహిష్కరించుకోవడం కిందే లెక్క. గత ఏడాది ఈ రెండు దేశాల మధ్య వాణిజ్యం 660 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తాజా చర్చల ప్రారంభానికి ముందే, చైనాపై అమెరికా సుంకాలు తగ్గించవచ్చని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. 80 శాతం సుంకాల విధింపు సరైనదిగా భావిస్తున్నామని తెలిపారు. ఇదిలాఉండగా.. భారత్ సహా ఇతర దేశాలతోనూ త్వరలో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని శ్వేతసౌధం ఆర్థిక సలహాదారు కెవిన్ హాసెట్ వెల్లడించారు.

# యుద్ధమంటే బాలీవుడ్ సినిమా అనుకుంటున్నారా?..

**(లోకల్ గైడ్):**ఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై పెదవి విరుస్తున్న వారికి నరవణే కౌంటర్ ఇచ్చారు. యుద్ధం అంటే బాలీవుడ్ సినిమా కాదు.. యుద్ధం వల్ల సరిహద్దు గ్రామాల ప్రజల పరిస్థితి ఏంటో ఎవరికైనా తెలుసా? అని ప్రశ్నించారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణే తాజాగా మాట్లాడుతూ.. 'భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై అందరూ మాట్లాడుతున్నారు. అసలు యుద్ధం అంటే ఏం తెలుసా?. యుద్ధమంటే బాలీవుడ్ సినిమా అనుకుంటున్నారా?. యుద్ధం అంత రొమాంటిక్‌గా ఉండదు. యుద్ధానికి వెళ్లడానికి నేను సిద్ధమే అయినా దౌత్యాన్ని తొలి అవకాశంగా చూస్తాను. యుద్ధం అనేది మనం ఎంచుకునే చివరి అవకాశంగా ఉండాలి. అందుకే ప్రధాని మోదీ ఇది యుద్ధాల శకం కాదని చెప్పారు. తెలివితక్కువ వాళ్ల వల్ల బలవంతంగా యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా.. దాన్ని నివారించేందుకే మనం మొగ్గు చూపాలి. ఇప్పుడు చాలామంది పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్నారు. సైన్యంలో పనిచేసిన వ్యక్తిగా.. చర్చలతోనే సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటాను. యుద్ధం వల్ల సరిహద్దు గ్రామాల ప్రజల పరిస్థితి ఘోరంగా ఉంటుంది. చిన్నపిల్లలు సైతం బిక్కుబిక్కుమంటూ రాత్రి పూట ఆశ్రయ కేంద్రాలకు పరిగెత్తాల్సి పరిస్థితులు ఉంటాయి. ఇవేవీ మిగతా వారికి తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు తమ తల్లిదండ్రులను కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొన్నిసార్లు దాడుల కారణంగా పిల్లలు సైతం తీవ్రంగా గాయపడతారు. యుద్ధం ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. దీర్ఘకాలిక ఆర్థిక భారం మోయాల్సి వస్తుంది. యుద్ధమంటే ఖరీదైన వ్యాపారం' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. అంతకుముందు ఆపరేషన్ సిందూర్‌పై మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా ఉంది అంటూ ఆయన ట్వీట్ చేశారు. దీంతో, ఆయన కామెంట్స్‌పై తీవ్రమైన చర్చ జరిగింది. మరోవైపు.. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో భిన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఈ ఒప్పందానికి భారత్ ఎందుకు ఒప్పుకుందని అటు ప్రతిపక్షాలు, సోషల్ మీడియాలో కొందరు ప్రశ్నించారు. ఇప్పటి వరకు రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధం కారణంగా భారత్‌కు జరిగిన లాభమేంటి? అని కామెంట్స్ చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై

# శ్వేతపత్రం విడుదల చేయాలి

హైదరాబాద్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు. అన్ని భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టేలా జీవో తీసుకొచ్చారన్నారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. "టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిస్తే ఎందుకు దాచారో సీఎం జవాబివ్వాలి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టాక 1.75 లక్షల ఎకరాలకు ఎవరిది బాధ్యత? నిపుణుల సిఫార్సు లేకుండా చేస్తే జీవోను ఉపసంహరించుకోవాలి. భూములు కుదువ పెట్టి.. వచ్చిన డబ్బు పక్కదారి పట్టించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.80 లక్షల కోట్ల అప్పులు చేసింది. రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు, వడ్డీల కోసం చెల్లించారు. మిగిలిన రూ.లక్ష కోట్లు ఎక్కడికి పోయాయి? ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

### పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం..

నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలే చెబుతున్నా. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. అది సరికాదు. సమయం వస్తే అన్నీ బయటకు వస్తాయి. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను. నాపై దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని భావిస్తున్నా" అని కవిత తెలిపారు.

## చత్తీస్‌గఢ్ లో ఘోర రోడ్డు ప్రమాదం ..

# 13 మంది దుర్మరణం

**(లోకల్ గైడ్):**చత్తీస్‌గఢ్: చత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రాయ్‌పూర్ – బలోద బజార్ మార్గంలో ఈ రోజు వేకువజామున జరిగిన ఈ దుర్ఘటనలో 13 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రయాణికులతో వెళుతున్న వాహనాన్ని అతివేగంగా వస్తున్న ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో తొమ్మిది మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. మరో 30 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు రాయ్‌పూర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ తెలిపారు. బాధితులు ఓ వివాహ వేడుకకు హాజరై చౌతియా ఛత్తీ నుంచి రాయ్‌పూర్ వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# పాక్ తో చర్చల్లో బిగ్ ట్విస్ట్, ప్రధాని పట్టు

మొదటి పేజి తరువాయి

ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుందని క్లారిటీ ఇచ్చారు. దీంతో, చర్చల వేళ తదుపరి పరిణామాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

మోదీ కీలక సమీక్ష

ఇండో, పాక్ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్స్ సమావేశం వాయిదా పడింది. ప్రధాని మోదీ కీలక సమావేశం ఏర్పాటు చేసారు. ఈ భేటీ అనంతరం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో వివిధ అంశాల పై వీరు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. రక్షణ ఉన్నతాధికారులతో ప్రధాని నిర్వహించిన రెండో కీలక భేటీ ఇది. ఇలా వరుస భేటీలతో పాక్ పైన ఒత్తిడి పెంచే వ్యూహాలకు మోదీ పదును పెడుతున్నారు. భారత్ డిమాండ్ల పైన పాక్ స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. పాక్ ను పూర్తిగా ఫిక్స్ చేసే లక్ష్యంతోనే చర్చలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

భారత్ కీలక డిమాండ్లు

రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డీజీ ల మధ్య హాట్ లైన్ లో చర్చలు జరుగుతున్నాయి. 48 గంటల పాటు కాల్పుల విరమణ, కొనసాగిం , ఉద్రిక్త వాతావరణం తగ్గించడం వంటి కీలక అంశాలపై ఇరు దేశాలు చర్చించనున్నాయి. కాగా, ఈ చర్చల సమయంలో



భారత్ తమ డిమాండ్స్ ఏంటనేది తేల్చి చెప్పింది. కాల్పుల విరమణ కోసం భారత్ ప్రధానితో అమెరికా వైస్ ప్రెసిడెంట్ వాన్స్ మాట్లాడిన సమయంలోనే కొన్ని అంశాల పైన స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. అందులో ప్రధానంగా పాక్ లో ఉన్న మసూద్ అజార్ తో పాటుగా టాప్ ఉగ్రవాదులను అప్పగించా లనేది ప్రధాన డిమాండ్ గా ఉంది.

అదే సమయంలో పీఓకే ను పాక్ ఖాళీ చేయాల్సిందేనని మోదీ తేల్చి చెప్పినట్లు సమాచారం.

పాక్ మళ్లీ రెచ్చగొడితే

కాల్పుల విరమణ నిర్ణయం తరువాత భారత్ సరిహద్దు ప్రాంతాల్లో రెచ్చగొట్టే చర్యలకు దిగింది. డ్రోన్లతో దాడులకు ప్రయత్నించింది. భారత సైన్యం వాటిని ధీటుగా తిప్పి కొట్టింది. ఇక, ఎలాంటి షరతులు లేకుండా చర్చలు జరగాలని ఒప్పందంలో భారతదేశం స్పష్టంగా చెప్పింది. కాల్పుల విరమణ ప్రాధాన్యతగా అంగీకారాన్ని పాకిస్తాన్ తెలిపింది. ముందస్తు, తదుపరి షరతులు లేకుం నే చర్చలు జరగాలని భారత్ స్పష్టం చేసింది. కాల్పుల విరమణ వేళ జరుగుతున్న ఈ చర్చల్లో భారత్ తమ వైఖరి స్పష్టం చేసేందుకు సిద్ధం అవుతోంది. ఉగ్రవాదుల విషయంలో భారత్ కఠినం ఉంటామనే సంకేతాలు ఇవ్వనుంది. ఇదే సమయంలో పాక్ లో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులను అప్పగించే అంశం పైన భవిష్యత్ లోనూ పట్టుబట్టాలని భావిస్తోంది. దీంతో, చర్చలకు ముందే భారత్ డీజీఎంఓ మీడియా సమావేశంలో తమ వైఖరి స్పష్టం చేయనున్నారు. దీంతో, ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# ఆర్ఆర్‌పై భూసేకరణ భారం

**(లోకల్ గైడ్):**అమరావతి: అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు 70 మీటర్ల బదులు 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణకు ప్రాథమికంగా సమ్మతించిన కేంద్రం.. ఇందుకయ్యే వ్యయంలో రాష్ట్రం కూడా కొంత భరించాలని కోరింది. దీంతో రూ.వెయ్యి కోట్లు వెచ్చించేందుకు రాష్ట్రం సమ్మతించినట్లు తాజాగా తెలిసింది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనా.. ఓఆర్ఆర్ భవిష్యత్ దృష్ట్యా అంగీకరించింది. 70 మీటర్ల వెడల్పుతో 189.4 కి.మీ. మేర ఆరు వరుసలతో ఓఆర్ఆర్ నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ గత డిసెంబరు 20న ఆమోదం తెలిపింది. భవిష్యత్‌లో ఓఆర్ఆర్ విస్తరణ, ఇతరాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడే 150 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1న కేంద్రానికి లేఖ రాసింది. మార్చి 5న సీఎం చంద్రబాబు దిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయినప్పుడూ దీని గురించి వివరించారు. దీంతో 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణకు గడ్కరీ సమ్మతించారు.

రూ.వెయ్యి కోట్ల మెలిక

తొలుత ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదించినట్లు 70 మీటర్ల వెడల్పు కాకుండా, అదనంగా మరో 70 మీటర్లు కలిపి భూసేకరణ చేస్తే.. అందుకయ్యే ఖర్చులో కొంత భరించాలని కేంద్ర మంత్రి కోరారు. చివరకు రూ.వెయ్యి కోట్లు రాష్ట్రం వెచ్చించేందుకు సీఎం అంగీకరించారు. దీంతో 140 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్‌కు ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలపనుంది. ఓఆర్ఆర్ ఓఆర్ఆర్‌కు ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలపనుంది. ఓఆర్ఆర్ నిర్మాణం నేపథ్యంలో విజయవాడ తూర్పు బైపాస్ ప్రతిపాదనను పక్కనపెట్టారు. అయితే రాజధాని ప్రాంతాన్ని ఓఆర్ఆర్‌తో అనుసంధానించేందుకు రెండుచోట్ల లింక్ రోడ్లు (స్పర్ రోడ్స్) నిర్మాణానికి ఎలైన్‌మెంట్ కమిటీ ఆమోదం తెలిపింది.

గొల్లపూడి మీదుగా వచ్చే విజయవాడ పశ్చిమ బైపాస్.. కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారిలో కాజా వద్ద కలుస్తుంది. అక్కడి నుంచి కొత్త లింక్ రోడ్ మొదలై 17.5 కి.మీ. ప్రయాణించి ఓఆర్ఆర్‌లో మంగళగిరి- తెనాలి రోడ్డు క్రాస్ అయ్యే చోట కలుస్తుంది. ఈ లింక్ రోడ్‌ను ఆరు వరుసలుగా నిర్మించాలని ప్రతిపాదించారు. మరో లింక్ రోడ్ కోల్‌కతా- చెన్నై హైవేలోనే గుంటూరు శివారులోని బుడంపాడు దగ్గర మొదలై 5.2 కి.మీ. ప్రయాణించి నారాకోడూరు సమీపంలో ఓఆర్ఆర్‌లో కలుస్తుంది. దీనిని నాలుగు వరుసలతో నిర్మించేలా ప్రతిపాదించారు.

3,400 హెక్టార్లు అవసరం

ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌కు మొదట ఆమోదం తెలిపినప్పుడు.. మొత్తంగా రూ.16,310 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో 1,702 హెక్టార్లను సేకరించేందుకు రూ.2,665 కోట్లు ఖర్చవుతుందని లెక్కించారు. 140 మీటర్ల వెడల్పుతో చేపడితే.. సుమారు 3,400 హెక్టార్లు అవసరమవుతుంది. వ్యయం రూ.5,200 కోట్ల వరకు పెరుగుతుంది. దీనిలో రూ.వెయ్యి కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది.

## మా పోరాటం ఉగ్రవాదులపైనే..

# పాక్ నష్టానికి బాధ్యత వారిదే

మొదటి పేజి తరువాయి




దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఏకే భారతి

"పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం. పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా మనం యుద్ధం చేశాం. అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్‌ను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకూ ఎలాంటి నష్టం చేయలేదు. అదే సమయంలో పాకిస్థాన్ వైపు నుంచి దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. చైనా తయారు చేసిన పీఎల్-15 క్షిపణిని నేలకూల్చాం. పాకిస్థాన్‌కు చెందిన అనేక డ్రోన్లు, మిస్సైళ్లను కూల్చివేశాం. ఉగ్రవాదంపై పోరాటంలో పాక్ సైన్యం జోక్యం చేసుకుంటే తిప్పికొట్టాం. కరాచీ సమీపంలోని లక్ష్యాలపైనా దాడులు చేశాం" అని ఎయిర్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు.

పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్

భారత్ వైపు గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామన్నారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని చెప్పారు. డ్రోన్లు, హైస్పీడ్ మిసైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు పేర్కొన్నారు. "వందల కి.మీ దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నాం. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. మన స్వదేశీ ప్రతిస్పందన దాడి వ్యవస్థ చాలా బలమైంది. సైన్యానికి అండగా నిలిచిన 140 కోట్ల మంది ప్రజలకు ధన్యవాదాలు. ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది" అని వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చిందని.. ఉగ్రవాదులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆర్మీ డీజీఎంవో రాజీవ్ ఘాయ్ అన్నారు.

## పహల్గామ్ దాడి సాకుతోనే

# భారత్ మాపై దాడికి దిగింది

మొదటి పేజి తరువాయి




కొన్ని రోజుల పాటు కొనసాగిన తీవ్ర సరిహద్దు ఉద్రిక్తతల అనంతరం భూమి, గాలి, సముద్ర మార్గాల ద్వారా అన్ని రకాల సైనిక చర్యలను నిలిపివేయడానికి భారత్, పాకిస్థాన్ అంగీకరించిన కొన్ని గంటలకే షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తన ప్రసంగంలో జాతీయవాద అంశాలను ప్రముఖంగా ప్రస్తావించిన ఆయన "మా చర్య విద్వేషం, దురాక్రమణ, మత మూర?త్వంపై జరిగింది. ఇది మా సూత్రాలకు, గౌరవానికి దక్కిన విజయం. ఒక గౌరవప్రదమైన దేశానికి తగిన శత్రువుతో మేం దీన్ని చేశాం. ఇది కేవలం సాయుధ బలగాల విజయం మాత్రమే కాదు, మొత్తం జాతి విజయం" అని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇస్లామాబాద్ చొరవతో జరిగిన దౌత్యపరమైన అవగాహన కాదని, పాకిస్థాన్ సైనిక పరాక్రమం వల్లే సాధ్యమైందని షరీఫ్ తన టెలివిజన్ ప్రసంగంలో చిత్రీకరించే ప్రయత్నం చేశారు. "శత్రువుకు బాగా అర్థమయ్యే భాషలోనే సమాధానం చెప్పాలని మేం నిర్ణయించుకున్నాం" అని ఆయన ప్రకటించారు. పాకిస్థాన్ "ఆత్మగౌరవం, నిజాయితీ కలిగిన దేశం" అనడానికి ఈ ఒప్పందమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తమ సాయుధ బలగాలు భారత్ వైమానిక స్థావరాలు, ఆయుధాగారాలను ధ్వంసం చేశాయని షరీఫ్ ఘనంగా ప్రకటించారు. అయితే, ఈ ఆరోపణలను భారత అధికారులు కల్పితాలుగా కొట్టిపారేశారు. దాదాపు 20 నిమిషాల తన ప్రసంగంలో షరీఫ్ మొత్తం విషయాన్ని మార్చివేసేందుకు ప్రయత్నించినట్లు కనిపించింది. పహల్గామ్ ఘటనను సాకుగా చూపి భారత్ తమపై 'అన్యాయమైన యుద్ధం' ప్రకటించిందని, పాకిస్థాన్‌ను బాధితురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. భారత బలగాలు పౌరులు, మసీదులు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత్ తప్పుడు ప్రచారంగా ఖండించింది. వాస్తవానికి, క్షేత్రస్థాయి దృశ్యాలు భారత వైమానిక స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని, మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని చూపించాయి. ఇది షరీఫ్ వాదనలకు విరుద్ధంగా ఉంది. అంతేకాకుండా కాల్పుల్లో పాకిస్థాన్ పౌరులకు ఎలాంటి హాని కలగకుండా ఉండేలా ప్రతీకార చర్యలు పద్ధతి ప్రకారం చేపట్టామని భారత ప్రభుత్వం తెలిపింది.

# నర్సుల సేవలు అనన్య సామాన్యం

మొదటి పేజి తరువాయి



వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని కొనియాడారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని తెలిపారు. మహమ్మారి కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నర్సులు చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇక, ఇటీవల సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ పాఠశాలలో సంభవించిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డ తర్వాత ఆసుపత్రిలో చేరాడని, అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి వారి కష్టం గుర్తుకొచ్చిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వారిని కలవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని జనసేనాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నర్సులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# ఓ వైపు భానుడి భగభగలు.. మరో వైపు వరుణుడి ప్రతాపం..!

మొదటి పేజి తరువాయి

ఆయా ప్రాంతాల్లో పలుచోట్ల వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఆదివారం నుంచి గురువారం వరకు పశ్చిమ బెంగాల్, బిహార్, జార?ండ్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వేడిగాలులుంటాయని పేర్కొంది. వెస్టర్న్ డిస్ట్రబెన్స్ కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకునే అవకాశాలున్నాయని తెలిపింది. ఉత్తర పాకిస్తాన్ సమీపంలో తుఫాను చురుగ్గా ఉందని.. దాంతో పాటు ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది. దాంతో ఆది, సోమవారాల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లోనూ పలుచోట్ల వానలు కురుస్తాయని అంచనా వేసింది. రాబోయే ఐదు రోజుల్లో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం, మణిపూర్, త్రిపురలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు పడుతాయని తెలిపింది. దాంతో వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. అదే సమయంలో దక్షిణ భారతంలోనూ రాబోయే రెండురోజులు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడులోని తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడేందుకు అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. హిమాచల్‌లో వర్షం, హిమపాతం కారణంగా చలి పెరిగింది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే కేరళను తాకుతాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

## సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో

# జీసీసీ హబ్‌గా హైదరాబాద్

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించాయి. హైదరాబాద్ అంతర్జాతీయ ప్రాముఖ్యత పెరిగింది. ప్రస్తుతం మిస్ వరల్డ్ పోటీలకు ఈ నగరం ఆతిథ్యమిస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లు హైదరాబాద్‌లో నిర్వహిస్తాం. తెలంగాణ అనేక కీలక రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం పోలీసింగ్ లో గానీ, చట్టాలను సరిగా అమలు చేయడంలోగానీ, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ కల్పన, పన్నుల వసూళ్లలో తెలంగాణ అగ్రగామిగా ఉంది. స్వయం సహాయ సంఘాల ద్వారా 66 లక్షల మందికి పైగా మహిళలకు సాధికారత కల్పిస్తూ, దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఫండింగ్ మరియు మెంటరింగ్ కార్యక్రమాన్ని తెలంగాణ అమలు చేస్తోంది. రాజీవ్ యువ వికాసం కార్యక్రమం ద్వారా వేలాది యువతకు వ్యాపార, స్వయం ఉపాధి రంగాల్లో మద్దతు అందిస్తున్నాం. అలాగే, సమానత్వం దిశగా కీలక అడుగు వేసిన తెలంగాణ, ట్రాన్స్‌జెండర్ వాలంటీర్లను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ బృందంలో చేర్చిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణలో మౌలిక సదుపాయాలు, వివిధ ప్రాజెక్టుల కోసం డ్రైపోర్టును ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని సముద్రతీర పోర్టుకు అనుసంధానం చేయనున్నాం. భారతదేశంలోనే అత్యంత శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని చేపట్టాం. ఇందులో ప్రత్యేకంగా 'ఏఐ సిటీ' కూడా ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నాం. 2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు తెలంగాణ ? 3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, దాదాపు 1 లక్షకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించాం. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశాల ద్వారా పెట్టుబడుల ఆకర్షణలో భారతదేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిచింది. దావోస్ సమావేశంలోనే ?1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు లభించాయి." అని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, సోనాటా సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శ్రీ సమీర్ ధీర్ గారితో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



లోకల్ గైడ్ తెలంగాణ

సంపాదకీయం

# సముచిత నిర్ణయాలు

## (విశ్లేషణ)

స్వీయ లోటుపాట్లను సరిదిద్దుకోవటంలో న్యాయవ్యవస్థ సక్రమంగా వ్యవహరించటం లేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న రెండు నిర్ణయాలు ఎన్నదగి నవి. ఇప్పటికే 21 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించగా, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొన్న మార్చి 4న ఢిల్లీలోని తన అధికార నివాసంలో భారీ యెత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ లేఖ రాయటం కీలక పరిణామం. ఆ ఉదంతంపై విచారణకు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికనూ, జస్టిస్ వర్మ ఇచ్చిన ప్రత్యుత్తరాన్ని కూడా దానికి జతపరిచారు. అవినీతి మకిలి అంటిన న్యాయమూర్తుల్ని తొలగించటమనే ప్రక్రియ చాలా సుదీర్ఘమైనదీ,సంక్లిష్టమైనదీ. న్యాయమూర్తిపై ఆరోపణలొచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంత ర్గత విచారణ కమిటీని నియమించటం, అది ఇచ్చే నివేదికపై నిందపడిన న్యాయమూర్తి అభిప్రా యాన్ని కోరటం, ఆ తర్వాత అవసరమనుకుంటే రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయమని అడగటం రివాజుగా వస్తోంది. అందుకు నిరాకరిస్తే పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తారు. ఈ తీర్మానం కోసం ఇచ్చే నోటీసుపై లోక్‌సభలో కనీసం 150 మంది ఎంపీలూ, రాజ్యసభలో కనీసం 50 మందిఎంపీలూ సంతకాలు పెట్టాల్సివుంటుంది. ఆ తీర్మానాన్ని అనుమతించాలో లేదో స్పీకర్ లేదా రాజ్య సభ చైర్మన్ నిర్ణయిస్తారు. రాజ్యాంగంలోని 124, 218 అధికరణలు దుర్వర్తన లేదా అసమర్థత ఆరోపణల ఆధారంగా న్యాయమూర్తుల తొలగింపునకు అవకాశాన్నిస్తున్నాయి. అయితే ఇన్ని దశా బ్దాల్లో ఈ ప్రక్రియ కింద పదవిని కోల్పోయిన న్యాయమూర్తి ఒక్కరూ లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగని ఫిర్యాదుల సంఖ్య తక్కువేం లేదు. 2017-2021 మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ 1,631 ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. అయితే అంతర్గత విచారణ ప్రక్రియ రహస్యమైనది కావటంవల్ల ఎంతమంది న్యాయమూర్తులపై విచారణ జరిగిందో, ఎందరిపై చర్యలు మొదలయ్యాయో తెలియదు. తొలిసారి 1993లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిపై నిధుల దుర్వినియోగం విషయంలో వచ్చిన ఆరోపణల పర్యవసానంగా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ నడిచింది. అప్పట్లో ఆయనపై వచ్చిన 14 ఆరోపణల్లో పదకొండింటికి ఆధారాలున్నాయని తేల్చారు. తీరా పార్లమెంటులో అభిశంసన తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు కాంగ్రెస్ గైర్హాజర్ కావటంతో అది వీగిపోయింది. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీడీ దినకరన్‌పైనా ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగం వచ్చింది. అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన రాజీనామా చేయటంతో అది అర్థాంతరంగా ముగిసింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వీరాస్వామిపై అవినీతి కేసులో సీబీఐ చార్జిషీటు నమోదు చేసింది. కానీ విచారణ ముందుకు సాగకుండా ఆయన అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు 2010లో ఆయన మరణించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వివరణనివ్వాలని కోరింది కూడా. కానీ ఇంతవరకూ అదేం జరగలేదు. అదే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎస్ఎన్ శుక్లా అవినీతిపై అంతర్గత కమిటీకి ఆధారాలు లభ్యమయ్యా యన్నారు. కేసుల విచారణ పని అప్పగించటం మానే శారు. కానీ ఆయన రిటైరయ్యేవరకూ న్యాయ మూర్తిగా జీతభత్యాలు తీసుకుంటూనే వున్నారు. అందుకే అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యో గులూ, రాజకీయ పక్షాల నేతల మాదిరి న్యాయమూ ర్తులపై విచారణ సాగటం లేదన్న విమర్శలుంటున్నాయి. జస్టిస్ వర్మ వ్యవహారశైలి మొదటినుంచీ అనుమానాలకు తావిచ్చేదిగావుంది. మార్చి 14-15 రాత్రి అగ్నిప్రమాదం జరిగినప్పుడు కొన్ని కరెన్సీ కట్టలు తగలబడినా, మిగిలినవి సురక్షతంగా వున్నాయని మొదటగా అక్కడికొచ్చిన అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చెప్పగా... అటుపై బాగున్న కట్టలు మాయమయ్యాయి. దీనిపై జస్టిస్ వర్మ వివరణ సంతృప్తికరంగా లేకపోవటంతో వ్యవహారం అభిశంసన వరకూ వెళ్లింది. ఇప్పటికే కేసుల విచారణనుంచి ఆయన్ను తప్పించారు. నిజానికి జస్టిస్ వర్మ ఉదంతం ప్రభావంతోనే న్యాయవ్యవస్థపై నింద పడకూడదన్న ఉద్దేశంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో న్యాయమూర్తులు ఆస్తులు ప్రకటిస్తున్నా ఎవరైనా సమాచార హక్కు చట్టంకింద కోరితే తప్ప వివరాలు బహిరంగపరిచే విధానం లేదు. బ్రిటన్, కెనడాల్లోనూ అంతే. అయితే అమెరికా, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రష్యాల్లో చట్టప్రకారం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి. ఏదేమైనా జస్టిస్ సంజీవ్ ఖన్నా తాజా నిర్ణయం పారదర్శకత దిశగా ఒక కీలకమైన ముందడుగనే చెప్పాలి. అయితే నిందపడిన న్యాయమూర్తులను లోక్‌పాల్ చట్టం కింద విచారించవచ్చునా లేదా అన్నది ఇంకా తేలాల్సేవుంది. మొత్తానికి స్వీయప్రక్షాళనకు న్యాయవ్యవస్థ నడుం బిగించటంప్రశంసనీయమైన పరిణామం.

# పక్కా ఆధారాలతో బయటపడ్డ పాక్ బండారం..! ఉగ్రవాదిని మానవతా వాది అంటూ దొంగనాటకాలు!

**(లోకల్ గైడ్):** పాకిస్తాన్ తన దేశంలో పెరుగుతున్న ఉగ్రవాదాన్ని దాచడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది. కానీ, ఎంత దాచాలని ప్రయత్నిస్తున్నా.. ప్రపంచానికి దాని నిజ స్వరూపం తెలుస్తూనే ఉంది. పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యం అమాయక మతాధికారిగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్న ఉగ్రవాది, ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ప్రధాన నాయకుడు, సహాయక చర్యల ముసుగులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాడు. అతని పేరు హాఫీజ్ అబ్దుల్ రవూఫ్. గత కొన్ని రోజులుగా వైరల్ అవుతున్న ఓ ఫోటోలో ఉన్న వ్యక్తి ఉగ్రవాది కాదని, మత నాయకుడు అని పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ వ్యక్తి కొంతమంది పాకిస్తాన్ సైనికులతో పాటు అంత్యక్రియల ఊరేగింపులో కనిపించాడు. ఆ వ్యక్తి తన ఐడి కార్డు కూడా చూపించి తాను ఒక సాధారణ రాజకీయ కార్యకర్తనని చెప్పాడు. అయితే పాకిస్తాన్ సైన్యం ఇచ్చిన ఆ వ్యక్తి సమాచారం.. అంటే పేరు, పుట్టిన తేదీ, జాతీయ గుర్తింపు సంఖ్య కూడా అమెరికాచే ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించబడిన వ్యక్తితో పూర్తిగా సరిపోలుతున్నట్లు తేలింది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ లష్కరే తోయిబా, దాని ఫ్రంట్ సంస్థల కోసం విరాళాలు సేకరిస్తున్నాడు. పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి చూపించిన ఐడి కార్డులో అతను "వెల్ఫేర్ వింగ్ ఇన్‌చార్జ్, పీఎంఎంఎల్" అని ఉంది, అంటే అతను తన కార్యకలాపాలను దాచడానికి ఒక రాజకీయ లేదా మతపరమైన సంస్థ పేరును ఉపయోగిస్తున్నాడు. పాకిస్తాన్ సైన్యం మత ప్రచారకుడిగా అభివర్ణించిన వ్యక్తి నిజానికి ఒక అంతర్జాతీయ ఉగ్రవాది. దీన్ని బట్టి పాకిస్తాన్ ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తోందని, ప్రపంచాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని స్పష్టమవుతోంది.

1999 నుండి లష్కర్ కోసం పనిచేస్తున్నాను..

యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. ఉగ్రవాది హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ ఫేస్ ఆఫ్ ది లష్కరే తోయిబాగా ఉన్నాడు. లష్కరే తోయిబా అగ్ర నాయకత్వ బృందంలో చేరిన హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ 1999 నుండి ఆ సంస్థ కోసం పనిచేస్తున్నాడు. రవూఫ్ లష్కరే ఫ్రంట్ సంస్థ ఫలాహ్-ఎ-ఇన్సానియత్ ఫౌండేషన్ అధిపతి, ఇది సహాయ చర్యల ముసుగులో ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు సేకరిస్తుంది. 2008 ముంబై దాడుల తర్వాత లష్కరేపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగినప్పుడు, రవూఫ్ FIF పేరుతో పాకిస్తాన్‌లో నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాడు. 2009లో ఈ కార్యక్రమం నుండి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు సమాచారం. లష్కరే తోయిబా, జమాత్-ఉద్-దవా అధిపతి హాఫీజ్ మొహమ్మద్ సయీద్ సూచనల మేరకు రవూఫ్ నేరుగా పనిచేస్తాడు.




2008లో రవూఫ్ లష్కర్ మానవతా సహాయ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. 2003లో పబ్లిక్ సర్వీస్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆగస్టు 2008లో హాఫీజ్ సయీద్ ఆదేశం మేరకు,పాకిస్తాన్‌లోని బజౌర్ ప్రాంతంలో సహాయ, నిధుల సేకరణ కార్యకలాపాలను సమీక్షించడానికి రవూఫ్ ఒక బృందానికి నాయకత్వం వహించాడు. ఇది మాత్రమే కాదు, రవూఫ్ లష్కర్ ప్రతినిధిగా కూడా ఉన్నాడు. ఆయన సంస్థ తరపున మీడియాలో, వెబ్‌సైట్‌లలో, ప్రజా వేదికలలో మాట్లాడుతున్నాడు. FIF ద్వారా అతను లష్కర్ కు ప్రజల మద్దతు, నిధులను సేకరించడానికి హై-ప్రొఫైల్ మీడియా ఈవెంట్లను నిర్వహిస్తాడు. డిసెంబర్ 2008లో లష్కర్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ఇంటర్వ్యూలో రవూఫ్ లష్కర్, జమాత్-ఉద్-దవా సంక్షేమ కార్యకలాపాల గురించి బహిరంగంగా మాట్లాడాడు, దానిని తన సంస్థ అని పేర్కొన్నాడు.

ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్‌కు నాయకత్వం వహించాడు

హాఫీజ్ రవూఫ్ లష్కర్ స్వచ్ఛంద విభాగం "ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్" అంటే IKKకి కూడా నాయకత్వం వహించాడు. 2007లో అతను పెషావర్‌కు వెళ్లి, వరద బాధితుల సహాయ చర్యలను పర్యవేక్షించాడు. మే 2004లో జమాత్-ఉద్-దవా సంక్షేమ అధిపతిగా అతను ఒక వైద్య సంస్థ వార్షిక నివేదికను కూడా సమర్పించాడు. IKK, JUD లను 2006 ఏప్రిల్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు సంస్థలుగా అమెరికా గుర్తించింది. హాఫీజ్ సయీద్‌ను మే 2008లో ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్ గా ప్రకటించారు. 2008 డిసెంబర్ లో జమాత్-ఉద్-దవాను UN 1267 ఆంక్షల జాబితాలో ఉంచారు. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ పై వచ్చిన ఆరోపణలు, ఉగ్రవాద సంస్థలు సేవ పేరుతో ఎలా భయాన్ని వ్యాప్తి చేస్తాయో మరోసారి నిరూపిస్తున్నాయి.

# ఆపరేషన్ సింధూర్‌లో ఇప్పటి వరకు ఎంత మంది భారత సైనికులు అమరులయ్యారంటే..?

**(లోకల్ గైడ్):**

పాకిస్తాన్‌కు ఇంతవరకూ చూపించింది ట్రైలరే.. మళ్లీ తోక జాడిస్తే అసలు సినిమా ముందుముందు చూపిస్తామని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకే ఆపరేషన్ సింధూర్ చేపట్టామని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. భారత సైన్యం. ఉగ్ర స్థావరాలను గుర్తించి అంతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. 9 ఉగ్ర శిబిరాలు ధ్వంసమవడంతో పాటు వందమంది ఉగ్రవాదులు అంతమయ్యారని ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్‌పై ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించిన త్రివిధ దళాల అధికారులు.. ఆపరేషన్‌పై కీలక వివరాలను వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 , పాకిస్థాన్‌లో 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు వివరించారు. భారత్ దాడులు చేస్తుందన్న భయంతో పాక్‌లోని ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయన్నారు. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించి దాడులు చేసినట్టు చెప్పింది భారత సైన్యం. అందుకు సంబంధించిన మ్యాప్‌లు, ఫోటోలను విడుదల చేసింది. భారత్ దాడులతో వణికిపోయిన పాకిస్తాన్.. మనదేశంలో పౌరులే లక్ష్యంగా దాడులకు పాల్పడింది. అయితే శత్రుదేశం అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది. మే 8, 9వ తేదీల్లో భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ విఫలయత్నం చేసింది. డ్రోన్లు, మానవరహిత విమానాలను భారత్‌పై ప్రయోగించింది. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పాక్ డ్రోన్ దాడులకు కౌంటర్‌గా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు చేసింది భారత్. మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నామని సైనిక అధికారులు తెలిపారు. ఇక మే 7 నుండి పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌లో భారతదేశానికి చెందిన 5 మంది సైనికులు అమరులయ్యారని భారత సాయుధ దళాలు తెలిపాయి. పాక్ పౌరులను లక్ష్యంగా చేసుకుని



భారత్ ఎలాంటి దాడులు చేయలేదు. పాకిస్తాన్ మాత్రం భారత్ నగరాలే లక్ష్యంగా దాడులకు తెగబడింది. అయితే భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాకిస్తాన్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చింది. భారత సైన్యం. దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో ప్రత్యక్ష్యంగా తెలుసుకుంది. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించింది భారత్. ఆ దేశం మళ్లీ తోక జాడిస్తే సరైన సమాధానం చెప్పడానికి.. సైన్యం, వాయుసేనకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సిద్ధంగా ఉంది.

# పిఓకె, ఉగ్రవాదులను భారత్‌కు అప్పగిస్తేనే చర్చలు.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదుః ప్రధాని మోదీ



**(లోకల్ గైడ్):** పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించే ఒప్పందంపై జరిగిన చర్చ సందర్భంగా, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో మాట్లాడారు. పొరుగు దేశంతో చర్చించాల్సిన ఏకైక విషయం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) తిరిగి రావడం మాత్రమే అని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. అలాగే పాకిస్తాన్ ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపైనే మాత్రమే చర్చలు జరుగుతాయని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేశారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై సుదీర్ఘంగా చర్చించారు. కాల్పుల విరమణ దిశగా పాకిస్థాన్‌ను ఒప్పించేందుకు తాము సిద్ధమని జేడీ వాన్స్ మోదీకి వివరించారు. దీనికి మోదీ ప్రతిస్పందనగా.. మరోసారి నిబంధనలు ఉల్లంఘించి పాక్ కాల్పులు జరిపితే.. తాము మౌనంగా ఉండబోమని.. ధీటుగా బదులిస్తామని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. "కాశ్మీర్ విషయంలో మాకు చాలా స్పష్టమైన వైఖరి ఉంది, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ తిరిగి రావడం అనే ఒకే ఒక విషయం మిగిలి ఉంది. ఇంకేమీ మాట్లాడటం లేదు. అలాగే ఉగ్రవాదులను అప్పగించడం గురించి వారు మాట్లాడితే, మనం మాట్లాడుకోవచ్చు. నాకు వేరే ఏ అంశం ఉద్దేశం లేదు" అని ప్రధాని మోదీ, జేడీ వాన్స్‌తో చెప్పినట్లు సమాచారం. ఈ అంశంపై భారతదేశం ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

"మేము ఎవరూ మధ్యవర్తిత్వం వహించాలని కోరుకోవడం లేదు. మాకు ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదు" అని ఆయన చెప్పినట్లు సమాచారం. రెండు దాయాది దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రత్యక్షంగా ప్రస్తావిస్తూ, పాకిస్తాన్ దాడులు జరిగిన అదే రాత్రి, భారతదేశం పాకిస్తాన్ అంతటా 26 స్థావరాలపై దాడులు చేసి ప్రతీకారం తీర్చుకుంది. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే దృఢ సంకల్పాన్ని ప్రదర్శించింది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, రెండు దేశాలు ఒకదానికొకటి సైనిక కదలికలను నిశితంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు.

అంతర్జాతీయ సమాజానికి, పాకిస్తాన్‌కు ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారు. భారతదేశం సరిహద్దు దాడులను సహించదని, అలాంటి ఏవైనా చర్యలను అధిక శక్తితో ఎదుర్కొంటామని ప్రదాని మోదీ వెల్లడించారు. ఈ పరిణామం, సరిహద్దు ఉగ్రవాదం, రెచ్చగొట్టే చర్యలను ఎదుర్కోవడంలో భారతదేశ విధానం మరింత చురుకైన, నిర్ణయాత్మక వ్యూహానికి మారిందని, దాని జాతీయ భద్రత విషయంలో రాజీకి అవకాశం లేదని సూచిస్తుంది. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. "మనం కొత్త సాధారణ స్థితిలో ఉన్నాం, ప్రపంచం దీనిని అంగీకరించాలి. పాకిస్తాన్ దీనిని అంగీకరించాలి, ఇది యథావిధిగా వ్యాపారం కాదు" అని మోదీ అన్నారు. పాకిస్తాన్ కాల్పులు జరిపితే, భారత్ మిస్సైల్స్‌తో దాడి చేస్తుందని భారత ప్రధానమంత్రి మోదీ గట్టి సందేశం ఇచ్చారు. మళ్లీ పాక్ కాల్పులకు తెగబడితే.. ధీటుగా స్పందించాలని భారత ఆర్మీని ప్రదాని మోదీ ఆదేశించారు. అటు నుంచి గోలీ మన దేశంలోకి వస్తే.. ఇటు నుంచి మిస్సైల్స్‌ను వదలండి అని ఆదేశించారు.

## అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ టఏ ఎస్ డబ్ల్యూ ఓఊ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది డా.పజ్జూరి స్వామి గౌడ్ సహకారంతో మజ్జిగ పంపిణీ.

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాయి నైసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి, డాక్టర్ రాపోలు అనిల్ కుమార్.




నల్లగొండ. లోకల్ గైడ్: నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల వివేకానంద విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ టఏ ఎస్ డబ్ల్యూ ఓ ఊ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది డా.పజ్జూరి స్వామి గౌడ్ సహకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాయినైసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి, డాక్టర్ రాపోలు అనిల్ కుమార్, ప్రముఖ న్యాయవాది డా.పజ్జూరి స్వామి గౌడ్ , హనుమాన్ దీక్ష మొదటి మాలాధారుడు వెంకటయ్య గురుస్వామి లు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాపోల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇంతటి ఎండలకు మజ్జిగ తాగితే ఆరోగ్యానికి చాలా మంచిదని అన్నారు. అలాగే చిన్న వయసులో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మంచి మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఏ ఎస్ డబ్ల్యూ ఓ టీం ని అభినందించారు. ఎప్పుడు హాస్పిటల్ లో బిజీగా ఉండే మాకు ఇలాంటి సేవా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అవకాశం ఇచ్చినందుకు ఏ ఎస్ డబ్ల్యూ ఓ చైర్మన్ సురకారపు యాదగిరి గౌడ్ , టీమ్ సభ్యులకి ధన్యవాదాలు తెలిపారు. డా.పజ్జూరి స్వామి గౌడ్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ఎండలో తిరిగేవారికి మంచినీటితోపాటు మజ్జిగ పంపిణీ కూడా చేయడంతో పాటు ఈ కార్యక్రమంలో నన్ను



భాగస్వామిగా చేసినందుకు ఏ ఎస్ డబ్ల్యూ ఓ కోశాధికారి పాలకూరి నర్సింహా గౌడ్ , టీంబీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏ ఎస్ డబ్ల్యూ ఓ చైర్మన్ సరకారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చిన్నపిల్లల్ని కూడా పాల్గొనేలా చేస్తే రాబోయే కాలంలో వారు కూడా ఇలానే సేవా దృక్పథంతో ఉంటారని ఆలోచనతో మా పిల్లలు సిరిచందన, ప్రగ్య, శ్రీయాన్స్ గౌడ్ లను కూడా కార్యక్రమానికి తీసుకొచ్చానన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ స్వచంద్ర సేవా సంస్థ సభ్యులు సురకారపు యాదగిరి గౌడ్, కంచర్ల రఘురాంరెడ్డి, పాలకూరి నర్సింహ గౌడ్, చర్లపల్లి అశోక్, బల్లెం యాదగిరి, బజరంగ్దళ్ నరసింహ, దొనాల లింగారెడ్డి, కట్టెబోయిన సంజీవ యాదవ్, మై విలేజ్ దాబా ప్రొప్రైటర్ వీరేశ్, జాల రమేష్, చింతపల్లి సదాలక్ష్మి, సురకారపు బిక్షమయ్య, శ్రవణ్ గౌడ్, మణిదీప్, మహమ్మద్ జానీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల తెలంగాణలో అందాల పోటీలు అవసరమా.



నల్లగొండ లోకల్ గైడ్: అప్పుల తెలంగాణలో అందాల పోటీలు అవసరమా అని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. సోమవారం నాగార్జున సాగర్ కు అందాల పోటీలు వ్యతిరేకస్తూ నీరసనకు సిద్ధమైన ఐద్వా నాయకత్వాన్ని జిల్లా వ్యాప్తంగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడన్ని ప్రభావతి తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా. అమే మాట్లాడుతూ “దునియా దేశాల మహిళా మనల్ని, అందాల బంధీకానాలేసి” ఆడదేహాలతో ఆడే జూదాలు అందాలంటే ఆడోళ్ళకే పేటెంట్స్ అంటగట్టి, గంట కొట్టింది పేట్రియార్క్ పెత్తనమే. వ్యాపార సోపాన సామ్రాజ్యాలకు కార్పొరేట్ కాస్మెటిక్స్ ల కరిగిచ్చి, కొలతల కొలిమిలో కోతలు పడే ఫాన్సీ ప్లాస్టిక్ అందచందాల విందులకు మహిళా మాంసం కొట్టులు పెట్టి సరుకు సైదులు అమ్ముకునే సంతలు ఈ అందాల పోటీలు అని ఈ ఫోటోల అంత సారాన్ని కవిత్వీకరిస్తారు ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర. అసలు అందమంటే ఏమిటో వాటికి పోటీలు నిర్వహించటం లోని అసలు ఉద్దేశాలు ఎప్పుడూ చర్చనీయాంశం అవుతూనే ఉన్నాయి. వివాదాలు, వ్యతిరేకతలు ఎన్ని ఉన్నా ప్రపంచ సుందరి పోటీలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మన రాష్ట్రంలోనే హైదరాబాద్ నగరం అందుకు వేదికయింది. ఈ పోటీ కార్యక్రమాన్ని ఇక్కడ విద్యార్థినులు తిలకించి స్ఫూర్తి పొందాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది కూడా. సాధికారత ఆత్మవిశ్వాసం, యువతలో కలుగ చేస్తుందని నిర్వాహకులు భావిస్తున్నట్లు ప్రకటించారు. నిజంగా అమ్మాయిలకు ప్రేరణ స్ఫూర్తి కలిగిస్తాయా ఇవి? ‘అందమే ఆనందం, ఆనందమే జీవిత మకరందం’ అంటాడు ఓ సినీ గీత రచయిత. ఆనందాన్ని కలిగించేది అందమని కవి హృదయం, ఎవరికి దేనివల్ల ఆనందం కలుగుతుందో ఎలా చెబుతాము! అందం అనేది చూసే వాళ్ళ చూపులో ఉంటుందన్నది ఆంగ్ల సామెత. ఒకరికి అందంగా కనిపించింది మరొకటి కనిపించకపోవచ్చు. అందం కొలతల ప్రమాణాల్లో, రంగుల్లో, ధరించే దుస్తుల్లో ఉండదు. “నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది” అంటాడు జాన్ కీట్స్.‘లోకో భిన్న రుచి’ అన్నట్లు వివిధ సాంస్కృతిక జీవన పరిమాణాల్లో రూపుదిద్దుకునే ఒక మానసిక భావనే అందం. అది భిన్న ప్రాంతాల్లో భిన్న రీతులుగా ఉంటుంది. మరి ఇప్పుడు ప్రపంచం అంతటికి అందమైనది అని ఎంపిక చేయడంలో సమంజసత్వం ఏమున్నది? అసలు అందమంటే రూపానికి సంబంధించినదే కాదు. స్త్రీల వ్యక్తిత్వాన్ని అందానికి, ప్రదర్శనకు పరిమితం చేస్తున్నారు అందమైన జరుపుగా మారుస్తున్నారు తెలంగాణ సంస్కృతికి ఇది పూర్తి వ్యతిరేకమైనది. కొంగు నడుముకు చుట్టి కొడవళ్ళు చేతబట్టిన చైతన్య సంస్కృతి ఇక్కడి మహిళలది. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి జిల్లా కమిటీ సభ్యురాలు కనుకుంట్ల ఉమారాణి ఉన్నారు.జిల్లా వ్యాప్తంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలన్నారు.

## వనంగా మారిన ప్రగతివనం

### అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా ప్రగతి వనం పట్టించుకోనే వారు కరువాయే...



కొత్తగూడెం లోకల్ గైడ్ : గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ వార్డులలో ప్రజలకు పచ్చదనాన్ని, ఆహ్లాదకర వాతావరణాన్ని ఇవ్వడానికి ఏర్పాటుచేసిన ప్రగతి వనలు, ఇప్పుడు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. కొత్తగూడెం రాజీవ్ పార్క్ పక్కనే ఉన్న మున్సిపాలిటీ కి చెందిన ప్రగతి వనం అడవిని తలపించేలా, పెద్దవనంగా మారింది, ఎవరైనా లోపటికి




వెళ్లాలంటే, వెలుపల బోర్డు తప్పించి, లోపల కూర్చునే బలాలు కూడా కనిపించట్లేదు, అంత చెట్లు పెరిగి, మద్యం సీసాలు, కనిపిస్తున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మరి, అటువైపు ఎవరైనా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడ్డది. పక్కనే ఉన్న ప్రగతి మైదానం, రాజీవ్ పార్కు కు అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్న, మున్సిపాలిటీ ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకొని ప్రగతి వనని శుభ్రం చేసి అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలు

- ఒకరు స్క్రిప్ట్ రాస్తారు.. మరొకరు డెలివరీ చేస్తారు
- ధనిక రాష్ట్రం అంటూ షో చేసి ఆగం చేశారు
- ఉన్న విషయాన్నే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలముందుంచారు
- ప్రతిపక్షాల విమర్శలకు ఒక హద్దు ఉండాలి
- మున్నేరు బాధితులందరికీ రివర్ ఫ్రంట్ కాలనీలో చోటు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి
- సోమవారం ఉదయం అధికారులతో కలిసి పనుల పరిశీలన



లోకల్ గైడ్: ఖమ్మం: బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని, ఒకరు స్క్రిప్ట్ రాసిస్తే మరొకరు డెలివరీ చేస్తారని, ఢిల్లీ స్థాయిలోనే మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధనిక రాష్ట్రం అంటూ గత పాలకులు షో చేశారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే లోగుట్టు మొత్తం బయట పడిందన్నారు. తినడానికి తిండి లేకున్నా మీసాలకు సంపెంగ నూనె రాసి ప్రజలను మభ్య పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- యథార్థ పరిస్థితినే సీఎం చెప్పారు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టా చూసి బాదేసిందని, దాదాపు 8 లక్షల 19 కోట్ల అప్పు ఉందని వెల్లడించారు. ఆ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారని, ఈ రోజు ఉన్న పరిస్థితిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు తెలియాలనే చెప్పారని అన్నారు. ఇంటి పెద్దగా కుటుంబాన్ని సక్రమంగా నడిపించే ప్రయత్నం చేస్తున్నామని, క్యాన్సర్ సోకితే ఒప్పుకోవాలని బయటకు తెలియకపోతే రోగం ముదురుతుందని పేర్కొన్నారు. ఇదే నిజాన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఒప్పుకోవాలని సూచించారు.

- విమర్శలకు హద్దుండాలి..

పొద్దున లేస్తే అధికార కాంగ్రెస్ పార్టీ మీద ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. సీతారామ ప్రాజెక్టు పనులు తాము పూర్తిచేస్తే కాంగ్రెస్ పార్టీ నీళ్లు చల్లుకుంటుందన్న బీఆర్ఎస్ నేతల మాటలకు పొంగులేటి గట్టి కౌంటర్ ఇచ్చారు. 90 శాతం పనులు పూర్తిచేస్తే ఇంకా 40 శాతం పనులు ఎలా మిగిలి ఉంటాయని ప్రశ్నించారు. కనీసం డ్రైరన్ కూడా చేయని బీఆర్ఎస్ నాయకులు మోటార్లు బిగించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మేం తప్ప ఎవరూ ఏమి చేయలేదనే బావనలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని, చివరకు గాలిని కూడా మేమే కనుగొన్నామని అంటారేమోనని ఎద్దేవా చేశారు. గాలిని, నీటిని, ప్రజలు తినే ఆహారాన్ని మేమే కనుగొన్నామని అంటే ఎలా అని ప్రశ్నించారు. విమర్శలు చేయాలి తప్పు కాదు..కానీ చేసే విమర్శ సోయిపసొంపుతో ఉండాలన్నారు.

- కుట్రలు జరుగుతున్నాయి..

కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ రావద్దని విపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరవెనుక ఉండి కొందరు రైతులను ఉసిగొలుపుతున్నారని ప్రతిపక్ష నాయకులపై ధ్వజమెత్తారు. ఎవరెవరు కుట్రలకు పాల్పడుతున్నారో అన్ని విషయాలు అధికారుల వద్ద పూర్తి సమాచారంతో ఉందన్నారు. ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారని, ఇకనైన సక్రమంగా మసలుకోవాలని హితవు పలికారు.

- రివర్ ఫ్రంట్ కాలనీతో భరోసా..

గతేడాది అకాల వర్షాలకు మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో నివాసముండే వేలాది కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయని, సీఎం రేవంత్ రెడ్డి సహా అనేక మంది మంత్రులు మున్నేరు బాధితులను పరామర్శించి, ఆదుకుని రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగం చేశామన్నారు. తక్కువ ధరకు వస్తుందని ఇక్కడ భూములు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్న పేదలకు రిటైనింగ్ వాల్ తో భరోసా ఉంటుందన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరుగకుండా రివర్ ఫ్రంట్ కాలనీలో చోటు కల్పిస్తామని చెప్పారు. 450 నుంచి 500 ఎకరాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది



రిటైనింగ్ వాల్ నిర్వాసితులకు అందులో స్థానం కల్పిస్తామని చెప్పారు.గత ప్రభుత్వం ఆర్భాటంగా జీవో ఇచ్చి వదిలేస్తే రిటైనింగ్ వాల్ ప్రియారిటీని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెండు వైపులా 17 కిలోమీటర్ల మేర భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. రిటైనింగ్ వాల్ కు రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం కూడా చేపడుతామని వెల్లడించారు. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో భూములున్న ఆసాములు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో పేదల పక్షాన ఉంటుందన్నారు. మంత్రి పొంగులేటి వెంట కాంగ్రెస్ నాయకులు “చల్లా కృష్ణ” సతీష్ భాస్కర్ ఆ ఏరియా ని సందర్శించారు

## యువత అన్ని రంగాల్లో ముందుండి అభివృద్ధికి తోడ్పడాలి

### గుండాల మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్పి చంద్రభాను



ఇల్లెందు లోకల్ గైడ్ : ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా గుండాలలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది.ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు డిఎస్పి ఎన్.చంద్రబాను హాజరయ్యారు.ఈ వాలీబాల్ టోర్నమెంట్లో గుండాల,ఆళ్లపల్లి,కొమరారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి.ఈ 40 జట్లలో ఫైనల్ కు దామరతోగు మరియు చిన్న వెంకటాపురం జట్లు చేరుకున్నాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఫైనల్ మ్యాచ్ నందు రెండు జట్లు హోరాహోరీగా పోరాడినాయి.రెండు జట్లలో దామతోగు జట్టు విజేతగా నిలిచింది.మొదటి స్థానంలో నిలిచిన దామరతోగుకు జట్టుకు బహుమతిగా 15000/- రూపాయలు మరియు షీల్డ్ అందజేయడం జరిగింది.చిన్న వెంకటాపురం జట్టుకు ద్వితీయ బహుమతిగా 10,000/-ల రూపాయలు మరియు షీల్డ్ అందజేయడం జరిగింది.మామకన్ను జట్టుకు తృతీయ బహుమతిగా 6000/-ల రూపాయలు మరియు షీల్డ్ ను అందజేశారు.ఈ సందర్భంగా ఇల్లందు డిఎస్పి చంద్రబాను మాట్లాడుతూ ఏజెన్సీ యువత చెడు



మార్గాల జోలికి పోకుండా చదువు,క్రీడలపై దృష్టి పెట్టాలి అని తెలిపారు.అసాంఘిక శక్తులకు సహకరించవద్దని కోరారు.ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలని పోలీసు వారు తమ వంతు భాద్యతగా క్రీడా పోటీలు,మెడికల్ క్యాంపులు,రోడ్డులు,కమ్యూనిటీ హాళ్లు,క్రీడాస్థలాల ఏర్పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించిన గుండాల సీఐ రవీందర్,ఎస్ఐ రవూఫ్ని మరియు సిబ్బందిని అభినందించారు.

### సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను

## అందజేసిన జెడ్పి మాజీ చైర్ పర్సన్ సరిత



గద్వాల, లోకల్ గైడ్ : జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సరిత అందజేశారు. గద్వాల నియోజకవర్గం కేటిదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన మాటమరీ రాజు 60,000 వేలు, పునికళ క్రిష్ణయ్య 34,000 వేలు, మైలగడ్డ బోయ కావలి వెంకటేశ్వరమ్మ 30,000 వేలు, నందిన్నె వీరన్న గౌడ్ 60,000వేలు, ఇర్కిచేడు తాండ లక్ష్మీబాయి 60,000 వేలు, గద్వాల మండలం అనంతపురం చిన్న నాగన్న 36,000 వేలు మొత్తం 2.80,000 లక్షల రూపాయల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జెడ్పి మాజీ చైర్ పర్సన్ సరిత లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి అండగా ప్రభుత్వ సహాయ నిధి కింద సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, పాతపాలెం ఆనంద్ గౌడ్, పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి, పెదొడ్డి రామకృష్ణ, రాజారెడ్డి, రాముడు, జలీల్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి, హమిన్, రహీం, రాఘవేంద్ర, లోకేష్ నాయక్, రామన్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, వెంకటేష్, చింతలన్న, స్వామి, వీరన్న గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గోవింద్, నాగరాజు, నర్సింహులు, తిమ్మప్ప, యర్సన్ దొడ్డి రాజు, గోవింద్, నాగోల్ తదితరులు ఉన్నారు.

## సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయకార్యదర్శిగా గౌని నాగేశ్వర్ రావు



కొత్తగూడెం లోకల్ గైడ్:భూపాలపల్లిలో ఆదివారం జరిగిన రెండు యునియన్ల విలీన సభలో కొత్తగూడెం రిజియాన్ కు చెందిన గౌని నాగేశ్వర్ రావు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నిక కాగా,నూతన అద్యక్ష,కార్యదర్శులు రసుద్దీన్, వెంకన్నలు ఎన్నికయ్యారు. ఈ సభలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, కనిసం ఈపీఎఫ్ పెన్షన్ 9000 ఇవ్వాలని, ఓటు హక్కు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం , ఖాళీగా ఉన్న క్వార్టర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని, 20న జాతీయ సమ్మె లో పాల్గొనాలని,గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తీర్మానాలు చేశారు.

## సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగివచ్చిన పౌరులకు కొనసాగుతున్న తెలంగాణ ప్రభుత్వం సహాయం



హైదరాబాద్ (లోకల్ గైడ్) మే 12: సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగి వస్తున్న తెలంగాణ పౌరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశాలతో, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నోడల్ ఆఫీస్ గా పనిచేస్తోంది. నేటి మధ్యాహ్నం వరకు 162 మంది పౌరులు తెలంగాణ భవన్‌కి చేరుకోగా, వీరిలో జమ్మూ కాశ్మీర్‌లోని వివిధ విద్యాసంస్థల నుండి 56 మంది, పంజాబ్ రాష్ట్రం నుండి 106 మంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటివరకు 133 మంది తమ స్వగ్రామాలకు బయలుదేరగా, మిగిలినవారికి తెలంగాణ భవన్‌లో తాత్కాలిక వసతి, భోజనం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ సోమవారం భవన్ అధికారులతో సమీక్ష జరిపి, అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ “పరిస్థితి నెమ్మదిగా సాధారణమవుతుండటంతో మా విద్యాసంస్థలు తిరిగి క్లాసులకు హాజరు కావాలని సూచిస్తున్నాయి. అయితే మేము ముందుగా ఇంటికెళ్లి, పరిస్థితి పూర్తిగా సాదారణ స్దితికి చేరుకున్న తర్వాతే మళ్లీ క్యాంపస్‌కు వెళ్లాలనుకుంటున్నాం” అని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు, డా. గౌరవ్ ఉప్పల్ సంబంధిత యూనివర్సిటీల అధికారులతో మాట్లాడి, విద్యార్థులకు తాత్కాలికంగా ఆన్‌లైన్ తరగతులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీలు అందుకు సానుకూలంగా స్పందించాయి.కాగా కొంతమంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు పరిస్థితి మెరుగుపడే వరకు ఢిల్లీలోనే వేచి చూసి తిరిగి క్యాంపస్లకు వెళ్ళాలనుకుంటున్నట్లు తెలపగా వారు తిరిగి వెళ్లేవరకు భవన్లోనే ఉండేదుకు అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. ఇక, గడిచిన 24 గంటలుగా సహాయం కోసే చేసే అత్యవసర కాల్స్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, చాలా తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తెలంగాణ భవన్ కి వచ్చే అవకాశం ఉందని మా అంచనా అని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరు సహాయం కోసం వస్తే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని డా. గౌరవ్ ఉప్పల్ స్పష్టం చేశారు.

## నేడు బుద్ధవనానికి 22 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు



హైదరాబాద్ (లోకల్ గైడ్) మే 12: మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొంటున్న ఆసియా ఓసియాన గ్రూప్ ౦4 లోని 22 దేశాల సుందరీమణులు ఈ రోజు బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సాయంత్రం 5 గంటలకు సందర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాలకు చెందిన అందగత్తెలు మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొంటుండగా.. ఆసియా ఒసియాన దేశాలు ఇండియా, బంగ్లాదేశ్ ,కాంబోడియా ,మయన్మార్ వియత్నం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ,ఇండోనేసియా, జపాన్ , కజకిస్తాన్, కిర్గికిస్తాన్, లెబనాన్, మంగోలియా, నేపాల్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, శ్రీలంక, టర్కీ, చైనా, థాయిలాండ్, ఆర్మేనియా నుంచి వచ్చినవారు మాత్రం బుద్ధవనం సందర్శిస్తారు. సందర్శనలో భాగంగా మిస్‌వరల్డ్ పోటీదారులు బౌద్ధ థీమ్‌పార్క్‌లోని స్తూపంలో బుద్ధుని విగ్రహాల చెంత జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రత్యేకించి ఆయా దేశాల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించనున్నారు. పర్యాటక శాఖ అధికారులు ఈ రోజు మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో వీరినీ నాగార్జునసాగర్‌కు తీసుకువెళ్లారు. మార్గమధ్యమం లో



నల్లగొండ జిల్లా చింతపల్లి సమీపంలోని అతిథిగృహం వద్ద కొంతసేపు మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు ఆగుతారు. అక్కడ పర్యాటక సంస్థ విజయ్‌విహార్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఫొటో సెషన్ తర్వాత అక్కడినుంచి నేరుగా బుద్ధవనం చేరుకుంటారు. సీఎం శ్రీ రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మిస్ వరల్డ్ పోటీల ద్వారా తెలంగాణ పర్యాటకాన్ని ప్రమోట్ చేసేందుకు ప్రాధాన్యతను ఇస్తున్న ప్రభుత్వం ఈ ఫీల్డ్ టూర్ ను ప్లాన్ చేసింది. ఈ సందర్శనకు ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగివచ్చిన పౌరులకు కొనసాగుతున్న తెలంగాణ ప్రభుత్వం సహాయం



హైదరాబాద్ (లోకల్ గైడ్ )మే 12: సరిహద్దు ప్రాంతాల నుండి తిరిగి వస్తున్న తెలంగాణ పౌరులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశాలతో, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ నోడల్ ఆఫీస్ గా పనిచేస్తోంది. నేటి మధ్యాహ్నం వరకు 162 మంది పౌరులు తెలంగాణ భవన్‌కి చేరుకోగా, వీరిలో జమ్మూ కాశ్మీర్‌లోని వివిధ విద్యాసంస్థల నుండి 56 మంది, పంజాబ్ రాష్ట్రం నుండి 106 మంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటివరకు 133 మంది తమ స్వగ్రామాలకు బయలుదేరగా, మిగిలినవారికి తెలంగాణ భవన్‌లో తాత్కాలిక వసతి, భోజనం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ సోమవారం భవన్ అధికారులతో సమీక్ష జరిపి, అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ "పరిస్థితి నెమ్మదిగా సాధారణమవుతుండటంతో మా విద్యాసంస్థలు తిరిగి క్లాసులకు హాజరు కావాలని సూచిస్తున్నాయి. అయితే మేము ముందుగా ఇంటికెళ్లి, పరిస్థితి పూర్తిగా సాదారణ స్దితికి చేరుకున్న తర్వాతే మళ్లీ క్యాంపస్‌కు వెళ్లాలనుకుంటున్నాం" అని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు, డా. గౌరవ్ ఉప్పల్ సంబంధిత యూనివర్సిటీల అధికారులతో మాట్లాడి, విద్యార్థులకు తాత్కాలికంగా ఆన్‌లైన్ తరగతులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీలు అందుకు సానుకూలంగా స్పందించాయి.కాగా కొంతమంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు పరిస్థితి మెరుగుపడే వరకు ఢిల్లీలోనే వేచి చూసి తిరిగి క్యాంపస్లకు వెళ్ళాలనుకుంటున్నట్లు తెలపగా వారు తిరిగి వెళ్లేవరకు భవన్లోనే ఉండేదుకు అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. ఇక, గడిచిన 24 గంటలుగా సహాయం కోసే చేసే అత్యవసర కాల్స్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, చాలా తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తెలంగాణ భవన్ కి వచ్చే అవకాశం ఉందని మా అంచనా అని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరు సహాయం కోసం వస్తే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని డా. గౌరవ్ ఉప్పల్ స్పష్టం చేశారు.



## మౌలిక వసతులు మిషన్ భగీరథ పైప్ లైన్-ద్వారా మంచినీరు ఇచ్చి కరెంటు సౌకర్యం కల్పించాలి

**మోకు కనకా రెడ్డి సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి**



జనగామ.లోకల్ గైడ్: వీరనారి ఐలమ్మ నగర్ మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు ప్లాట్ కలిగి ఇల్లు కట్టుకొని కబ్జాలో ఉన్న ప్రతి ఒక్కరికి మున్సిపల్ ద్వారా మోటివేషన్ చేసి ఇంటి నెంబర్లు ఇవ్వాలి గృహలక్ష్మి ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలి మిషన్ భగీరథ వాటర్ పైపులు లైన్ ద్వారా మంచినీళ్లు ఇవ్వాలి అని ప్రభుత్వాని కనుక రెడ్డి డిమాండ్ చేశారు సోమవారం జనగామ సిపిఎం పట్టణ కార్యాలయంలో జోగు ప్రకాష్ సిపిఎం జనగాం పట్టణ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మొక్కు కనకరెడ్డి జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ మూడో విడత ఇందిరమ్మ లబ్బిదారులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేసి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం2012-2013 వ సంవత్సరంలో ఇచ్చిన ఇందిరమ్మ పట్టా లబ్ధిదారులకు 5 లక్షల రుణం గృహలక్ష్మి ద్వారా ప్రత్యేక అవకాశం కల్పించి ఇవ్వాలని అన్నారు లేకపోతే లబ్ధిదారులతో పెద్ద ఎత్తున ఆందోళనలో చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు ఇర్రి అహల్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య ఎండి గౌసియా ఏనుగుల కమల బండ సౌందర్య మున్సిపట్ల జయ ఎర్ర రజిత పద్మ జ్యోతి మల్లేష్ కవిత సుజాత చింతల శ్రీలత అంజమ్మ రజిత కొన్నే శాంత కచ్చ గళ్ళ వెంకటేష్ మాదాసి సుధాకర్ బాలస్వామి పాల్వాయి పద్మ మమత తదితరులు పాల్గొన్నారు .

## ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్ రావు హఠాన్మరణం

**-సంతాపం తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ**



హైదరాబాద్ (లోకల్ గైడ్) మే 12: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు హఠాన్మరణం చెందారని తెలియజేయుటకు చింతిస్తున్నాను. ఈ రోజు సోమవారం ఉదయం లక్నోలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 82 సంవత్సరాలు. విక్రమ్ రావు తెలుగు వారు. చాలా కాలంగా ఢిల్లీ, లక్నోల్లో వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా, ఎడిటర్ గా పనిచేసిన ఆయన ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో స్థిరపడ్డారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఆయన దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడిగా నాలుగు పర్యాయాలు పని చేసిన ఆయన దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. 1984 నుంచి ఆరు సార్లు ఐఎఫ్ డబ్ల్యూజే కు అధ్యక్షుడుగా ఉన్నారు. ప్రస్తుతం ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడుగా కొనసాగుతున్న విక్రమ్ రావు సమాజంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై అనేక రచనలు చేశారు. నలభై ఏళ్లలో దాదాపు 200లకు పైగా పుస్తకాలు రాశారు. విక్రమ్ రావు మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం తెలియజేస్తుంది. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఐఎఫ్ డబ్ల్యూజే కు అనుబంధంగా పని చేస్తుందని, విక్రమ్ రావుతో తమకు ఇరవై ఏండ్లకు పైగా అనుబంధం ఉందని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య తెలిపారు. విక్రమ్ రావు మరణం జర్నలిస్టుల ఉద్యమానికి తీరని లోటని వారు పేర్కొంటూ, ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అక్రమ అరెస్టులను ఖండించండి

## అందాల పోటీలను రద్దు చేయాలి




జనగామ.లోకల్ గైడ్: మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎర్రి అహల్య ఎండి షబానా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులను ఖండించాలని అందాల పోటీలు రద్దు చేయాలని జనగామ పట్టణంలోని నెహ్రూ పార్క్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇర్రి అహల్య ఎండి షబానా పాల్గొని మాట్లాడారు నిన్న హైదరాబాదులో 12 5 2005 రోజున అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా మరియు ఇతర మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేస్తే అక్రమంగా అరెస్టులు చేశారని ఈ అరెస్టులను మహిళలు మహిళ అభ్యుదయవాదులు ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలన్నారు ప్రధానమంత్రి మోడీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గార్లు మిస్ వరల్డ్ అందాల పోటీల వల్ల దేశానికి పేరు ప్రఖ్యాతులు వస్తాయని జాతీయ అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరిస్తాయని గొప్పలు చెబుతున్నాయి అన్నారు దేశానికి పేరు ప్రఖ్యాతలు కాదు దేశ భారత్ పేరు ప్రతిష్టలు దిగజారుతాయి అన్నారు ఇండియా పాకిస్తాన్ యుద్ధం జరుగుతుందని ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లను రద్దు చేశారని అందాల పోటీలు ఎందుకు రద్దు చేయకూడదు అన్నారు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక ప్రజలు సమస్యలతో సతమతం అవుతుంటే సౌర హామీలను అమ

## ఎఫ్ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన అభిప్రాయ్ అభినందించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



లోకల్ గైడ్, ఖమ్మం: ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎఫ్ సెట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో (2300) ర్యాంకు సాధించిన ఆకుతోట అభిప్రాయ్ ను శాలువతో సత్కరించి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువును ఇష్టపడి చదివే వారు భవిష్యత్ లో మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు.ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం తనికెళ్ళ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆకుతోట ఆదినారాయణ,బ్రౌన్ కాలేజ్ లో అధ్యాపకురాలిగా పనిచేసే అరుణకుమారి దంపతుల కుమారుడు అభిప్రాయ్.ఎల్ కేజీ నుంచి ప్లస్ టూ(ఇంటర్,సిబిఎస్ఈ) విద్య వరకు ఖమ్మంలోని హార్వెస్ట్ విద్యాసంస్థలో అభిప్రాయ్ విద్యను అభ్యసించారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన అభిప్రాయ్ ను హార్వెస్ట్ ప్రిన్సిపాల్ ఆర్.పార్వతి రెడ్డి అభినందించారు.

# ప్రజలకు మరింత చేరువగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

### అమలు లోకి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

### ప్రజలకు సంతృప్తికర సేవలే అంతిమ లక్ష్యం

### రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ (లోకల్ గైడ్) మే 12: హైదరాబాద్ :- ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రజలకు మరింత చేరువచేస్తున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని కోరారు. రెండవ దశలో భాగంగా రాష్ట్రం లో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నాడు స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభమైంది. మొదటి దశలో ని 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో, రెండో దశలో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానాన్ని మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఈరోజుతో 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలులోకి వచ్చిందని, వచ్చేనెలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించి క్యూ లైన్లలో నిల్చోనే పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు, పారదర్శకతను తీసుకురావడానికి ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పే రోజులు వస్తాయని దళారులు ప్రమేయం కూడా ఉండబోదన్నారు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్ సైట్ స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏరోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందని అలాగే సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన చోట రిజిస్ట్రార్ల సంఖ్యకూడా పెంచుతున్నామని మంత్రి వివరించారు.

స్లాట్ బుకింగ్ అనుభవాలు:-

10 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి ( సంతోష్‌కుమార్ రెడ్డి - ఉప్పల్ ఎస్.ఆర్. వో ఆఫీస్)

ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నా ఇంటి రిజిస్ట్రేషన్ కోసం శుక్రవారమే స్లాట్ బుకింగ్ చేసుకున్నాను. ఐఐసిటీ కాలనీ- బోడుప్పల్ లో ఉంటున్న నేను రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లినంత సమయం కూడా అక్కడ రిజిస్ట్రేషన్ ఆఫీసులో పట్టలేదు. కేవలం 10 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయింది. మొత్తం అరగంట వ్యవధిలోనే డాక్యుమెంటు తీసుకొని వచ్చేశాం. నిజంగా ఈ విధానం చాలా బాగుంది. దీనివలన ఎక్కడా ఇబ్బంది పడలేదు సరికదా సమయం చాలా ఆదా అయింది. సో హ్యాపీ

2-3 రోజులు పట్టే పని ఇప్పుడు అరగంటలోనే: ఎ. శ్రీలత ( కాప్రా- ఎస్.ఆర్. వో ఆఫీస్)

వడ్డేపల్లికి చెందిన మేము సోమవారం కాప్రా ఎస్.ఆర్. వో ఆఫీస్ లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. గతంలో రిజిస్ట్రేషన్‌కు ఒక రోజంతా ఉండేవారం. తరువాత 2 నుంచి 3 రోజుల తర్వాత మాకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చేవారు. ఇప్పుడది లేదు రిజిస్ట్రేషన్ 15 నిముషాల్లో పూర్తవడం, మరో 15 నిముషాల్లో డాక్యుమెంట్లు సిద్ధం కావడం చాలా బాగుంది. రద్దీ లేకుండా ప్రశాంత వాతావరణంలో పని పూర్తయింది. దీనినే కొనసాగించడం ఎంతో ఉత్తమం

ఒకేసారి రిజిస్ట్రేషన్ - మ్యుటేషన్ చాలా సౌకర్యవంతం: సరళ ఎన్. సరళ ( హనుమకొండ -ఎస్.ఆర్. వో ఆఫీస్)

హనుమకొండ ఎస్.ఆర్. వో ఆఫీస్ లో సోమవారం ప్రారంభమైన స్లాట్ బుకింగ్ వలన ఒకేసారి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరగడం చాలా సౌకర్యంగా అనిపించింది. గతంలో రిజిస్ట్రేషన్ ఒక తంతు అయితే మ్యుటేషన్ మరో తంతుగా మూడు రోజులకు మించి జరిగేది. కానీ కొత్త స్లాట్ విధానం వలన మా ప్లాట్ రిజిస్ట్రేషన్ , మ్యుటేషన్ కూడా జరిగిపోయింది. డాక్యుమెంట్ రైటర్ సాయంతో మేం స్లాట్ బుక్ చేసుకున్నాం. మాకు ఎక్కడా అదనపు ఖర్చులు లేవు. ఈ రోజు ఉదయం స్లాట్ బుక్ చేసుకున్నాం. ఇదే రోజు మొత్తం పని పూర్తయింది. సూపర్ సిస్టమ్!

అధికారుల సహకారం బాగుంది : ( ఎ. భారతమ్మ కల్వకుర్తి ఎస్. ఆర్.వో ఆఫీస్)

కల్వకుర్తి ఎస్. ఆర్.వో ఆఫీస్ లో సోమవారం మా ఇంటిస్థలం కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ జరిగింది.

నిన్ననే స్లాట్ బుక్‌చేయించాం. గతంలోలా డాక్యుమెంట్ రైటర్ల హవా కనిపించలేదు. అధికారులు చాలా బాగా సహకరించారు. పని చాలా తొందరగా పూర్తయింది. మొదటి నుంచి స్లాట్ బుకింగ్ కు అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం వంటి పనుల కారణంగా హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. ఇటువంటి విధానాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని మాతో పాటు రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు కూడా చెబుతున్నారు.

# అరుగుపై కూర్చొని.. అర్జీలు స్వీకరిస్తూ.. కటిక నేలపై కూర్చొని.. కష్టాలు తెలుసుకుంటూ.. ఆదివాసీ జనంతో మమేకమైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### పూర్తిగా అటవీ ప్రాంతంలో కొనసాగిన పర్యటన

### రూ.2.47 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### పేరాయిగూడెం, చెన్నాపురం అటవీ ప్రాంతాల్లో పర్యటించిన తొలి ఎంపీ అంటూ.. కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీలు





అశ్వారావుపేట: లోకల్ గైడ్: పూర్తిగా అటవీ ప్రాంతం.. ఖమ్మం నుంచి 160 కిలోమీటర్ల దూరం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నుంచి 34 కి. మీ. దూరం.. అంతా దట్టమైన ప్రాంతం గుండా.. పెద్ద వాగు, అనంతారం, చిన్న వాగు, కట్లంవాగు..ఇలా వాగులూ.. వంకలూ దాటుకొని ఆదివాసీ గూడేల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రాఘురాం రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మారుమూల ఆదివాసీ పేరాయిగూడెం రూ. 1.40కోట్లు, చెన్నాపురంలో రూ. 1.07 కోట్లు.. మొత్తం రూ.2.47 కోట్ల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా..పేరాయిగూడెం గ్రామ పంచాయతీ వద్ద అరుగుపై ఎంపీ రఘురాం రెడ్డి కూర్చొని గ్రామసభ నిర్వహించారు. చెన్నాపురం గ్రామంలో గ్రామ సెంటర్ లో సీ సీ రోడ్లను ప్రారంభించి.. అక్కడ నేలపై వేసిన పట్టాపై కింద కూర్చొని ఆదివాసీల యోగక్షేమాలు తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి తన లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వేలాది కోట్లను వెచ్చిస్తోందని చెప్పారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మంచో పరసోదమ్..అంటూ కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. ఏలూరు జిల్లా సరిహద్దులో గల తమ గ్రామాలకు వచ్చి, నిధులు కేటాయించి అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ రామ సహాయం రెడ్డికి ఆయా గ్రామాల ఆదివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు యే ఎంపీ తమ వద్దకు రాలేదని తెలిపారు. మంచి పరసొదమ్.. సార్ అంటూ ( చాలా ధన్యవాదాలు).. అంటూ ఆదివాసి భాషలో కృతజ్ఞతలు తెలిపారు.

## వనజీవి పై కవితకు అపూర్వ స్పందన

### -మొహిద్దిన్ కు శ్రీశ్రీ కళావేదిక ప్రతిభా పురస్కారం..




ఖమ్మం: లోకల్ గైడ్: వనజీవి రామయ్య కోటి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చేసిన నిస్వార్థ సేవను ప్రతిబింబించేలా, 'వనాల వెతుకులాట' అనే శీర్షికను రచించి, చదివిన కవితకు మంచి స్పందన లభించింది. కవిత గానం పూర్తి కాగానే నిర్వాహకులు, కవుల నుంచి ఆయన వనజీవి కాదు ధన్యజీవి ఆయన మార్గం అందరూ అనుసరించాలి అనే కామెంట్స్ వినిపించాయి. ఈ కవిత గానం చేసిన జర్నలిస్టు, కవి మొహిద్దిన్ కు శ్రీశ్రీ కళావేదిక ప్రతిభా పురస్కారం లభించింది. ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు శ్రీ శ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు శని, ఆదివారం లలో 48 గంటల పాటు ఏలూరులో జరిగాయి. ఈ మహోత్సవంలో ఆయన వనజీవి రామయ్య పై వనాల వెతుకులాట శీర్షికతో రాసిన కవితను చదివి వినిపించారు . కోటి మొక్కలకు పైగా నాటిన నిస్వార్థ జీవి వనజీవి పై , కవిత రాసి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గజల్ శ్రీనివాస్ హాజరు కాగా శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి పార్థసారథి, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

## ప్రజల సమస్యలు త్వరితంగా పరిష్కరించాలి

### : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ : లోకల్ గైడ్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తదితర అంశాలపై ప్రజలు తమ వినతులను కలెక్టర్‌కు అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించాలంటూ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శాఖల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పరిష్కార వివరాలను రిమార్కుల విభాగంలో నమోదు చేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సంబంధించిన సమాచారం దరఖాస్తుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెలిఫోన్ ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫోన్లను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. దూర ప్రాంతాల ప్రజలు 91005 77132 నంబరును సంప్రదించి వాట్సాప్ ద్వారా సమస్యలు పంపవచ్చునని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని, అభ్యంతరాలను స్వీకరించాలని తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను మండల స్థాయిలో త్వరితంగా పరిశీలించి బ్యాంకులకు పంపించాలని సూచించారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపాధి హామీ పనుల్లో త్రాగునీరు, టెంట్, ఓఆర్ఎస్ పొట్లాల అందుబాటును ఉంచాలన్నారు. ఇటీవల రుణాల మంజూరులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచిన గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి.!

**- ప్రత్యేక కోట కింద తమకు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేపట్టాలి.**

**- పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగుల ఆవేదన.**




లోకల్ గైడ్/తాండూర్: దివ్యాంగులను ప్రత్యేక కోట కింద ఎంపిక చేసి, ఇందిరమ్మ ఇల్లకు తమను ఎంపిక చేయాలని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. పెద్దేముల్ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కోట కింద తమను ఎంపిక చేసి, అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని గతంలో చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితుల భిన్నంగా కనిపిస్తున్నాయి అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా ఏ ఒక్క గ్రామంలో కూడా దివ్యాంగులను పట్టించుకున్న నాధులే లేరు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు,ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి, దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి తమ జీవన అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అధికారులను కోరుతున్నారు.

## క్రిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు.

**- పలుమార్లు ఆఫీసు చుట్టూ తిరిగిన పట్టించుకోని అధికారులు.**

**- పెద్దేముల్ కరెంట్ ఆఫీస్ లో దరఖాస్తు సమర్పించాము.**

**- అయినా స్పందించని విద్యుత్ అధికారులు.**



లోకల్ గైడ్/తాండూర్: పెద్దేముల్ గ్రామానికి చెందిన ధ్యావరి అశోక్ అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. రైతు అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తమ పొలంలో విద్యుత్ తీగలు పూర్తిగా కిందకు జారడంతో వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నాము. అటువైపు వెళ్లాలన్న తీవ్ర భయానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్తు తీగలను రెండు స్తంభాల సహాయంతో పైకి కట్టాలని పెద్దేముల్ విద్యుత్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగిన ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే కనీసం కాలినడకన వెళ్లాలన్న కష్టతరమవుతుంది.విద్యుత్ తీగల ప్రభావం వలన పొలం పనులు చేసుకోలేక, నేలను చదును చేసుకోలేకపోతున్నాము. ఈ మధ్యకాలంలో విద్యుత్తు తీగల ప్రభావం వలన అనేక ప్రాణ నష్టాలు, ఆస్తి నష్టాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా కూడా విద్యుత్ అధికారులు తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తక్షణమే తమ పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను రెండు స్తంభాల సహాయంతో పైకి కట్టి, తమ సమస్యను పరిష్కరించాలని రైతు ధ్యావరి అశోక్ అధికారులను వేడుకుంటున్నాడు.

# మొబైల్ ఫోన్ తప్పిపోయిన, చోరికి గురైనా రిజిస్టర్ చేసుకోవాలి

**జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**

**జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరికి గురైన 52 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత.**



నిర్మల్ : లోకల్ గైడ్ : సెల్ ఫోన్ తప్పి పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సి ఈ ఐ ఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరికి గురైన 52 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పి పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. తప్పి పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సిఈఐఆర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. సి ఈ ఐ ఆర్ వెబ్సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. తప్పి పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1309 ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సిఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, సి ఈ ఐ ఆర్ టీం కానిస్టేబుల్ రాజేశ్వర్, నరేందర్, ప్రత్యూష, సూర్య వంశీ, రామ్ పవన్ లను జిల్లా ఎస్పీ అభినందించారు



# సాదా.. సీదాగా రోడ్డు వెంట బండి వద్ద టిఫిన్ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



అశ్వారావుపేట : మే 12, లోకల్ గైడ్: అశ్వారావుపేట నియోజకవర్గం, అశ్వారావుపేట, హంగు ఆర్భాటానికి దూరంగా ఉంటూ, ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమయ్యే ఖమ్మం ఎంపీ, రామ సహాయం రఘురాం రెడ్డి. సోమవారం ఉదయం రోడ్డు వెంట టిఫిన్ బండి వద్ద దోస తిన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి వెళుతూ,పోలీస్ స్టేషన్ రింగ్ సెంటర్ లో ఆగారు. రోడ్డు వెంట ఉన్న టిఫిన్ బండి వద్దకు ఓ సామాన్యుడి మాదిరి గా వెళ్లి హాఫ్ దోస, సింగల్ ఇడ్లీ తినగా, సార్ భలే సింపుల్ అంటూ స్థానికులు ఒకింత ఆశ్చర్యంగా చూశారు. అక్కడున్న.. స్థానిక ఆదివాసీ యువతను ఆప్యాయంగా పలకరించగా..వారంతా ఎంపీ తో సెల్ఫీలు తీసుకుని ఆనందించారు.

# ఎంపీ వద్దిరాజు పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్స్ కు సత్కారం





హైదరాబాద్ (లోకల్ గైడ్) మే 12: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్స్ పోటీలలో విజేతలైన బోయిన కార్తీక్,రాపర్తి రాజా,పవన్ రిషి,పొన్విత్ లను శాలువాలతో సత్కరించి అభినందించారు. హైదరాబాద్ ఓల్డ్ బోయినపల్లిలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎక్విప్పెడ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ -2025 పోటీల 120 కిలోల సీనియర్స్ విభాగంలో ఖమ్మం నగరానికి చెందిన బోయిన కార్తీక్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే,ఆయన బెంచ్ ప్రెస్ పోటీల్లో ద్వితీయ బహుమతి అందుకుని,జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జూనియర్స్ 120 కిలోల విభాగంలో జీ.పవన్ రిషి ద్వితీయ, బెంచ్ ప్రెస్ పోటీల్లో ప్రథమ బహుమతులు అందుకున్నారు. బెంచ్ ప్రెస్ ఖమ్మం జిల్లా ఛాంపియన్ షిప్ ను రాపర్తి రాజా,పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ పోటీల్లో ఆర్.పొన్విత్ ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఎంపీ రవిచంద్రను వారు కలువగా, శాలువాలతో సత్కరించారు,ఈ రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ తన ఆశీస్సులు అందజేశారు.



# జోరుగా సాగుతున్న మట్టి మాఫియా



దమ్మపేట : మే 12,లోకల్ గైడ్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలంలో మట్టి మాఫియా జోరుగా సాగుతున్న సోద్యం చూస్తున్న అధికారులు. శనివారం వస్తే చాలు అర్ధరాత్రి నుంచే మట్టి మాఫియా ఆగడాలు మొదలవుంటున్నాయి అధికారులకు సెలవు చూసుకొని చెలరేగుతున్న మట్టి మాఫియా మట్టి, గ్రావెల్, తదితర వాటిపై నిఘా కరువు కొంత మంది అధికారుల తీరుతో ప్రభుత్వానికి కు చెడ్డపేరు. మాకు మేమే సాటి అని చాలెంజ్ విసురుతున్న అక్రమార్కులు. ఎంత మంది నోళ్ళు మూయిస్తారు. ఎంత ప్రభుత్వ ఆదాయానికి గండి కొడతారు. ప్రభుత్వ ఆదాయం అంటే ప్రజలే.దిని వెనుక అధికారుల హస్తం ఉన్నదా అనేది ప్రజల అభియోగం.



# మహిళా కార్మికులపై లైంగిక వేధింపులను అరికట్టాలి.!

- ముస్సిపల్ ఆఫీస్ లో ఎస్సై, జవాన్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.
- కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.
- పారిశుద్ధ్య కార్మికులు అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలి.
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ డిమాండ్.
- తాండూర్ ముస్సిపల్ కార్యాలయం ఎదుట వాల్ పోస్టర్ విడుదల.



లోకల్ గైడ్/తాండూర్: తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎస్సై, జవాన్లు కుమ్మక్కై కార్మికులను, మహిళల పైన లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, సంబంధిత మున్సిపల్ కమిషనర్ తక్షణమే లైంగిక వేధింపులను అరికట్టాలని సిఐటియు వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగా కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్ ల రద్దును కోరుతూ.. మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాలకు సంబంధించిన కార్మికవర్గం సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని, మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 29 చట్టాలను రద్దు చేసి, వాటికి బదులుగా కార్మికులను మోసగిస్తూ..నాలుగు లేబర్ కోడ్లను తీసుకొస్తున్నారు. తద్వారా కార్మికుల కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు వంటివి కాలరాయబడ్డాయి. అదేవిధంగా 8గంటల పనిని 12గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు అని ఆరోపించారు. కాబట్టి మే 20న చేపట్టే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికవర్గం అందరూ పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎస్సై, జవాన్లు కుమ్మక్కై.. గతంలో పనిచేస్తున్న జోన్ల నుంచి కార్మికులను మార్పులు చేసి కార్మికులను మహిళలను వేధింపులకు గురిచేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మహిళల కార్మికులపై వేధింపులు అరికట్టాలి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 వేలు, ఉద్యోగ భద్రత,ప్రతి నెల జీతాలు చెల్లించాలని.. చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని అధికారులను కోరారు. ముఖ్యంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఎస్సై, జవాన్లు.. వారికి అనుకూలంగా ఉన్నవారిని నియమించుకొని,పని చేయని వారికి కూడా హాజరు వేసి వారికి వచ్చిన జీతంలో సగం సగం పంచుకొని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అక్రమార్కుల పై తాండూర్ మున్సిపల్ కమిషనర్ వెంటనే విచారణ చెసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ ఔ ట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షులు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, ప్రధాన కార్యదర్శి డి. వెంకటేష్, కార్మికులు ప్రకాష్, నర్సిములు, రాజు, దస్తప్ప, అంతారం ప్రకాష్, నిర్మల, లాలప్ప, మైసప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు సుల్తాన్ పూర్ తండా కు రోడ్ పనులు ప్రారంభం



లోకల్ గైడ్/దౌల్తాబాద్: దౌల్త బాద్ మండలం సుల్తాన్ పూర్ తండాకు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి ఎన్నో యేండ్ల నుండి తండాకు రోడ్డు సౌకర్యం లేక తాండవాసులు ఇబ్బందులకు గురయ్యారు గత ప్రభుత్వంలో రోడ్డు మంజూరు చేసాము అని చెప్పడం తప్ప తట్టేడు మట్టి కూడా పోయ్యలేదు రోడ్డు పనులు చేయిస్తామంటూ ఎన్నికల సమయంలో వచ్చి హామీలు ఇవ్వడం తప్ప రోడ్డు వేయించిన పాపన పోలేదు అని తండా వసూలు అన్నారు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దౌల్తాబాద్ మండలం సుల్తాన్పూర్ తాండ కు రోడ్డు సౌకర్యం కోసం నిధులు మంజూరు చేసి త్వరితగతిన పన్ను ప్రారంభించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తాండవాసులు ఎప్పటికీ రుణపడి ఉంటామంటూ అభినందనలు తెలియజేశారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



దమ్మపేట : మే 12,లోకల్ గైడ్: అశ్వారావుపేట నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నేడు దమ్మపేట మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా నాగుపల్లి(గ్రామం)లో అత్యంత వైభవంగా జరిగిన లక్ష్మినారాయణ స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం యర్రగుంపు(గ్రామం)లో వాడే భద్రం - లక్ష్మి దంపతుల కుమారుడు ప్రవీణ్ కుమార్ వివాహ రిసెప్షన్ వేడుకలో మరియు ముష్టిబండ(గ్రామం)లో కోలా సత్యనారాయణ - విమల దంపతుల కుమారుడు సుధీర్ కుమార్ వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు రావు జోగేశ్వరరావు పటేల్ మాజీ ఎం పి టీ సి భాస్కర్ సోడెం గంగరాజు మాజీ సర్పంచ్ భరత్,ప్రసాద్ కుకలకుంట రవి,కోలా సతీష్ రవి తదితరులు ఉన్నారు.

## భైంసా లో పి. జి. కళశాల ఏర్పాటు కు కృషి

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ లో ఎమ్మెల్యే**



నిర్మల్ : లోకల్ గైడ్ : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో పి. జి. కళశాల త్వరలో ఏర్పాటు కు కృషిచేస్తానని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. సోమవారం భైంసా లోని ఎమ్మెల్యే నివాసం లో గోపాల్ రావ్ పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళశాల, ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళశాలలో అడ్మిషన్ ల కోసం ప్రచార పోస్టర్లను విడుదల చేసిన సందర్భంగా అయన మాట్లాడారు. ప్రైవేట్ కు ధీటు గా ప్రభుత్వ అధ్యాపకులు అడ్మిషన్ ల కై ప్రచారాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. జి. పి ఎల్. డిగ్రీ కళాశాల అభివృద్ధి కి కేంద్రం ఉష స్కీం కింద ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థులు వస్తారని, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేలా ప్రభుత్వ దృష్టికి తీసుకు వస్తానన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బుచ్చయ్య, అధ్యాపకులు విద్యాభివృద్ధిపై దృష్టి సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు మాట్లాడుతూ ప్రచారానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. కళాశాలలో కోర్సులు, సౌకర్యాల విషయమై చెప్పారు. విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ కై దోస్త్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు.. పి హెచ్ డి, ఎం. ఫీల్ చేసిన అధ్యాపకులు ఉన్నారని, కళాశాలలో డిజిటల్ లైబ్రరీ సైతం ఉందని ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నగేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జిల్లాలో అపరిస్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



వికారాబాద్, లోకల్ గైడ్ : సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్డిఓ వాసు చంద్ర లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రజావాణి గైర్హాజర్ కాకూడదని కలెక్టర్ అధికారుల సూచించారు. ప్రజావాణిలో (68 ) అర్జీలు రాగా ఎక్కువ శాతం భూ సమస్యలు, పెన్షన్లు, హౌసింగ్, వ్యవసాయ రంగానికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు



వనపర్తి లోకల్ గైడ్: సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు,జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ప్రజావాణికి మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో పి డి ఆర్ డి ఏ ఉమాదేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు**



భద్రాద్రి కొత్తగూడెం లోకల్ గైడ్ ప్రతినిధి : ఎస్పీ రోహిత్ రాజు వారి కార్యాలయలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు..ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని ఇన్స్పెక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## చర్లపల్లి కేంద్ర కారాగారంలో రాష్ట్రస్థాయి ఖైదీల 6వ వార్షిక క్రీడలు - సంస్కృతిక కార్యక్రమాల ముగింపు వేడుకలలో అతిథులుగా హాజరైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



హైదరాబాద్ (లోకల్ గైడ్) మే 12: పాల్గొన్న జైళ్ళ శాఖ డిజి సౌమ్య మిశ్రా, ఐజిలు రాజేష్, మురళి,డీఐజీ లు సంపత్, శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు. రాష్ట్రంలోని నాలుగు ప్లాటూన్స్ నుండి 220 మంది ఖైదీలకు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, చెస్, క్యారమ్స్, పాటలు, డాన్స్, మరియు 100,800 మీటర్ల పరుగు పందేల్లో నిర్వహించిన పోటీలు.

మహేందర్ రెడ్డి కామెంట్స్ :

అనాలోచిత క్షణీక ఆవేశాలు మనిషిలో రాక్షసత్వాన్ని పైకి లేపి నేర చరిత్రకు శ్రీకారం చుడుతుంది. కుటుంబం సమాజానికి దూరం అవుతూ దౌర్భాగ్యమైన జైలు జీవితాన్ని అనుభవిస్తూ ప్రచ్చత్తాప పడాల్సి వస్తుంది. ప్రతి మనిషి ప్రేమను అలవర్చుకుని మంచితనంతో శాంతియుత సహజీవనం చేయాలి. మంచి ప్రవర్తన మనిషిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతుంది. నేరాలు, మారణ హోమాలు వీడండి. పరిశుభ్రతకు, శిక్షణకు చర్లపల్లి జైలు మంచి పేరు తెచ్చుకుందని అధికారులను అభినందించారు.

## మృతిని కుటుంబాన్ని పరామర్శించిన
# ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు





వరంగల్ (లోకల్ గైడ్ ) : వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ గా ( డ్రైవర్) విధులు నిర్వహిస్తున్న ముత్యాల మహేష్ అనారోగ్యంతో ఆకస్మికంగా మరణించగా సోమవారం రోజున వర్ధన్నపేట మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య మహేష్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుటుంబ సభ్యులకు కట్ర్యాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బండారి సతీష్ 2000 రూపాయలు, కట్ర్యాల గ్రామ మాజీ ఉపసర్పంచ్,కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి గజ్జల సదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాంపెల్లి రవీందర్, వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కొండేటి మధుకర్,మహిళా మండల నాయకురాలు తీగల సునీత,నాయకులు ముత్యాల కొమ్మలు మహమ్మద్ షబ్బీర్, తాటికాయాల కుమార్,ఇ రాజు, ఇబ్రహీం, సురేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖ అధికారులతో
## సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే నాగరాజు



వరంగల్ (లోకల్ గైడ్ ) : హన్మకొండ ఆర్ - బి గెస్ట్ హౌస్ నందు వచ్చే వర్షాకాలం లో చెరువులు, కుంటలు, కెనాన్ల పరిరక్షణ కోసం అలాగే వర్షాకాలంలో కురిసే నీటిని చెరువులు కుంటలు నింపుకొని వాటి సంరక్షణ, రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన చర్యల గురించి ఇరిగేషన్ శాఖ అధికారులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు తమ మండల, గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వారి ముందే ఆయా సమస్యలను ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో చెరువులు, కుంటలు, కెనాన్ల పరిరక్షణ కోసం అధికారులు బాధ్యతగా తీసుకొని తగు చర్యలు తీసుకోనీ వర్షాకాలం నాటికి రైతులకు ఏ సమస్య లేకుండా చూడాలని అలాగే ఎవరైనా కాలువలను తూములను విధ్వంసం చేసిన, కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని,అలాగే మున్సిపల్ పరిధిలో ఉన్న నాళాలను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అక్రమాలు పాల్పడుతున్నారని వాటిని పరిరక్షించాలని అధికారులకు ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఏమైనా పెండింగ్ సమస్యలు ఉన్న తమ దృష్టి తీసుకొని వస్తే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చించి సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తానని, అధికారులు ఎవరూ అలసత్యం వహించకుండా విధులు నిర్వహించి రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈలు, డిఈలు, ఏఈలతో పాటు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# రైతుల దరఖాస్తులు పరిశీలన

**- అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**



వరంగల్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సోమవారం రోజున వర్ధన్నపేట మండలంలోని దమ్మన్న పేట, రామరం గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను గురించి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, తుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సంబంధిత సమస్యలు ఉన్నవారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు.ఫార్మార్ రిజిస్ట్రర్ను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి, వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని తెలిపారు. సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు విస్తీర్ణం హెచ్చుతగ్గులు వారసత్వ భూములు భూ స్వభావం, తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, వర్ధన్నపేట తహసిల్దార్ విజయసాగర్, రెవిన్యూ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెన్ను నొప్పితో మనస్తాపం చేంది ఒకరి ఆత్మహత్య



నిర్మల్ : లోకల్ గైడ్ : నిర్మల్ జిల్లా భైంసా మండలం వట్టోలి గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ (39) వెన్ను నొప్పితో మనస్తాపం చేంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు జాదవ్ వినోద్ (39) గత రెండు సంవత్సరాల నుండి వెన్ను నొప్పితో బాధ పడేవాడని అతనికి వెన్ను నొప్పికి శస్త్ర చికిత్స కూడా జరిగిందని అయినా విననొప్పి తగ్గలేదని అన్నారు. అప్పటి నుండి వ్యవసాయం ఇతర పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడేవాడని శస్త్ర చికిత్స వల్ల ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదురయ్యాయని దాంతో తనలో తానే మానసికంగా బాధ పడుతూ ఉండే వాడని అన్నారు. ఆదివారం రోజున రాత్రి సమయం లో భోజనం చేసి ఇంటి పైన గదిలో పడుకోగా ఇదే క్రమంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వారి తెలిపారు. తరువాతి రోజున ఉదయం సమయం 05:30 గంటలప్పుడు భార్య పైన గదిలోకి వెళ్ళి చూసే సరికి తన భర్త దూలమునకు చీరతో ఉరి వేసుకుని ఉన్నట్లు కనిపించాడని మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య తోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు

## భద్రాద్రి జిల్లా టిఎంఆర్పిఎస్
## వర్కింగ్ ప్రెసిడెంట్ గా రామిళ్ళ మధు మాదిగ



కొత్తగూడెం (లోకల్ గైడ్) ప్రతినిధి: టిఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజు మాదిగ ఆదేశాలతో పట్టణ బస్టాండ్ సమీపంలో టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామిళ్ల మధు మాదిగను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్పిఎస్ మాదిగ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి సంతోష్ టిఎంఆర్పిఎస్ భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు శ్రీకాంత్ చుంచుపల్లి మండల అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్ నాయకులు బోయిని మహేందర్ డిఎంఆర్ చంద్రుగొండ మండల అధ్యక్షులు పెబ్బేందుల నరసరావు మాదిగ డి మూర? ప్రసాద్ అనిల్ కాజా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో 300 పడకల సౌకర్యం తో జనరల్ ఆసుపత్రి ప్రారంభం

- వైద్యాధికారులు బాధ్యతాయుతంగా, సేవా దృక్పథంతో పని చేయాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- నూతనంగా మంజూరైన వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం పూర్తి చేయాలి

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ**



వికారాబాద్ జిల్లా, లోకల్ గైడ్: సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో 30 కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన 300 పడకల సౌకర్యం తో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, శాసన సభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభం చేశారు. అనంతరం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రుల, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, బ్లడ్ బ్యాంక్, వైద్యుల విధుల నిర్వహణ తదితర అంశాలపై వైద్య అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ... జనాభా ప్రాతిపదికన, ప్రజలకు దూరాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పునఃపరిశీలించి రోడ్డు భద్రత సమావేశాలను నిర్వహించి బ్లాక్ స్పార్ట్ లను గుర్తించాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. ప్రమాదాలు సంభవించిన క్రమంలో సత్వర వైద్య సేవలు అందించేందుకు ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఒక్కో దానికి 5.5 కోట్ల నిధులను కేటాయించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. డీఎం హెచ్ఓ, సూపరింటెండెంట్ లు జావాబుదారితనంతో ఉండాలని మంత్రి తెలిపారు. ఆసుపత్రుల్లో సంబంధిత అధికారులు అందుబాటులో లేకుంటే ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని మంత్రి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వేతర ఆసుపత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి మంత్రి ఆదేశించారు. ప్రైవేట్ ఆస్పత్రులు వైద్య పరమైన నిబంధనలకు అనుగుణంగా నడపాలని మంత్రి తెలిపారు. నూతనంగా మంజూరైన వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రాధాన్యత క్రమంలో వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వైద్య కళాశాల, వసతి గృహాలకు సంబంధించి అత్యవసర మరమ్మత్తుల పనులను వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంఇ డాక్టర్ నరెంద్ర కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ అజయ్ కుమార్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డిలు, తదితరులు పాల్గొన్నారు.



# హత్యా కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

**- జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి, ఐపీస్.**



వికారాబాద్ జిల్లా: లోకల్ గైడ్): 02.04.2015 సంవత్సరంలో యాలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యా నేరంలో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు మరియు ఒక్కొక్కరికి ?1000/- (ఒక వెయ్యి రూపాయలు) జరిమానా విధించిన గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ %డ% సెషన్స్ జడ్జి శ్రీ డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి గారు.ఇట్టి తీర్పుకు సంభందించిన వివరాలను జిల్లా ఎస్పీ శ్రీ కె.నారాయణ రెడ్డి,తెలిపారు. ఈ కేసు యొక్క వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ఫిర్యాదు దారుడు హరిలాల్, 2013 బ్యాచ్కు చెందిన పోలీస్ కానిస్టేబుల్. అతను నవంబర్ 2013 లో కోడంగల్ పోలీస్ స్టేషన్, నందు పని చేసే సమయం లో 02.04.2015న కోడంగల్ ఎస్.ఐ గారి ఆదేశానుసారం ఎర్రన్ పల్లి గ్రామంలో సస్పెక్ట్ దోమ బుగ్గప్ప (తండ్రి లచ్చప్ప, నివాసం: ఎర్రన్ పల్లి గ్రామం, కోడంగల్ మండలం) అదే గ్రామానికి చెందిన రాములు గౌడ్ కుమారుడైన రవీందర్ గౌడ్ను చంపుతానని బెదిరించాడని ఫిర్యాదు రాగ విచారించడానికి హరిలాల్ ఎర్రన్ పల్లి గ్రామానికి తన మోటార్ సైకిల్ నెంబర్ పై వెళ్ళాడు. అక్కడ గ్రామ పంచాయతీ వద్ద రాములు గౌడ్, రాములు గౌడ్ తమ్ముడు లక్ష్మయ్య గౌడ్, పకీరప్ప మరియు ఉప సర్పంచ్ నర్సప్పతో పాటు మరికొంతమంది గుమిగూడి ఉండగా, హరిలాల్ బుగ్గప్ప గురించి అడిగాడు. వారు తిమ్మాయిపల్లి గేటు వద్ద గల దర్గా దగ్గర ఉన్నాడని చెప్పడంతో, హరిలాల్ వెంటనే తన మోటార్ సైకిల్పై దర్గాకు వెళ్ళాడు. అక్కడ బుగ్గప్ప కనిపించగానే, అతనిపై రాములు గౌడ్ ఫిర్యాదు చేశాడని చెప్పి, అతన్ని తన మోటార్ సైకిల్పై కూర్చోబెట్టుకుని కోడంగల్ పోలీస్ స్టేషన్కు తీసుకువెళుతుండగా, జుంటుపల్లి గేటు దాటిన తర్వాత మధ్యాహ్నం సుమారు 03:30 గంటల సమయంలో, రాములు గౌడ్, రాములు గౌడ్ తమ్ముడు, పకీరప్ప మరియు ఉప సర్పంచ్ నర్సప్పతో పాటు మరో ఇద్దరు రెండు మోటార్ సైకిళ్లపై మరియు ఒక స్కూటర్పై హఠాత్తుగా వచ్చి హరిలాల్ను అడ్డుకున్నారు. హరిలాల్ కొద్దిగా బైక్ను ఆపగానే, రాములు గౌడ్ వెనుక కూర్చున్న బుగ్గప్ప చొక్కా కాలర్ పట్టుకుని కిందకు లాగాడు. వెంటనే ఇద్దరూ మోటార్ సైకిల్ నుండి కింద పడిపోయారు. రాములు గౌడ్తో పాటు ఉన్న మిగతా ఐదుగురు గుంపుగా చేరి బుగ్గప్పపై దాడి చేస్తుండగా, హరిలాల్ వారిని విడిపించడానికి ప్రయత్నించాడు. అప్పుడు రాములు గౌడ్ తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో బుగ్గప్ప తలపై బలంగా నరికాడు. బుగ్గప్ప రోడ్డుపై పడిపోగానే, రాములు గౌడ్ తమ్ముడు (లక్ష్మయ్య గౌడ్) తన అన్న దగ్గర నుండి వేట కొడవలిని తీసుకుని బుగ్గప్ప తల మరియు ఇతర శరీర భాగాలపై నరికాడు. మిగిలిన వారు బుగ్గప్పపై పడి చేతులతో కొడుతూ, కాళ్ళతో ఇష్టం వచ్చినట్లు తన్నారు. ఆ దెబ్బలకు బుగ్గప్ప అక్కడికక్కడే మరణించాడు. అనంతరం వారు తమ మోటార్ సైకిళ్లపై ఎర్రన్ పల్లి గ్రామం వైపు పారిపోయారు. వెంటనే హరిలాల్ ఈ విషయాన్ని తన ఎస్సై ఫోన్ ద్వారా తెలియజేశాడు. నిందితులను చూస్తే గుర్తు పట్టగలనని హరిలాల్ యాలాల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.వెంటనే యాలాల్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 52/2015, U/sec 302, 353 R/w 34 IPCసెక్షన్ల క్రింద అప్పటి యాలాల్ ఎస్ఐ రవి కుమార్ కేసు నమోదు చేయగా, అప్పటి కరణ్కోట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శివ శంకర్ కేసును దర్యాప్తు చేసి గౌరవ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న గౌరవ డిస్ట్రిక్ట్ - సెషన్స్ జడ్జి శ్రీ డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి గారు ఈ రోజు నిందితులు ఏ1) ఈడిగి రాములు గౌడ్ మరియు ఏ2) ఈడిగి లక్ష్మయ్య గౌడ్లకు జీవిత ఖైదు మరియు ఒక్కొక్కరికి ?1000/- జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినారు అని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణ గౌడ్, వి. రవి కుమార్, సుధాకర్ రెడ్డి లకు, దర్యాప్తు అధికారులు అప్పటి యాలాల్ ఎస్సై రవికుమార్, అప్పటి కరణ్కోట్ ఇన్స్పెక్టర్ కె. శివ శంకర్, ప్రస్తుత కరణ్కోట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నగేష్, యాలాల్ ఎస్సై గిరన్న, సి డి ఓ లు జి. శ్రీశైలం, ఎం. శ్రీనివాస్ మరియు బ్రీఫింగ్ అధికారులు బి. వీరన్న గార్లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా
# భూ సమస్యలకు పరిష్కారం

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ : లోకల్ గైడ్ : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి భూసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టం ద్వారా భూ రికార్డుల్లో తప్పులన్నీ సరిచేసి, భూమిపై యజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేరు, విస్తీర్ణం లోపాలు, వారసత్వ హక్కులు, సర్వే నంబర్ల లోపాలు, హద్దుల వివాదాలు, భూసేకరణ సమస్యలపై ప్రజల దరఖాస్తులు స్వీకరించామని అన్నారు. దరఖాస్తులకు రశీదులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. హెల్ప్ డెస్క్, త్రాగునీరు వంటి సదుపాయాలను స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గ్రామస్తులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి లేనందున ఇబ్బందులు ఎదురవుతోందని గ్రామస్తులు చెప్పగా, రేపటిలోగా కార్యదర్శిని నియమిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సుకు ఎక్కువ మంది ప్రజలు హాజర కావడం పట్ల కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులను అభినందించారు. ఈ సదస్సులో భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ కమల్ సింగ్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సేవలను ప్రశంసించిన జిల్లా కలెక్టర్




నిజామాబాద్,లోకల్ గైడ్ : రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్న నిజామాబాదు వాసి తోట రాజశేఖర్ కు జాతీయ స్థాయిలో రెడ్ క్రాస్ అవార్డు దక్కిన సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అభినందించారు . రెడ్ క్రాస్ జిల్లా శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న తోట రాజశేఖర్ ను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయం అని కొనియాడారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన వడదెబ్బ నివారణ సూచనా పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రజలలో అవగాహన పెంపొందించడంలో రెడ్ క్రాస్ కొనసాగిస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో బ్లడ్ డొనేట్ సేవలు అందిస్తున్నారని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏ.సి.పి రాజా వెంకట్ రెడ్డి, ఇంచార్జి ఆర్.డి.ఓ స్రవంతి, డి.పి.ఓ శ్రీనివాస్ రావు, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, టీఎన్జీఓ ల సంఘం అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు , కోశాధికారి కరిపే రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను సన్మానించిన కలెక్టర్




కామారెడ్డి ,లోకల్ గైడ్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సన్మానించారు . కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం రోజున పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి బొడ్డుపల్లి నాగ అక్షయ 600కు 586 మార్కులు, వీరితో పాటు బి. హర్షవర్ధన్ 576, ఎస్ మృణాళిని 572, సిహెచ్ జాహ్నవి 562, బి.అలేఖ్య 562, పి.ఋతిక 555, బి.రామ్ చరణ్ 554, ఆర్. నిశాంత్ 554 మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు . అలాగే 100% ఉత్తీర్ణతతో పాటు 54 మంది విద్యార్థులకు గాను 37 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులను సాధించారు అని శ్రీ చైతన్య పాఠశాల ఆర్ఐ అన్నపూర్ణ కలెక్టర్ కు వివరించారు. అనంతరం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాతో ఘనంగా సంస్కరించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ డీన్ భీరేష్ ,పదవ తరగతి ఇంచార్జ్ వసంత్ గౌడ్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## 27 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి
# శంకుస్థాపన చేసిన మంత్రి రాజ నర్సింహ



లోకల్ గైడ్ పరిగి: పరిగి పట్టణంలో రూ.27 కోట్ల టీవీవీపీ నిధులతో అత్యాధునిక వసతి సౌకర్యాలతో 30 పడకల నుంచి స్థాయి పెంచుతూ 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంచుట కొరకు ఆస్పత్రి నిర్మాణ పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి పరిగి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



కామారెడ్డి,లోకల్ గైడ్ : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇళ్లు మంజూరు, రైతు భరోసా, ఫించన్లు మంజూరు తదితర అంశాలపై ప్రజావాణి లో (76) ఫిర్యాదులు పలు శాఖలకు చెందినవి అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యా సాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్, ఆర్డీఓ వీణ, పలు శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులపై హోంమంత్రి అనిత సీరియస్..
### చర్యలు తప్పవని వార్నింగ్..



**(లోకల్ గైడ్):అమరావతి,:** అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత.. విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశానికి హాజరైన ఆమె.. డీఆర్సీలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఏదో కాకి లెక్కలతో కాగితాల దొంతులుగా ప్రెస్‌నోట్ మా కిచ్చి వెళ్లిపోతున్నారని ఫైర్ అయ్యారు.. కానీ, ఆ పేపర్లు తర్వాత చెత్త బుట్టలోకి వెళ్లిపోతున్నాయి.. అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు.. కానీ, ఇక ఇలాంటి పద్ధతికి చెల్లు చీటు చెప్పండి ఇక నుంచి ముందే కలెక్టర్ వద్ద గత డీఆర్సీలో ఏం చేశామో చర్చించండి.. ఎంత వరకు పూర్తి చేశామో ముందే బ్రీఫ్ చేసి పెట్టుకోండి అని ఆదేశించారు.. విజయనగరం వెనుకబడిన జిల్లా అంటారు.. ఎవ్వరన్నారు వెనుకబడిన జిల్లా అని జిల్లాకి అన్ని వనరులు ఉన్నాయి.. వర్షపాతం అధికంగా ఉన్నాయి.. నీటి నిలువలు అధికంగా ఉన్నాయన్నారు హోంమంత్రి అనిత.. అధికారులు ఏం పని చేస్తున్నారో నాకు అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ డీఆర్సీలో ప్రజాప్రతినిధులు ఏ సమస్యలు లేవనెత్తినా.. ఆ తర్వాత అది ఎంత మేర పరిష్కరించగలిగామో చెప్పాలి.. లేనిపక్షంలో కచ్చితంగా చర్యలు తప్పవు అని వార్నింగ్ ఇచ్చారు.. ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.. గతంలో హెవీ లోడ్స్ తో వెళ్లిన వాహనాలు ఎన్ని ఉన్నాయో ఆర్ అండ్ బీ, ఆర్టీవో సమన్వయంతో గుర్తించాలని అడిగా కానీ, ఇంత వరకు ఎందుకు సమన్వయ సమావేశం పెట్టుకోలేదు? అని నిలదీశారు.. ఇలా అయితే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని ఆర్ అండ్ బీ అధికారులపై మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు..

## హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి దారుణంగా వ్యవహరిస్తున్నారు..



**హైదరాబాద్, :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా మండిపడ్డారు. హైడ్రాతో ముఖ్యమంత్రి దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 1965లో అల్వాల్ లో 50 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఓ కాలనీ ఉంది.. ఈ కాలనీకి ఇంటింటికీ నోటీసులు ఇవ్వడమే కాకుండా.. చివరికి గుడులకు కూడా నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఒక తరం త్యాగం చేస్తే.. రెండో తరం ఇల్లు కట్టుకుంది.. మూడో తరం చదువుకుంటోంది అని గుర్తు చేశారు. బాలాజీ నగర్, అరుందతి నగర్ లో ఇలా ఉంది పరిస్థితి.. ఇక, ప్రజల జీవనంలో మంచి మార్పు వస్తదని ముఖ్యమంత్రిని చేస్తే.. నేను ఎవరు చెప్పినా వినను.. నాకు నేను నిర్ణయం తీసుకుంటానంటున్నాడు.. హైడ్రా పేరుతో పక్కా ఇల్లు కూలగొట్టుడే.. అడ్డమొచ్చిన వాళ్లను బుల్డోజర్లతో తొక్కవలసిందే అన్నట్లుగా రేవంత్ రెడ్డి స్టేట్ మెంట్ ఇస్తున్నాడని ఎంపీ ఈటల అన్నారు. అయితే, ఇంటెలిజన్స్ వ్యవస్థ అయినా ఇక్కడి ప్రజల పరిస్థితి చెప్తుంటరు కదా.. అయినా సీఎం రేవంత్ ఎందుకు వినడం లేదని బీజేపీ ఎంపీ ఈటల ప్రశ్నించారు. ఎవరు చెప్పినా వినని వారిని నాయకుడు అనరు.. సైకో అంటారని విమర్శించారు. ఇక, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బాధపడుతూ.. ఆత్మహత్య చేసుకుంటుంటే.. నవ్వే వాళ్లను సైకో అంటారు.. కోర్టుల్లో అడ్వకేట్లు వాదిస్తరు.. అంతిమ న్యాయనిర్ణేత జడ్జిది ఉంటది.. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ కర్తవ్యం ఆ పార్టీకి ఉంటది.. ఆయా పార్టీల ఎజెండా ఆయా పార్టీలకు ఉంటది.. కానీ, అంతిమంగా న్యాయ నిర్ణేతలు ప్రజలే ఉంటారు అని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.

## రెండేళ్లలో పరిగి ప్రజలకు కొత్త హాస్పిటల్ అందుబాటులోకి



**హైదరాబాద్, :**వికారాబాద్ జిల్లా పరిగిలో హాస్పిటల్ భవనం నిర్మాణానికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద బెడ్ల ఏరియా హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌కు సుమారు రూ.26 కోట్ల వ్యయం వెచ్చించి, రెండు సంవత్సరాల్లో కొత్త హాస్పిటల్‌ను ప్రజల సేవ కోసం అందుబాటులోకి తెచ్చే దిశగా వారు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. హాస్పిటల్‌లో అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రత్యేకంగా, కిడ్నీ పేషెంట్ల కోసం డయాలసిస్ సెంటర్‌లో బెడ్లు, మిషన్ల సంఖ్య పెంచే ప్రక్రియను ప్రారంభించామన్నారు. హాస్పిటల్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా, రోడ్డు ప్రమాదాలు , ఇతర ఎమర్జెన్సీల్లో ప్రజల ప్రాణాలు కాపాడే సదుపాయాలు అందజేస్తామని చెప్పారు. అంబులెన్స్ సేవలను మరింత మెరుగుపరచేందుకు, కొత్త అంబులెన్స్‌లు తీసుకురావడంపై దృష్టి పెట్టిన మంత్రి, ముఖ్యంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్‌ను పది నిమిషాలకు తగ్గించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవలే 213 కొత్త అంబులెన్స్‌ను గౌరవ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, భవిష్యత్తులో మరిన్ని అంబులెన్సు అందుబాటులోకి తీసుకొచ్చే వాగ్దానం చేశారు. పరిగిలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసే దిశగా పరిశీలన చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గతేడాది 16 కొత్త నర్సింగ్ కాలేజీలను ప్రారంభించడం, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యను అందించడం, యువతకు దేశం , విదేశాలలో ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రోత్సహించడం జరుగుతోందని చెప్పారు. 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసినట్లు, మరో 2300 పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా త్వరలో పూర్తి కానున్నట్లు వెల్లడించారు. హెల్త్ క్యాంపెయిన్లు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌సీడీ (నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్) క్లినిక్స్ ఏర్పాటు చేయడం, అలాగే 4 రీజనల్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు పై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. ప్రజలు తమ ఆహార అలవాట్లను సరిదిద్దుకుని, వ్యాయామం చేయడం ద్వారా వ్యాధుల నుండి రక్షించుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటళ్ల రూపురేఖలను మార్చి, వాటిని ఆకర్షణీయంగా , పేషెంట్లకు సౌకర్యవంతమైన వాటిగా మారుస్తామని, ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించబడతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందరె రెడ్డి పాల్గొన్నారు.

## భారత రక్షణ శాఖకు విరాళం అందించిన ఇళయరాజా..

**(లోకల్ గైడ్):**ఏప్రిల్ 22, 2025న కాశ్మీర్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడి తర్వాత.. భారత్ పాక్ మధ్య పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ గుండెల్లో గుబులు పుట్టిస్తుంది భారత్. ఇప్పటికే వందల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టింది భారత్. అయినప్పటికి భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో దేశం మొత్తం హై అలర్ట్ ప్రకటించింది. అయితే, తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఇరు దేశాల సరిహద్దుల్లో శాంతి నెలకొంది. అయితే ఈ విషయం పై ఇప్పటికే నటినటులు సెలబ్రెటీలు అంతా కూడా రియాక్ట్ అవుతూ భారత రక్షణ శాఖకు తోచినంత సహాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు, రాజ్యసభ సభ్యుడు ఇళయరాజా భారత రక్షణ శాఖకు తన ఒకరోజు పారితోషికాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ విషయాన్ని ఇళయరాజా తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. 'పహల్గామ్‌లో మన దేశ పర్యాటకులపై ఉగ్రమూక దాడి చేసింది. దీనికి మన దేశ సైనికులు తప్పక ప్రతీకారం తీర్చుకోవాలి. వారి ధైర్య సాహసాలు అభినందనీయం. మన సైనికులు ఆత్మస్థైర్యంతో వారిని మట్టు పెడతారనే నమ్మకం నాకు ఉంది. దేశ పౌరుడిగా, ఎంపీగా నా ఒకరోజు పారితోషికాన్ని దేశ రక్షణ శాఖకు విరాళంగా ప్రకటిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు.

# సుందర సౌరాష్ట్ర..సమైక్య యాత్ర



**(లోకల్ గైడ్):**వడోదరలో పూల గడియారం... అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం. గాంధీనగర్‌లో అక్షరధామ్... పోర్‌బందర్‌లో కీర్తిమందిర్. ద్వారకలో కృష్ణుడి జగత్‌మందిర్...

కేలాడియాలో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ.

జామ్‌నగర్ లఖోటా కోట... సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం.

1 రోజు

సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. ఇది ఎనిమిది రోజుల టూర్. ఇందులో వడోదర, అహ్మదాబాద్, ద్వారక, సోమనాథ్, పోర్‌బందర్ కవర్ అవుతాయి.

2వ రోజు

ఉదయం పదకొండు గంటలకు రైలు వడోదర స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్ అవాలి. మధ్యాహ్నం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహాన్ని చూడడానికి తీసుకెళ్తారు (ఎంట్రీ టికెట్ ప్యాకేజ్‌లో వర్తించదు, పర్యాటకులు కొనుక్కోవాలి). రాత్రికి వడోదర హోటల్ గదిలో బస. రాజ్యాలన్నింటికీ ఒకటే జెండా: స్టాచ్యూ ఆఫ్ యూనిటీ... స్వాతంత్ర్యసమరయోధుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం. దీని ఎత్తు 597 అడుగులు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. గుజరాత్ రాష్ట్రం, కెవాడియా ప్రదేశంలో ఉంది. నర్మదానది మీద నిలబడి సర్దార్ సరోవర్ డ్యామ్‌ను చూస్తున్నట్లు ఉంటుంది. వడోదరకు వందకిలోమీటర్ల దూరం. దేశంలోని రాజ్యాల మధ్య ఐక్యత కోసం, జమీందారాలన్నింటినీ భారత్ రిపబ్లిక్‌లో విలీనం చేసి ఒక పతాకం కిందకు తీసుకురావడానికి పటేల్ చేసిన కృషిని గౌరవిస్తూ ఆయన విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ అనే పేరు పెట్టారు.

3వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత వడోదరలో హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. నగరంలో లక్ష్మీవిలాస్ ?్యాలెస్ తదితరాలను చూసిన తర్వాత అహ్మదాబాద్‌కు ప్రయాణం. అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం, అక్షరధామ్ టెంపుల్ చూసిన తర్వాత హోటల్ చెక్ ఇన్. రాత్రి బస. ప్యాలెస్‌లో స్టెప్‌వెల్: వడోదర... చారిత్రక ప్రాధాన్యత ఉన్న నగరం. ఈ నగరం విశ్వమిత్రి నది తీరాన ఉంది. నగరంలో మహారాజా షాయాజీరావు యూనివర్శిటీ... సిటీ హాల్... ఇలా ప్రముఖమైన కట్టడాలన్నీ రాజా పేరుతోనే ఉంటాయి. ప్యాలెస్‌ల ఆర్కిటెక్చర్ అద్భుతంగా ఉంటుంది. గైక్వాడ్ రాజకుటుంబం నివసించిన మహారాజా ప్యాలెస్‌లో సర్కార్‌వాడా, లక్ష్మీవిలాస్ ప్యాలెస్, ప్రతాప్ ప్యాలెస్, మోతీబాగ్ ప్యాలెస్, మోతీబాగ్ స్టేడియం, మహారాజా ఫతే సింగ్ మ్యూజియం, జూ, నవలాక్షి స్టెప్ వెల్ ఉన్నాయి. ఇది తొమ్మిది మిలియన్ల గ్యాలన్ల నీటిని స్టోర్ చేయగలిగిన బావి. ఇక లక్ష్మీ ప్యాలెస్ అయితే ఇటాలియన్ మార్బుల్ ఫ్లోరింగ్, గోడలకు మొజాయిక్ డెకరేషన్, టెర్రకోట శిల్పాలు... ఇలా ప్రతిదీ ఒక కళాఖండమే. ఫతే సింగ్ మ్యూజియం కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. ఇందులో గ్రీకు, రోమన్, యూరప్ శిల్పాలు, ఫ్రెంచ్ ఫర్నిచర్ ఉంది. రాజారవివర్మ చిత్రలేఖనాలు కూడా ఉన్నాయి. షాయాజీ రావు గైక్వాడ్ ఆధునిక వాది. నగరాన్ని శాస్త్రసాంకేతికంగా వృద్ధి చేశాడు. అంబేద్కర్ విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాడు.

4వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి ద్వారక వైపు సాగి?వాలి. దారిలో జామ్ నగర్‌లోని లఖోటా ప్యాలెస్, మ్యూజియం విజిట్. సాయంత్రానికి ద్వారక చేరి హోటల్ చెక్ ఇన్, రాత్రి బస. సరస్సులో కోట: కోటల చుట్టూ కందకాలుంటాయి. కానీ ఇక్కడ నీటి మధ్యలో దీవి మీద కోట ఉంటుంది. లఖోటా సరస్సు మధ్యలో ఉన్న కోట కావడంతో దీనిని లఖోటా కోట అనే పిలుస్తారు. జామ్‌నగర్ పాలకులు ఉపయోగించిన వస్తువులతోపాటు నాటి కళాకృతులతో కోటలోపల మ్యూజియం ఉంది.

ఐదవ రోజు

ఉదయం ద్వారకాధీశుని దర్శనం, బేట్ ద్వారక, నాగేశ్వర్ టెంపుల్ దర్శనం. ఆ తర్వాత ద్వారకకు తిరుగు ప్రయాణం. రాత్రి బస ద్వారకలోనే. బీసీ కాలపు జగత్‌మందిర్: కృష్ణుడు పూజలందుకునే ఈ ఆలయాన్ని ద్వారకాధీశ్ మందిర్ అంటారు. ఐదంతస్థుల ఆలయం మనకు విచిత్రంగా అనిపిస్తుంది. క్రీ.పూ రెండు వందల ఏళ్ల నాటిదని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. మనకు ఇప్పుడు కనిపిస్తున్నది క్రీ.శ 15-16 శతాబ్దాల నాటి పునర్నిర్మాణం. ఆలయాలు పశ్చిమముఖంగా ఉండడం కూడా అరుదైన విషయం. ఆలయంఅరేబియా సముద్రాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. తెలుగు రాష్ట్రం చిత్తూరు జిల్లా, నాగులాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో విష్ణుమూర్తి పశ్చిమముఖంగా ఉంటాడు.

6వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి సోమనాథ్ వైపు సాగిపోవాలి. దారిలో పోర్‌బందర్‌లోని కీర్తిమందిర్, సుధామ టెంపుల్ విజిట్. సోమనాథ్ చేరిన తర్వాత సోమనాథ జ్యోతిర్లింగ దర్శనంతోపాటు ఆలయం చుట్టు పక్కల ఉన్నవాటిని తిరిగి చూడడం, సాయంత్రం తర్వాత పోర్‌బందర్‌కు ప్రయాణం. రాత్రికి పోర్ బందర్ రైల్వే స్టేషన్‌కి చేరడంతో యాత్ర పూర్తవుతుంది.

145 ఏళ్లుగా ఆగని గడియారం:

ఫ్లోరల్ క్లాక్... వడోదర సిటీసెంటర్‌లోని షాయాజీ బాగ్‌లో ఉంది. క్రీ.శ 1879లో మూడవ మహారాజా షాయాజీరావు నిర్మించాడు. 13 ఎకరాల ఉద్యానవనంలో బరోడా మ్యూజియం అండ్ పిక్చర్ గ్యాలరీ, ఒక జూ, సర్దార్‌పటేల్ ప్లానిటోరియం... గార్డెన్ మొత్తం చూడడానికి టాయ్‌ట్రెన్ ఉన్నాయి. ప్లానిటోరియం పక్కనే ఆస్ట్రానమీ పార్క్ ఉంది. పురాతన కాలంలో వాడిన ఆస్ట్రనామికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా ఉన్నాయి. బరోడా మ్యూజియంలో పిక్చర్ గ్యాలరీలో మినియేచర్ కళాఖండాల నిలయం. హజీరా మఖ్బారా, న్యాయమందిర్, దభోయి ఫోర్ట్, మకాయ్ కోట, జమామసీదు, కీర్తి మందిర్, అరబిందో సొసైటీ చూడవచ్చు. స్థానికులు గుజరాతీతోపాటు సింధీ భాష కూడా మాట్లాడతారు. అహ్మదాబాద్: అహ్మదాబాద్ గురించి మాట్లాడాలంటే సబర్మతి నది గురించి మాట్లాడాలి. నదికి రెండువైపులా విస్తరించిన నగరం ఇది. ఒక వైపు వాళ్లు మరో వైపుకు రావడానికి నగరంలో ఈ నది మీద పదకొండు వంతెనలున్నాయి. ఎల్లిస్, గాంధీ, నెహ్రూ, సుభాష్, వాదాజ్ దూధేశ్వర్, సర్దార్, చంద్రభాగా, అంబేద్కర్, లాల్ బహదూర్ శాస్త్రి, ఫెర్నాండెజ్, దండి బ్రిడ్జిలు. బ్రిటిష్ పాలకుల తోపాటు జాతీయనాయకులను గౌరవిస్తూ నామకరణం చేయడం గొప్పగా అనిపిస్తుంది. మీరు నగరంలో ఏ వంతెన మీద ప్రయాణించారో సరదాగా గమనించండి. సబర్మతి రివర్ ఫ్రంట్ సూర్యోదయాలు, సాయంత్రాలను ఆస్వాదించడానికి మంచి ప్రదేశం. ఇక మనకు చిన్నప్పటి నుంచి చిరపరిచితమైన సబర్మతి ఆశ్రమం గాంధీజీ నివసించిన ప్రదేశం. ఇక్కడ జాతీయోద్యమ చర్చలు జరిగేవి. గాంధీజీ దండి సత్యాగ్రహాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఇప్పుడు ఆశ్రమంలో గాంధీజీ ఉపయోగించిన వస్తువులను చూడవచ్చు. నగరంలో సయ్యద్ సిద్ధిఖీ జాలీలో రాతిలో సునిశితంగా చెక్కిన డిజైన్‌ని తప్పకుండా చూడాలి. జైన్ మందిరం, కాలికో మ్యూజియం, సర్దార్ పటేల్ మ్యూజియం కూడా చూడాల్సిన ప్రదేశాలు.

ప్రశాంత ధామం: అక్షరధామ్ టెంపుల్ గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉంది. అహ్మదాబాద్‌కు 40 కిమీల దూరం. నగరంలో రాజధాని హడావుడి, ట్రాఫిక్ జామ్‌లు ఉండవు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ప్రభుత్వ ఆఫీసులు, వాటి అనుబంధ భవనాలు తప్ప ఇతర వర్తక వాణిజ్యాలు ఉండవు. నగరం ప్రశాంతంగా ఉంటుంది.

గాంధీజీ ఇక్కడే పుట్టాడు:

పోర్‌బందర్.... గాంధీజీ పుట్టిన నేల. ఇక్కడ గాంధీజీ పుట్టిన ఇల్లు బాపూ మహల్ ఉంది. దాని పక్కనే స్మారక మందిరం కీర్తిమందిర్, బాపూ మహల్ వెనుకగా కస్తూర్బా గాంధీ ఇల్లు ఉన్నాయి. గాంధీజీ ఇంటిలో అటకల నిర్మాణాన్ని గమనించాలి. పోర్‌బందర్‌లో శ్రీకృష్ణుని స్నేహితుడు సుధాముడికి మందిరం, వాళ్ల గురువు సాందీపుడి మందిరం ఉన్నాయి. సుధాముడి మందిరం విశాలంగా ఉంటుంది. ఇక్కడ భక్తులకు ప్రసాదంగా అటుకుల ?్యాకెట్ ఇస్తారు. ఈ ఐటెనరీ ప్రకారం సోమనాథ్ నుంచి తిరుగు ప్రయాణంలో పోర్‌బందర్‌కు చేరే ప్రయాణం అరేబియా తీరం వెంబడే సాగుతుంది. కాబట్టి జర్నీలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదించవచ్చు. సోమనాథ జ్యోతిర్లింగం: సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం ఓ గొప్ప ఆధ్యాత్మిక అనుబూతి. సోమనాథుడిని దర్శనం తర్వాత ఆలయం ఆవరణలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను చూడవచ్చు. ఆలయం బేస్ మెంట్ ఎత్తుగా ఉంటుంది. ఆలయం వెనుక సముద్రపు అలలు ఆలయాన్ని అలవోకగా తాకుతూ ఉంటాయి. ఆయలం ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహం నమూనాలోనే ఉంటుంది. నర్మద తీరాన పెద్ద విగ్రహస్థాపనకు ముందు నుంచే సోమనాథ్ ఆలయ ప్రాంగణంలో ఈ విగ్రహం ఉంది.

7వ రోజు

00.50 నిమిషాలకు (అర్ధరాత్రి 12.50 నిమిషాలు) ట్రైన్ నంబరు 20968 పోర్ బందర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ?ోర్‌బందర్ స్టేషన్ నుంచి బయలుదేరుతుంది.

8వ రోజు...

ట్రైన్ ఉదయం 8.20 నిమిషాలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుతుంది. బుధవారం మొదలైన పర్యటన బుధవారంతో పూర్తవుతుంది. ఈ ట్రైన్ అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఇదే రైలు తిరిగి సికింద్రాబాద్ నుంచి పోర్‌బందర్‌కు బయలుదేరుతుంది. ఇది వీక్లీ ట్రైన్.

ప్యాకేజ్ ధరల వివరాలు..

సుందర సౌరాష్ట్ర (ఎస్‌హెచ్‌ఆర్066) టూర్‌లో భాగంగా... ట్రైన్ నంబర్ 20967 సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. కంఫర్ట్ కేటగిరీ అంటే థర్డ్ ఏసీలో ప్రయాణం. ఇందులో ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 30 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 29 వేలవుతాయి. స్టాండర్డ్ కేటగిరీలో ట్విన్ షేరింగ్‌కి దాదాపు 27 వేలు, ట్రిపుల్ షేరింగ్‌కి దాదాపు 26 వేలవుతుంది. ఇందులో సింగిల్ ఆక్యుపెన్సీకి అవకాశం లేదు. ?్యకేజ్‌లో నాలుగు బ్రేక్‌ఫాస్ట్‌లు, నాలుగు రాత్రి భోజనాలు ఇస్తారు.

# మహాద్భుతం.. బుద్ధవనం



**(లోకల్ గైడ్):**నల్లగొండ: రెండు వేల సంవత్సరాల క్రితం ఆచార్య నాగార్జునుడు స్థాపించిన విజయపురి విశ్వవిద్యాలయం, ఇక్కడ విలసిల్లిన బౌద్ధమత ప్రాచుర్యం ఆధారంగా కృష్ణా తీరంలో (నాగార్జునసాగర్ తీరంలో) బుద్ధిస్టు హెరిటేజ్ థీం పార్కును బుద్ధవనం ప్రాజెక్టుగా మహాద్భుతంగా తీర్చిదిద్దారు. అభినవ బుద్ధుడు ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల ఇది. ఆ చరిత్ర ఆధారంగానే సాగర్ తీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం (శ్రీపర్వతారామం), 30 ఎకరాల్లో విపశ్యన కేంద్రం నిర్మించారు. అష్టాంగ విభాగాలుగా దీని నిర్మాణం చేశారు. ఆసియా ఖండంలోనే సిమెంట్‌తో నిర్మించిన అతిపెద్ద మహాస్థూపం బుద్ధవనం. ఈ నెల 12వ తేదీన బుద్ధపూర్ణిమ సందర్భంగా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలు దేరి వెల్లంకిలో కొంతసేపు సేద దీరి, నాగార్జునసాగర్‌కు చేరుకుంటారు. విజయవిహార్ అతిథిగృహంలో వారికి స్వాగత ఏర్పాట్లు చేశారు. విజయవిహార్ ముందు ఏర్పాటు చేసిన ఫొటో సెషన్‌లో పాల్గొంటారు. అనంతరం విజయవిహార్ వెనుకభాగంలో, సాగర్ తీరాన పచ్చికబయళ్లలో వారు ప్రత్యేకంగా ఫొటోలు దిగుతారు. ఆ తరువాత బుద్ధవనం చేరుకుంటారు. బుద్ధుని పాదుకల వద్ద 25 మంది బౌద్ధ సన్యాసులు నిర్వహించే బౌలికుప్ప మహాబోధి పూజల్లో పాల్గొంటారు. అక్కడినుంచి మహాస్థూపం వద్దకు చేరుకొని, వెనుక భాగాన ఉన్న మెట్ల ద్వారా పైకి ఎక్కుతారు. దానికి వంద అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాన్ని తిలకిస్తారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలో అష్టబుద్ధుల వద్దకు చేరుకొని అక్కడ కొవ్వొత్తులు వెలిగించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా బౌద్ధమత గురువు నిర్వహించే 5 నిమిషాల ప్రార్థనలో పాల్గొంటారు. అనంతరం రెండు నిమిషాల పాటు ధ్యానం చేస్తారు. అక్కడి నుంచి మహాస్థూపం చుట్టూ ఉన్న 2,500 విగ్రహాల గురించి పర్యాటక శాఖ ప్రతినిధి శివనాగిరెడ్డి వివరిస్తారు. అనంతరం జాతకవనంలోకి వెళతారు. అక్కడ వారికి బుద్ధవనం, తెలంగాణలో బౌద్ధ చరిత్ర ప్రాధాన్యత గురించి పర్యాటక శాఖ ప్రతినిధి వివరిస్తారు. బుద్ధుని పుట్టుక నుంచి నిర్యాణం వరకు ప్రత్యేక డ్రామాను ప్రదర్శిస్తారు.

### బుద్ధుని జీవిత విశేషాలు

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2003లో దీనిని ప్రారంభించింది. సిద్ధార్థ గౌతముని జీవితంలోని ప్రధాన ఘట్టాలను వర్ణించే అనేక నేపథ్య విభాగాలతో కూడినదే బుద్ధవనం. ఆయన పూర్వ జన్మ కథలను చిత్రీకరించిన జాతక పార్క్, సూక్ష్మ స్థూపాలతో కూడిన స్థూపపార్క్, మహాస్థూపం, బౌద్ధ హెరిటేజ్ మ్యూజియం, మహాస్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం, 27 అడుగుల బుద్ధ విగ్రహం ఇందులో ఏర్పాటు చేశారు. ధమ్మ గంటను శ్రీలంక ప్రభుత్వం విరాళంగా ఇచ్చింది. దేశంలోనే ఇది మొదటిది.

### ప్రవేశ వేదిక

ప్రవేశ వేదిక అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు, ఐకానిక్ రూపంలో బుద్ధుడు, జంతువులు, పక్షులు, బోధి వృక్షం, మిథునాలు (రసిక జంటలు), బుద్ధపాదాలు వంటివి ఇక్కడ ఉంటాయి. ప్రధాన ఇతివత్తాలు, సిద్ధార్థుని కిరీటం (జుట్టు) మోస్తున్న అగ్ని స్తంభం, నాగముచిలింద, పవిత్ర అవశేషాల ఆరాధన, మధ్యలో అశోక ధర్మ చక్రం స్తంభంతో శక్తివంతమైన విల్లును మోస్తున్న సిద్ధార్థుడు వంటి శిల్పాలు ఉంటాయి.

### బుద్ధ చరిత్రవనం

సిద్ధార్థ గౌతమ జీవితంలో ఐదు ప్రధాన సంఘటనలు ఉన్నాయి. అవి జననం, నాలుగు సమావేశాలు, మహా నిష్క్రమణ, జ్ఞానోదయం. బుద్ధుని మొదటి ఉపన్యాసం, మహాపరినిర్వాణం వంటి అంశాలపై చిత్రాలను కాంస్యంతో చేశారు. పల్నాడు సున్నపు రాయిలో చెక్కబడిన బుద్ధపాద స్లాబ్ అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు ఉద్యానవన ప్రవేశ ద్వారం వద్ద ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయి.

### జాతక వనం (బోధిసత్వ పార్క్)

బోధిసత్వుడు బుద్ధుడిగా మారటానికి ముందు పది పరిపూర్ణతలను ఆచరిస్తూ జీవితాన్ని గడుపుతాడు. వాటినే దశపారమిత అంటారు. అవి దాన (ఉదారత), శీల (ధర్మం), శాంతి (సహనం), వీర్య (ధైర్యం), ధ్యాన (ఏకాగ్రత), ప్రజ్ఞ (జ్ఞానం), త్యాగ (త్యజించడం), సత్య (సత్యం), కరుణ (ప్రేమపూర్వక దయ), సమత (సమానత్వం). 547 జాతక కథలలో 40 జాతక కథలు అమరావతి, ఫణిగిరి, నాగార్జునకొండ, గోలి, జగ్గయ్యపేట, చందవరం బౌద్ధ క్షేత్రాలలోని అసలు శిల్పకళా ఫలకాల ఆధారంగా పల్నాడు లైమ్ స్టోన్‌లో చిత్రీకరించారు.

### ధ్యానవనం (మెడిటేషన్ పార్క్)

27 అడుగుల అవుకాన బుద్ధను ధ్యానవనంలో ఏర్పా టు చేశారు. దీనిని శ్రీలంక ప్రభుత్వం అందజేసింది.

### స్తూపవనం (మినియేచర్ స్తూప పార్క్)

కర్లా, అజంతా (మహారాష్ట్ర), సాంచి (మధ్యప్రదేశ్), సారనాథ్ (ఉత్తరప్రదేశ్), మంకియాలా, (పంజాబ్- పాకిస్తాన్), అనురాధపుర, శ్రీలంక, కహు-జో-దారో, మిర్పూర్ ఖాస్, పాకిస్తాన్, బౌధానాత్, మహాస్త్రాస్తాన్, నేపాల్‌లోని స్థూపాల ప్రతిరూపాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. థాయ్‌లాండ్, పార్డో కాలింగ్ చోర్టెన్ టిబెట్, శ్వేసాండావ్-మయన్మార్, గ్యాంగ్జు, దక్షిణ కొరియా, భారతదేశం, ఆగ్నేయాసియాలోని బౌద్ధ స్థూప నిర్మాణాల రూపాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

### మహాస్తూపం

బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రధాన ఆకర్షణ మహాస్తూపం. అమరావతిలోని అసలు స్థూపం కొలతలు, వాస్తుశిల్పం ప్రకారం దీనిని నిర్మించారు. దాని పైభాగంలో వేదిక (డ్రమ్), గోపురం (అండ), హార్మిక ఉన్నాయి. 42 మీటర్ల వెడల్పు, 21 మీటర్ల ఎత్తుతో దాని డ్రమ్, గోపురం భాగాలపై బౌద్ధ ఇతివృత్తాల శిల్ప ఫలకాలతో ఏర్పాటు చేశారు. మహాస్తూపం చుట్టూ గోడపై బుద్ధుని జీవితంలోని ముఖ్యమైన రాజులు, ధర్మ పోషకుల దశ్యాలు ఉంటాయి. గోపుర భాగంపై వజ్రాసన, బోధి వక్షం, అగ్ని స్తంభం, జాతక కథలు, బుద్ధుని జీవితంలోని సంఘటనలు వంటి బౌద్ధ చిహ్నాలను వర్ణించే శిల్పాలు చెక్కారు. స్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం ఉంటుంది.

### మహాస్థూపం లోపల వర్చువల్ ఆకాశ దృశ్యం

మహాస్థూపం లోపల 25 అడుగుల ఎత్తులో పంచధ్యాన బుద్ధులను ఏర్పాటు చేశారు. మహాస్తూపం పైకప్పు ఆకాశాన్ని తలిపిస్తూ తామరపువ్వు రేకుల ఆకారంలో ఉంటుంది. పైకప్పు లోపలి భాగం చిల్లులు గల ట్రాపెజోయిడల్ ప్యానెల్‌లతో ఆకాశాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి ఒక్కటి మరొకదానికి భిన్నంగా 2.5 మీటర్ల పరిమాణంలో, కాంతి థర్మోడైనమిక్స్, ప్రత్యేక ప్రకాశాన్ని జోడించేలా ఉంటాయి. ఇందులో లోటస్ రేకులు (960), స్కై ప్యానెల్‌లు (528) ఉంటాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ఉపయోగించిన జర్మన్ టెక్నాలజీతో వీటిని ఏర్పాటు చేశారు.

### బుద్ధవనానికి అవార్డులు

విశిష్ట ఆకర్షణలతో కూడిన ఈ ప్రాజెక్టుకు అనేక అవార్డులు లభించాయి. పర్యాటకులకు ఉత్తమ పౌర సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను అందించినందుకు తెలంగాణ పర్యాటక శాఖ 2022లో అవార్డును అందజేసింది. దీనిపై నిర్మించిన డాక్యుమెంటరీకి ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం అవార్డును అందుకుంది. 2022లో కోల్‌కతాలో బౌద్ధ టూర్ ఆపరేటర్ల సంఘం 'భూటాన్ బంగ్లాదేశ్ ఇండియా అండ్ నేపాల్ టూరిజం మిత్ర అవార్డు'ను కూడా అందుకుంది.

### బౌద్ధ వారసత్వ ప్రాంగణం బుద్ధవనం

తెలంగాణలో బౌద్ధమతం ఆగమనం బుద్ధుని జీవితకాలం నాటిది. సుత్తనిపాత పారాయణవగ్గ ప్రకారం 'కవిట్టవనమిష్టి గోదావరి రివేరిన్'అనే బ్రాహ్మణ ఋషి బుద్ధుని బోధనలను వినడానికి తన 16 మంది శిష్యులను మగధకు పంపాడు. బుద్ధుని అనుచరులుగా మారిన పింగియా.. బుద్ధుని బోధనలను తీసుకువచ్చారు. అప్పటినుంచి నుంచి తెలంగాణలో థేరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధ శాఖలు విస్తరించాయి. అస్సిఫూట్, కోటిలింగాల, కంబాలపల్లి, పాశిగావ్, ధూళికట్ట, ఫణిగిరి, తిరుమలగిరి, వర్ధమానుకోట, గాజులబండ, నేలకొండపల్లి, శ్రీపర్వతం ప్రాంతాల్లో (నాగార్జునసాగర్ ప్రాంతం) బౌద్ధమతం మూడు దశల్లో పరిఢవిల్లింది.

## భారీ లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..



ముంబయి : సోమవారం ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగింపు సమయానికి భారీ లాభాల బాటనే ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 2,950.34 పాయింట్లు లేదా 3.71 శాతం లాభంతో 82,404.81 వద్ద, నిఫ్టీ 912.80 పాయింట్లు లేదా 3.80 శాతం లాభంతో 24,920.80 వద్ద నిలిచాయి. చాల రోజుల తరువాత భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ నేడు ముగిసింది. ఈ విషయం తెలిసిన విదేశీ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఈ రోజు 3,500 కోట్ల రూపాయల నికర కొనుగోళ్లను నమోదు చేశారు. ఇదే సమయంలో డొమెస్టిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు కూడా 2,800 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొన్నారు. ఇది మార్కెట్‌లో బలమైన డిమాండ్‌ను సూచిస్తుంది. కొన్ని కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలతో మార్కెట్‌ను ఆకర్షించాయి. బజాజ్ ఎలక్ట్రికల్స్ తమ నికర లాభం 59.05 కోట్ల రూపాయలకు చేరడంతో 14.78 శాతం పెరిగింది. ఈ క్రమంలో రాబోయే త్రైమాసిక ఫలితాలు, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల నిర్ణయాలు మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.

## యుద్ధం అంటే రొమాంటిక్.. బాలీవుడ్ సినిమా కాదు

### భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె



పుణె : భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కాల్పుల విరమణ ఒప్పందంపై కొందరు ప్రశ్నలు లేవనెత్తుతున్న సమయంలో భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధమంటే రొమాంటిక్ వ్యవహారం కాదని, అదొక బాలీవుడ్ సినిమా అసలే కాదని స్పష్టం చేశారు. ఘర్షణ వాతావరణానికి స్వస్తి పలికి, దౌత్య మార్గాల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుణెలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ నరవణె ప్రసంగిస్తూ. "యుద్ధం లేదా హింస అనేవి మనం ఆశ్రయించాల్సిన చివరి మార్గాలు కావాలి. అవివేకులైన కొందరు మనపై యుద్ధాన్ని రుద్దినా, మనం దానిని ప్రోత్సహించకూడదు" అని స్పష్టం చేశారు. పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారని చెబుతూ "ఒక సైనికుడిగా, ఆదేశాలు వస్తే నేను యుద్ధానికి వెళతాను. కానీ, అది నా మొదటి ఎంపిక కాదు" అని జనరల్ నరవణె తేల్చి చెప్పారు. దౌత్యానికి, చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవడానికే తాను ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, సాయుధ పోరాటం వరకు పరిస్థితి రాకుండా చూడాలని కోరుకుంటానని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలు, ముఖ్యంగా పిల్లలు పడే ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. "షెల్లింగ్ జరిగినప్పుడు, రాత్రిపూట సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయాల్సి రావడం వంటి భయానక దృశ్యాలు చిన్నారుల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధ తరతరాలు వెంటాడుతుంది. పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ) బారిన పడిన వారు, భయంకరమైన ఘటనలు చూసిన ఇరవై ఏళ్ల తర్వాత కూడా చెమటలతో నిద్రలేచి, మానసిక చికిత్స అవసరమయ్యే పరిస్థితులు ఉంటాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశాల మధ్యే కాకుండా, కుటుంబాలు, రాష్ట్రాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య కూడా విభేదాలను హింస ద్వారా కాకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "జాతీయ భద్రతలో మనమందరం సమాన భాగస్వాములం. హింస దేనికీ సమాధానం కాదు" అని నరవణె ఉద్ఘాటించారు.

## సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్



తెలంగాణ : సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సఅష్టించినట్లు చెప్పారు. మరిన్ని ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. రాష్ట్రంలో అభివఅద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## త్రివిధ దళాధిపతులతో ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి మోడి నివాసంలో త్రివిధ దళాధిపతులతో నేడు ప్రధాని ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. భారత్, పాక్‌ల పరస్పర చర్చల తర్వాత కాల్పుల విరమణ ప్రకటించడం, ఆ తర్వాత దానిని ఇస్లామాబాద్ ఉల్లంఘించడం వంటి విషయాలపై సోమవారం భారత్-పాక్ మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కీలక సమావేశంలో త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాప్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు సైనిక దళాధిపతులు పాల్గొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించిన కొన్ని గంటల్లోనే పాక్ మళ్లీ దాడులకు తెగబడటం, అనంతర పరిణామాలపై త్రివిధ దళాలతో ప్రధాని మోడి ఎప్పటికప్పుడు సమీక్షలు చేపడుతున్నారు. తాజా పరిస్థితులపై మరికొద్దిసేపట్లో విదేశాంగ శాఖ, రక్షణశాఖ ప్రెస్ బ్రీఫింగ్ చేయనుంది.

# మీడియా చేసిన యుద్ధం




కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు దాడిచేసి 26 మందిని పొట్టన పెట్టుకున్న సంఘటనలో పొరుగు దేశానికి మరోసారి గట్టిగా బుద్ధి చెప్పడానికి భారత ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవడానికి రెండు వారాలు పట్టింది. నిజమే, ఇటువంటి ప్రధానమైన నిర్ణయం, దాదాపుగా పొరుగుదేశం మీద యుద్ధం చేస్తున్నంత పెద్ద నిర్ణయం తీసుకోవడానికి కేంద్రానికి అంత సమయం పట్టడంలో ఆశ్చర్యం లేదు. అసలు ఆ విషాదం నుంచి దేశం తేరుకోవడానికే వారం రోజులు పట్టి ఉంటుంది. ఇప్పటికీ ఇంకా ఈ దేశప్రజల కళ్ళల్లో ఆ దృశ్యాలు మెదులుతూనే ఉంటాయి. అయితే కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడానికి సమయం తీసుకున్నదే తప్ప మన భారతదేశ మీడియాకు మాత్రం అంత ఓపిక లేదు. సంఘటన జరిగిన మరునాటి నుండే మన మీడియా.. ముఖ్యంగా 24 గంటల వార్తా ప్రసారాలు చేసే న్యూస్ ఛానళ్లు పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించేసాయి. 'ఇంకా ఆలస్యం దేనికి? యుద్ధం మొదలు పెట్టండి' అని చెప్పి కేంద్ర ప్రభుత్వాన్ని గదమాయిస్తున్న, సలహాలిస్తున్న ప్రసారాలు అనేకం మనకి ఈ పక్షం రోజుల్లో కనిపించాయి, వినిపించాయి.' ఎటువంటి నియంత్రణలకు అవకాశం లేని మాధ్యమాల పేరిట చలామణి అవుతున్న సామాజిక వేదికల బాధ్యతరాహిత్యం గురించి కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వచ్చి పెద్దయెత్తున చర్చ జరుగుతున్న సమయంలో, ఎంతో కొంత నియంత్రణకు లోబడి పని చేస్తాయి అనుకుంటున్న, ప్రధాన స్రవంతి మీడియాగా చెప్పుకుంటున్న 24 గంటల వార్తా ప్రసారాలు సాగించే ఛానళ్ళ నిర్వాకం ఈ పక్షం రోజుల్లో చూసినవాళ్ళు, ఆ హింసను అనుభవించిన వాళ్ళు వీటిని నియంత్రించడం ఎలా అనే ఆలోచనలో పడ్డారు.వార్తాపత్రికలు తమ సర్కులేషన్లను, వార్తాప్రసార మాధ్యమాలు తమ టీఆర్పీలను (వీక్షకుల సంఖ్య) పెంచుకోవడానికి సంచలనాలకోసం పాకులాడటం కొత్త విషయం ఏమీ కాకపోయినా ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాటి ఈ వ్యవహార శైలి తీవ్ర విమర్శలకు గురవుతున్నది. కొంతలో కొంత ప్రింట్ మీడియా సంయమనం పాటిస్తున్నప్పటికీ, 24 గంటల న్యూస్ ఛానళ్ళు మాత్రం రెచ్చిపోయి తమకు తోచిన విధంగా అసత్యాలు, అర్థసత్యాలు, అభూతకల్పనలను దేశ ప్రజల చెవులు చిల్లులు పడేట్టు అరిచి చెప్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' జరుగుతున్న క్రమంలో ఒక మీడియా హౌస్ సంపాదకవర్గ సమావేశంలో అధికారికంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బ్రీఫింగుకు సంబంధించిన వార్తలు మాత్రమే ప్రచురించాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చినప్పుడు.. అలా అయితే పేజీలు నింపడం ఎలా? అన్న సందేహాలు వ్యక్తం అయ్యాయట. 24 గంటలలో ఒకసారి మాత్రమే ఉదయంపూట పాఠకుల చేతికి అందే దినపత్రికల పరిస్థితే ఇలా ఉంటే ప్రసార మాధ్యమాలు 24 గంటలు ఏం చూపించాలి, ఏం మాట్లాడాలి? అందుకే ఒకరు ఇస్లామాబాద్ పని అయిపోయిందంటే, మరొకరు లాహోర్ మట్టి కొట్టుకుపోయిందని, ఇంకొకరు కరాచీ కనిపించకుండాపోయిందని మసాలాలు దట్టించి వార్తలు ప్రసారం చేయడం మనం 'ఆపరేషన్ సిందూర్' మొదలయినప్పటినుండి చూస్తున్నాం. పాకిస్తాన్ పని అయిపోయిందని ఒక ప్రముఖ పాత్రికేయుడు వ్యాఖ్యానిస్తే, ఆ దేశ ప్రధానమంత్రి ఇల్లు వదిలి పారిపోయాడని మరొక వార్త ఛానల్ చెబుతుంది. లేదు, ఆ దేశంలోని ప్రముఖులంతా బహరిన్‌కు తట్టాబుట్టా సర్దుకుని వెళ్ళిపోయారని ఇంకొక ఛానల్ చెప్తుంది. అసలు జరుగుతున్నది ఏమిటి? ఈ దేశ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత.. అందులోనూ వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తన మీద ఉందన్న విషయం మీడియా మరిచిపోయింది. దానికి కారణం.. అసలు ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోవడం, తెలుసుకునే ప్రయత్నం చెయ్యకపోవడం. సీనియర్ పాత్రికేయురాలు కల్పనాశర్మ ఒకచోట రాసినట్టు భారతదేశాన్ని తీవ్రమైన టెర్రరిజం అనే మబ్బులు కమ్మేసి ఏం జరుగుతుందో కనిపించని, ఏ శబ్దాలు వినిపించని వేళ మన మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాల్ని వండి వార్చేస్తున్నది. నిజానికి ఏం జరుగుతున్నది? పహల్గాం మారణకాండ అనంతరం భారత ప్రభుత్వం పాకిస్తాన్‌లోని తొమ్మిది టెర్రరిస్ట్ కేంద్రాలను టార్గెట్‌గా చేసుకొని చేసిన దాడి, ఆ దాడిలో 100 మంది వరకు మృతి చెందిన విషయం, దానికి జవాబుగా భారత భూభాగంపైకి పాకిస్తాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లను మట్టికరిపించే పనిలో భారత సైనిక బలగాలు పనిచేస్తున్నాయి. దీనికి సంబంధించి గత మూడు రోజులుగా సైన్యానికి సంబంధించిన ఉన్నతాధికారులు అధికారికంగా పత్రికా సమావేశాలు నిర్వహించి వివరాలు వెల్లడిస్తూనే ఉన్నారు. అది మాత్రమే రాసి ఊరుకుంటే 24 గంటలు న్యూస్ ఛానల్ నడపడం ఎలా? వీక్షకుణ్ని మరో ఛానల్ వైపు వెళ్లకుండా ఆపడం ఎలా? ఇదీ ఇవాళ మెజారిటీ న్యూస్ ఛానల్ పరిస్థితి దేశంలో. ప్రభుత్వం వెల్లడించిన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలిపి ఊరుకుంటే అది మీడియా బాధ్యతా ఎలా అవుతుందని ఆ మాధ్యమాల వాళ్లు ప్రశ్నించవచ్చు. నిజమే.. మామూలు పరిస్థితుల్లో అయితే ప్రభుత్వం అందించే సమాచారంలో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకుని అసలు వాస్తవాలను ప్రజలకు తెలియజెయ్యాల్సిన బాధ్యత మీడియాది. ఆ పని మీడియా చేస్తున్నట్టు కనిపించదు. ఇటువంటి యుద్ధ వాతావరణం ఉన్న సమయలో ఆ అవకాశాలు కూడా తక్కువే ఉంటాయి. అందుకని మనం చేస్తున్నదేమిటి.. చర్చల పేరిట గాలి పోగు చేసి వీక్షకుల మీదకు వదులుతున్నాం. ఇందులో కొన్ని మినహాయింపులు లేవని చెప్పలేం, అయితే అవి చాలా స్వల్పం. కేంద్రప్రభుత్వం కూడా ఈ మెజారిటీ న్యూస్ ఛానళ్ళు రోజుల తరబడి ప్రసారం చేసే అసత్యాలు, అర్ధసత్యాలు, అభూతకల్పనల జోలికి వెళ్లడం లేదు. నిపుణుల పేరుతో గంటల తరబడి తెలిసీ తెలియని విషయాలు చర్చించేవాళ్ళని కూడా ఎవరూ తప్పు పట్టడం కానీ, సరి చెయ్యడం కానీ జరగడం లేదు. చరిత్ర తీవ్ర వక్రీకరణలకు గురికావడానికి రేపు ఈ మాధ్యమాలవారు బాధ్యులు కాక తప్పదు. విశ్వసనీయత చెడకుండా వీలైనంతవరకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని వాస్తవాలను మాత్రమే ప్రజలకు అందించాలనే ఆలోచన కలిగిన, ఆ మార్గాన్నే నడుస్తున్న కొన్ని ఛానళ్లు లేదా కొన్ని డిజిటల్ వేదికలు సహజంగానే వెనుకబడిపోతున్నాయి. ఇలా యుద్ధోన్మాదంతో ఊగిపోతున్న ఛానళ్ళను వదిలేసి విచిత్రంగా 'ది వైర్' వంటి డిజిటల్ ఛానల్‌ను ఆ ఛానల్ యాజమాన్యానికి సమాచారం లేకుండా 2000 సంవత్సరం ఐటీ చట్టం కింద బ్లాక్ చేసినట్టు సర్వీస్ ప్రొవైడర్ ద్వారా తెలియజేయడం, ఏ కారణం చేతనో ఒక రోజు తర్వాత మళ్లీ దాన్ని పునరుద్ధరించడం చూసాం. సమాచారం తెలుసుకునేందుకు భారత రాజ్యాంగం ఈ దేశప్రజలకు ఇచ్చిన హక్కును కాపాడే బాధ్యతను మాత్రమే నిర్వర్తించాల్సిన మీడియా ఆ పని మాత్రం మరిచిపోయి ఆశ్వరథ శరభ అంటూ శివాలెత్తిపోతున్న వేళ వాటిమీద ఏ చర్యా లేకుండా వదిలేసి, సత్యాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ప్రసారం చేసే, ప్రచురించే ఇటువంటి మాధ్యమాలకు ఆటంకాలు సృష్టించడం పత్రికాస్వేచ్చకు భంగం కలిగించడమే అనడంలో సందేహం లేదు. భారతదేశం మీద పాకిస్తాన్ చేస్తున్నటువంటి దుశ్చర్యలు ఇవాళ కొత్తగా జరుగుతున్నవేమీ కాదు. దానికి దీటుగా సమాధానం చెప్పేందుకు భారతదేశం వైపు నుంచి కూడా చర్యలు జరగడం ఇవాళ కొత్త ఏమీ కాదు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో కనీసం మూడు సందర్భాలలో 'ఆపరేషన్ సిందూర్' వంటి భారీ జవాబులు భారతదేశం ఇచ్చింది. మన మీడియా, పొరుగుదేశ ప్రభుత్వం ఇప్పుడు జరుగుతున్న దానిని యుద్ధం అంటున్నాయి కానీ భారత ప్రభుత్వం దీన్ని యుద్ధం అని అనకపోవడం గమనార్హం.మొత్తానికి తాత్కాలికంగానయినా ఇది రాయడం పూర్తవుతున్న సమయాన ఇరు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకారం ప్రకటించాయి. అయితే భవిష్యత్తులో భారతదేశంలో జరిగే ఏ ఉగ్రదాడినయినా యుద్ధంగానే పరిగణిస్తామని భారత్ ప్రకటించింది. మన మీడియా ఇప్పుడేం చేస్తుంది? ఇవాల్టి నుండి ఒక కొత్త యుద్ధాన్ని వెతుక్కోవాలేమో.

# సమాజాభివృద్ధిలో సాంకేతికత కీలకం



పోఖ్రాన్‌లో 1998లో జయప్రదంగా జరిపిన అణు పరీక్షలు నిర్వహించిన మే 11వ తేదీనే ప్రతి సంవత్సరం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సూచనలతో మన దేశంలో 'జాతీయ సాంకేతికత దినోత్సవం (నేషనల్ టెక్నాలజీ డే) గా జరుపుకుంటారు. ఆదిమానవుడి నుంచి నేటి ఆధునిక మానవుడుగా అభివృద్ధి చెందటానికి ప్రధాన కారణం 'చదువు'. పూర్వకాలంలో ముఖ్యంగా మన దేశంలో చదువు కొందరికి మాత్రమే అందుబాటులో ఉండే పరిస్థితి. ముఖ్యంగా జ్యోతి రావు పూలే, సావిత్రి బాయ్ పూలే, అంబేద్కర్ వంటి ఎందరో సంఘ సంస్కర్తల కృషి ఫలితంగా ముఖ్యంగా భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు ద్వారా అందరికీ కనీసం పదవ తరగతి వరకూ చదువుకునే అవకాశం లభించింది. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా అందరికీ సమానమైన, నాణ్యమైన ఉన్నత, సాంకేతిక విద్య అందరికీ అందుబాటులో లేదు అనే విషయాన్ని మరువకూడదు. ఇక ఏమిటి, ఎందుకు, ఎలా? అనే ప్రశ్నలు ఉద్భవించడం ద్వారానే నేడు ఈ సమాజం ఇంత అందంగా, ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా మారింది అని గ్రహించాలి. ముఖ్యంగా దేశంలో చదువు ద్వారానే సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను దూరం చేయడం జరుగుతున్నది. కుల మత వర్గ లింగ వివక్షలు అణచివేతకు చదువు సాధనంగా మారింది. అయినప్పటికీ నేటికీ వివిధ రకాల రాజకీయ, ఆర్థిక, సామాజిక, వివక్షలు కొనసాగుతూనే ఉన్నాయి అనే విషయాన్ని మరువకూడదు. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక విప్లవం సంభవించిన తరువాత అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రజల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు చోటు చేసుకున్నాయి. ఉన్నత చదువులు, పరిశోధనలు ఊపందుకున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, మెడిసిన్ పరిశోధనలు, అంతరిక్ష పరిశోధన వంటివి రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. ముఖ్యంగా దేశంలో స్వాతంత్ర్యం అనంతరం వ్యవసాయ, పారిశ్రామిక, అంతరిక్ష, అణుశక్తి, మెడిసిన్ వంటి రంగాల్లో అభివృద్ధి, పరిశోధనలు పుంజుకున్నాయి. హరిత విప్లవంద్వారా ఆహార ఉత్పత్తులు పెరిగాయి. నూతన సాంకేతికతను ఉపయోగించి అనేక నిర్మాణాలు, డ్యాంలు, భవనాలు, ఆనకట్టలు, రైల్వేలైన్లు ముఖ్యంగా ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్ లో పర్వతాలు మధ్య నిర్మించిన అతి ఎత్తైనా రైల్వే వంతెన, అలాగే రామేశ్వరంలో సముద్రంలో నిర్మించిన వంతెన భారతీయ సాంకేతికతలో సాధించిన అద్భుతమైన విజయాలుగా చెప్పుకోవచ్చు. అలాగే ఇటీవల కాలంలో ప్రపంచాన్ని వణికించిన 'కరోనా వైరస్' నియంత్రణకు మన దేశంలో అతి తక్కువ సమయంలో కనుగొన్న 'వ్యాక్సిన్' భారతదేశం మెడిసిన్ రంగంలో సాధించిన మరో అద్భుతమైన విజయంగా చెప్పవచ్చు. ఇక అంతరిక్షంలో 'ఇస్రో' చరిత్ర సృష్టిస్తుంది. చంద్రయాన్, ఆదిత్య వంటి ప్రాజెక్టులు విజయ దుందుభి మోగిస్తున్నాయి. అంతేకాకుండా ఇతర దేశాల రాకెట్లు కూడా మన దేశంలో నుంచే ప్రయోగిస్తూ విదేశీ మారకద్రవ్యం ఆర్జించడం జరుగుతున్నది. అయితే ఇటీవల పాలకులు విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, చరిత్రను తిరగరాసే ప్రయత్నాలు, విద్యా రంగంలో కాషాయీకరణ, మతక్రతువులు, కుంభమేళా వంటి విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆందోళన కలిగిస్తోంది. అలాగే ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ నియామకాల్లో మత సంబంధమైన వ్యక్తులను నియమించడం జరుగుతున్నది. నిష్ణాతులైన, నిపుణులైన అధ్యాపకులను 21వ శతాబ్దానికి అవసరమైన విద్య, వైజ్ఞానిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సిలబస్ ప్రవేశపెట్టాలి. పరిశోధనలకు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. మౌలిక సదుపాయాలు, గ్రంథాలయాలు, లేబరేటరీ వంటి సదుపాయాలు అన్ని పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు చేయాలి. ఖాళీగాఉన్న పోస్టులను, అధ్యాపకులను వెంటనే నియమించాలి. మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు పెంచే సిలబస్, విధానాలు విడనాడాలి. త్వరలో దేశం నుంచి 'నోబెల్ బహుమతి' అందుకునే విధంగా పరిశోధకులు మారాలి. పరిశోధనలు, పేటెంట్ రైట్స్ సాధించాలి. అనేక శతాబ్దాలుగా, భారతదేశంలో ఉన్న అనేక వివక్షలు కనుమరుగు అవడానికి కారణం చదువు, సాంకేతిక పరిజ్ఞానం. ఈ రోజు మన దేశం నుంచే లక్షల మంది 'సాఫ్ట్ వేర్' ఇంజినర్లు విదేశాల్లో అనేక అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు. సుందర్ పిచాయ్ వంటి ఎందరో అంతర్జాతీయ సంస్థలకు సిఇఒలుగా పని చేయడం జరుగుతున్నది. సునీత విలియమ్స్ వ్యోమగామి దేశమూలాలకు చెందిన వారే అని గ్రహించాలి. ఇటీవల కాలంలో దేశంలో తిరోగమన విధానాలు అమలులోకి వస్తున్నాయి. ఈ విషయాలు ఆందోళన కలిగిస్తోంది. రాజకీయ ప్రమేయం పెరుగుతుంది. యుజిసి, అనేక కేంద్ర విశ్వవిద్యాలయాల్లో రాజకీయ, మతపరమైన అంశాలు పెరుగుతున్నాయి. ఇటువంటి ధోరణులు శ్రేయోస్కరం కాదు. ఆరు అంగుళాల సెల్ ఫోన్‌తో మొత్తం ప్రపంచం అంతా మన చేతుల్లోనే ఉంటుంది. టివి, కంప్యూటర్, లాప్‌టాప్, టాబ్లెట్ వంటి అనేక పనిముట్లు, గాడ్జెట్లు అందుబాటులోకి రావడం మానవ జీవితంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. సౌకర్యవంతమైన జీవితం లభిస్తుంది అంటే కారణం సాంకేతికత. మన దేశంలో దాదాపు జనాభాకు అనుగుణంగా సెల్ ఫోన్లు ఉన్నాయి అంటే అతిశయోక్తికాదు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్నింటా డిజిటల్ రూపం సంతరించుకొంది. ఫోన్ పే, గూగుల్ పే వంటి ఆర్థిక లావాదేవీలు పుంజుకున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలు, అమేజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి సంస్థలు ద్వారా ఇంటి వద్ద నుండే అనేక సౌకర్యాలు లభిస్తున్నాయి అంటే కారణం సాంకేతికత అనే విషయాన్ని మరువకూడదు. వైద్య రంగంలో రోబోటిక్స్ పాత్ర పెరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యంగా భారత్‌లో అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందరికీ అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దేశంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో అందరూ, సమానంగా అభివృద్ధి సాధించాలంటే అందరికీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## అదృశ్యం చేస్తున్న మహా కృష్ణబిలం గెలాక్సీ కేంద్రస్థానంలో కాకుండా దూరంగా ఉన్న సంచార బ్లాక్‌హోల్ అంతరిక్ష వింత గుట్టు విప్పిన హబుల్ టెలిస్కోప్

# నక్షత్రాన్నే నమిలేస్తూ.. మింగేస్తూ

### కేంద్రం నుంచి ఎంతో దూరంలో బ్లాక్‌హోల్



నక్షత్రం అంటేనే అంతులేని ఉష్ణంతో, దేదీప్యమానంగా వెలిగిపోతూ వందల కోట్ల కిలోమీటర్ల దాకా కాంతిని వెదజల్లే శక్తియంత్రం. అలాంటి నక్షత్రాన్ని అరటిపండులా అమాంతం మింగేస్తున్న రాకాసి కృష్ణబిలం జాడను అత్యంత అధునాతన హబుల్ టెలిస్కోప్ కనిపెట్టింది. నక్షత్రం మొత్తాన్ని తనలో కలిపేసుకుంటున్న ఈ బ్లాక్‌హోల్ మిగతా కృష్ణబిలాల్లా నక్షత్రమండలం(గెలాక్సీ) కేంద్రస్థానంలో కాకుండా కోట్ల కోట్ల కిలోమీటర్ల దూరంగా ఉండటం మరో విశేషం. గెలాక్సీ మధ్యలో కాకుండా చాలా దూరంగా సైతం భారీ కృష్ణబిలాలు మనగల్గుతాయని, వాటి అపారమైన గురుత్వాకర్షణ బలాలు సమీప స్టార్‌లనూ సమాధి చేస్తాయని తొలిసారిగా వెల్లడైంది. సాధారణంగా నక్షత్రాలను కృష్ణబిలం తనలో కలిపేసుకునే (టైడల్ డిస్ట్రప్షన్ ఈవెంట్-టీడీఈ) దృగ్విషయం గెలాక్సీ మధ్యలో చోటుచేసుకుంటుంది. కానీ ఇలా టీడీఈ అనేది గెలాక్సీ మధ్యలో కాకుండా వేరే చోట సంభవించడాన్ని తొలిసారిగా గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దీనికి 'ఏటీ2024టీవీడీ'అని పేరు పెట్టారు. మింగేస్తున్న ఈ కృష్ణబిలం ద్రవ్యరాశి ఆ అంతర్ధానమవుతోన్న నక్షత్రం ద్రవ్యరాశికంటే ఏకంగా 10 కోట్ల రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. నక్షత్రమండలం కేంద్రస్థానం చుట్టూ తిరిగే ఏదైనా నక్షత్రం అనుకోకుండా కృష్ణబిలం చెంతకు వచ్చినప్పుడు మాత్రమే అక్కడ బ్లాక్‌హోల్ ఉందనే విషయం తెలుస్తుంది. బ్లాక్ తాను మింగేసే ఖగోళ వస్తువును ఉన్నది ఉన్నట్లుగాకాకుండా ఆకారాన్ని నూడుల్స్‌లాగా సాగదీసి సాగదీసి లోపలికి లాగేసు కుంటుంది. ఈ ప్రక్రియనే స్పాగెటిఫికేషన్ అంటారు. తాజాగా నక్షత్రాన్ని మింగేస్తున్న క్రమంలోనే ఈ కృష్ణబిలం ఉనికి వెలుగులోకి వచ్చింది. అమెరికా శాండిగోలోని పాలోమార్ అబ్జర్వేటరీలోని ఆప్టికల్ కెమెరా తొలిసారిగా దీనిని గుర్తించింది. ఈ బ్లాక్‌హోల్ మన భూమికి ఏకంగా 60 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. హబుల్ టెలిస్కోప్ దీనిపై మరింత పరిశోధన చేసింది. సాధారణంగా కృష్ణబిలంలోకి నక్షత్రం లాగబడే క్రమంలో ఆ నక్షత్రం ఊహించనంత స్థాయిలో అతినీలలోహిత కాంతిని బయటకు వెదజల్లుతుంది. తర్వాత బ్లాక్‌హోల్ లోపలికి వెళ్లిపోయి ఆ స్టార్ అంతర్ధానమవుతుంది.

ఈ బ్లాక్‌హోల్ తనకు ఆశ్రయం ఇచ్చిన నక్షత్రమండలానికి సంబంధించిన కేంద్రస్థానంలో ఉండకుండా ఏకంగా 2,600 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీంతో కేంద్రస్థానంలోని బ్లాక్‌హోల్స్ కంటే ఇది భిన్నంగా ప్రవర్తిస్తుందేమో అని తెల్సుకునేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా రంగంలోకి దిగింది. ఈ కృష్ణబిలంపై ఓ కన్నేశామని చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ, నేషనల్ రేడియో ఆస్ట్రోనమీ అబ్జర్వేటరీలోని వెరీ లార్జ్ అరే రేడియో టెలిస్కోప్ పరిశోధకుల బృందాలు తెలిపాయి. రెండు గెలాక్సీల విలీనం తర్వాత ఇలాంటి కృష్ణబిలాలు ఇలా సుదూరంగా మిగిలిపోయి ఉంటాయని భావిస్తున్నారు. లేదంటే రెండు అయస్కాంతాల తరహాలో రెండు కృష్ణబిలాల వ్యతిరేక బలాల వల్ల ఇది సుదూరంగా నెట్టివేయబడి ఉండొచ్చని ఇంకొందరు అధ్యయనకారులు అంచనావేస్తున్నారు. "కేంద్రస్థానంలో స్థిరంగా ఉండిపోకుండా ఇలా సంచార జీవిలా ఎక్కడో మౌనంగా ఉన్న ఇలాంటి కృష్ణబిలాలు కొత్త తరహా పరిశోధనలకు సాయపడతాయి"అని బెర్క్లీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సంబంధిత పరిశోధనలో ప్రధాన రచయిత, ఖగోళశాస్త్రంలో పోస్ట్ డాక్టోరల్ యుహాన్ యాఓ చెప్పారు. త్వరలో అందుబాటులోకి రానున్న వెరీ సి.రూబిన్ అబ్జర్వేటరీ సాయంతో ఇలాంటి ఖగోళ వింతలను మరింత పరిశోధన జరగనుంది.

## 90 రోజుల పాటు కొత్త సుంకాలు: అమెరికా, చైనా మధ్య డీల్



**(లోకల్ గైడ్):న్యూఢిల్లీ,:** నువ్వా నేనా అంటూ ప్రతీకార సుంకాలను అంతకంతకూ పెంచుకుంటూ పోయిన అమెరికా, చైనా దేశాలు టారిఫ్‌ల విషయంలో ఓ డీల్ కుదుర్చుకున్నాయి. తాజా ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపైన చైనా విధించిన 125 శాతం సుంకాలలో 10 శాతం తగ్గించింది. అదే సమయంలో అమెరికా కూడా చైనా దిగుమతుల మీద విధించిన 145 శాతం సుంకాలలో 30 శాతం తగ్గించించింది. ఇరు దేశాలు (చైనా, అమెరికా) కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. ఈ సుంకాల తగ్గింపు 90 రోజులు మాత్రమే అమలులో ఉంటాయని తెలుస్తోంది. కొత్త సుంకాలు మే 14 నుంచి అమలులోకి రానున్నాయి. ఆ తరువాత తగ్గింపు సుంకాలే కొనసాగుతాయా?, ముందుకు విధించిన సుంకాలు కొనసాగుతాయా?, అనే విషయం తెలియాల్సి ఉంది. అమెరికా ప్రపంచ దేశాల మీద ప్రతీకార సుంకాలను విధించిన సమయంలో.. చైనా కూడా అమెరికాకు ధీటుగా సుంకాలను పెంచింది. దీంతో వాణిజ్య యుద్ధం మొదలైంది. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్ల మీద విపరీతమైన ప్రభావం చూపింది. దిగ్గజ పారిశ్రామిక వేత్తలు కూడా భారీ నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. అయితే తాజాగా.. ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ సుంకాలను తగ్గించుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు.

## ఆ పదవి దక్కలేదన్న అక్కసుతోనే మాట్లాడుతున్నారు..

### ఈటలపై టీపీసీసీ చీఫ్ ఫైర్



**(లోకల్ గైడ్):హైదరాబాద్, :** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఏ కులమో చెప్పాలి..అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కలేదన్న అక్కసుతో ఈటల మాట్లాడుతున్నారు. సీఎంపై మాట్లాడిన తీరు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉంది. బీఆర్ఎస్ హయంలో ఆర్థిక మంత్రిగా ఈటల ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసింది...అని మహేష్ గౌడ్ ఆరోపించారు. హైడ్రా గురించి మాట్లాడే ఈటల దేవాదాయశాఖ భూములను కబ్జా చేశారని కేసు ఉన్న విషయం మర్చిపోయారా?. బీసీ బిడ్డవై కేసీఆర్‌కి అడుగులకు మడుగులు వత్తిన విషయం మరిచావా?. కేసీఆర్ హయంలో చేతకాని, దద్దమ్మ మంత్రులుగా ఉన్న మీరు సీఎం రేవంత్ గురుంచి మాట్లాడే నైతిక అర్హత లేదు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ పడిపోతుందా?. ధనిక రాష్ట్రమైన తెలంగాణ దివాలా తీయడానికి.. కారణమైన కేసీఆర్ అలీబాబా చోరిస్‌లో ఈటల ఒకరు.. అని మహేష్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు ఈటల, బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ నేతలు అడుగడుగునా అడ్డు పడుతున్నారు. బీసీ బిడ్డగా ఈటల, బండి సంజయ్‌ను ఎవరు అంగీకరించని పరిస్థితిలో లేరు. బీసీ బిల్లు విషయంలో బీజేపీ నేతల వైఖరిని బీసీ సమాజం క్షమించే పరిస్థితి లేదు. తప్పులు ఎత్తి చూపండి.. సద్వి విమర్శ చేయండి.. అంతేగాని స్వార్థంతో నోటికొచ్చింది మాట్లాడితే సహించే ప్రసక్తే లేదు..అని టీపీసీసీ చీఫ్ వార్నింగ్ ఇచ్చారు.

## పాకిస్థాన్‌లో మరోసారి భారీ భూకంపం



పాకిస్థాన్-పాకిస్థాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.6 తీవ్రత నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూకంప తీవ్రత స్వల్పంగా ఉన్నప్పటికి పలు ప్రాంతాల్లో భారీగా ప్రకంపనలు వచ్చినట్లు సమాచారం. భూకంప కేంద్రం తజికిస్తాన్‌లోని అష్కాషెమ్‌కు పశ్చిమాన ఆఫ్ఘనిస్తాన్ నుండి 34 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. కాగా, అంతకుముందు.. ఈ నెల 10న భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. 4.0 తీవ్రతతో భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆందోళనకు గురైన పాకిస్థాన్ ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. తాజాగా, మరో భూకంపం రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎన్‌సీఎస్ నివేదిక ప్రకారం.. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదైంది. భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉందని.. 29.67 డిగ్రీల ఉత్తర అక్షాంశం... 66.10 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద నమోదైంది.

## దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడింది..



**(లోకల్ గైడ్):**సంగారెడ్డి జిల్లాలోని జిన్నారంలో మత ఘర్షణలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తను సంగారెడ్డి సెంట్రల్ జైలులో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిన్నారంలో ఏం జరుగుతుందో విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను నాలుగుసార్లు ఎంపీగా అడిగినా సరైన సమాధానం లేదు అని పేర్కొన్నారు. దేశద్రోహులను వెంటనే పంపించాలని కేంద్ర హెూంశాఖ ఆదేశాలు ఇచ్చినా.. ఇప్పటికి అధికార యంత్రాంగం స్పందించడం లేదు అని ఆరోపించారు. దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడింది అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. అయితే, జిన్నారం, పటాన్ చెరుల్లో ఉన్న మదర్సాలలో చదువు చెప్పేందుకు ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వకపోతే హిందూ బంధువులు విడుదలైన తర్వాత పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగుతాం అని హెచ్చరించారు. జిన్నారం మదర్సాపై జిల్లా ఎస్పీ సరైన సమాధానం ఇవ్వకపోతే డీవోపీటీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. మీరు దేశ ద్రోహులకు మద్దత్తు ఇస్తున్నారా అని రఘునందన్ రావు తెలిపారు.

# ఆందోళనలో మానవాభివృద్ధి



ప్రపంచ మానవాభివృద్ధి ప్రగతి గడచిన మూడున్నర దశాబ్దాల్లో అత్యంత తక్కువ నమోదు కావడం పట్ల ఐక్యరాజ్య సమితి చీఫ్ అంటానియో గుబెరస్ వ్యక్తపర్చిన ఆందోళన మానవాళికి హెచ్చరిక. కరోనా మహమ్మారితో పూర్తిగా రెండు సంవత్సరాలు ఆర్థిక వ్యవస్థ స్తంభించిన అనంతరం మానవాభివృద్ధిలో సుస్థిరత నెలకొని మరింత మెరుగుదల దిశగా పయనించాల్సింది పోయి అధమ స్థాయికి దిగజారడం ఆత్మవిమర్శనాపూర్వకంగా ఆలోచించాల్సిన విషయం. 2024 సంవత్సరానికి ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) ప్రపంచ మానవాభివృద్ధి నివేదికను మంగళవారం వెలువరించింది. కృత్రిమ మేధ యుగంలో ప్రజలు, అవకాశాలపై నివేదిక విశ్లేషించింది. మానవాభివృద్ధి ప్రగతి నిర్ణయించుకున్న లక్ష్యాలకనుగుణంగా లేదు. మానవాభివృద్ధి తక్కువ ఉన్న దేశాలు, ఎక్కువ ఉన్న దేశాల మధ్య అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ అసమానతలు వరుసగా నాల్గవ తడవ కూడా మరింతగా విస్తరించడం ఆందోళన కలిగించే విషయం. ఆర్థిక, పర్యావరణ షాక్‌లు మానవాభివృద్ధికి తప్పవని, వాణిజ్య ఉగ్రవాదం పర్యవసానాలూ వెంటాడుతున్నాయని, రుణ సంక్షోభం, నిరుద్యోగిత పెరుగుతాయని క్లిష్టతర భవిష్యత్‌ను ఆవిష్కరించింది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎఐ)కు హ్యూమన్ ఫేస్ ఉండాలన్న హితబోధ జాగరూకతను సూచిస్తుంది. విద్య, ఆరోగ్య రంగాలను ఆధునీకరించాలన్న సిఫారసు తక్షణం కార్యాచరణలో పెట్టాల్సి ఉంది. మానవాభివృద్ధి సూచిలో భారతదేశం ర్యాంక్ గతం కంటే స్వల్పంగా మెరుగుపడినా ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష సవాళ్లను సృష్టిస్తూనే ఉన్నాయని యుఎన్‌డిపి నివేదికతో తెలుస్తుంది. 193 దేశాల్లో మన దేశం స్థానం 130. అదే 2022లో మన ర్యాంక్ 133. సుదీర్ఘ, ఆరోగ్యకర జీవితం, జ్ఞానాన్ని సంపాదించడం, మంచి జీవన ప్రమాణం.. ఈ మూడు ప్రధాన అంశాల్లో మన దేశం బలంగా ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఉపాధి హామీ, విద్యాహక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాలు మానవాభివృద్ధి ప్రగతికి కొంత వరకు పని చేశాయని చెప్పవచ్చు. కాగా సమాజంలో ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని ఫోర్బ్స్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నాయి. వాటికి అభిముఖంగా దిగజారుతున్న పేదరికం వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి తరుగుదల, పారిశ్రామిక మందగమనం, ఉపాధి అవకాశాల తగ్గుదల, పోషకాహార లోపం, పాఠశాలల్లో డ్రాపవుట్స్, బాలకార్మిక సమస్యలు పీడిస్తున్నాయి. ప్రపంచ ఆకలి సూచిలో ఇండియా స్థానం చిట్టచివరిలో ఊగిసలాట అసమానతల తీవ్రతకు ప్రతిరూపం. 2023-24లో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం 41.71 శాతానికి పెరిగిందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వేలో ఉటంకించబడింది. మహిళాశక్తి సద్వినియోగం కావాలంటే మహిళలు ఉద్యోగాల్లో చేరే వాతావరణం నెలకొల్పబడాలి. వారు తమ ఉద్యోగాలను నిలుపుకునే అవకాశాలు సృష్టించబడాలి. ప్రస్తుతం ఆ పరిస్థితులు తక్కువేనన్నది నిపుణుల మాట. రాజకీయ భాగస్వామ్యంలో మహిళల వెనుకబాటు కొనసాగుతోంది. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియకుండా ఉంది. ఈ పరిస్థితుల్లో మార్పు రాకుండా మానవాభివృద్ధి పెరగదన్నది కఠోర నిజం. ఆదాయ, లింగ అసమానతలు భారతదేశ మానవాభివృద్ధి ప్రగతిని 30.7 శాతం తగ్గించాయి. ఎ.ఐ., అభివృద్ధి పరిమితులపై మానవాభివృద్ధి ఆధారపడి ఉంది. ఎ.ఐ. విషయంలో 2019లో సున్నా స్థానంలో ఉన్న ఇండియా పరిశోధకులను నిలుపుకుంది. అభివృద్ధి వైపు అడుగులేస్తోంది. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ప్రజా సేవల డెలివరీలో ఎ.ఐ.ని ఉపయోగించాలి. కానీ ఎ.ఐ. ఇప్పటికే నెలకొని ఉన్న అసమానతలను తీవ్రతరం చేసే ప్రమాదాన్ని నివారించే సరైన విధానం, రక్షణ చర్యలు అత్యవసరం. యుఎన్‌డిపి నివేదిక సారాంశం ఇదే!

# "నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది"






**(లోకల్ గైడ్):**"దునియా దేశాల మహిళామణుల్ని, అందాల బందీఖానాలేసి, ఆడదేహాలతో ఆడే జూదాలు. అందాలంటే ఆడోళ్లకే పేటెంట్స్ అంటగట్టి, గంటకొట్టింది పేట్రియార్కీ పెత్తనమే. యాపార సోపాన సామ్రాజ్యాలకు కార్పొరేట్ కాస్మటిక్స్‌ల కరిగిచ్చి, కొలతల కొలిమిల్లో కోతలు పడే ఫాన్సీ ప్లాస్టిక్ అందసందాల విందులకు మహిళా మాంసం కొట్టులు పెట్టి సరుకు సౌదలు అమ్ముకునే సంతలు" ఈ అందాల పోటీలు అని ఈ పోటీల అంతఃసారాన్ని కవిత్వీకరిస్తారు ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర. అసలు అందమంటే ఏమిటో, వాటికి పోటీలు నిర్వహించడంలోని అసలు ఉద్దేశ్యాలు ఎప్పుడూ చర్చనీయాంశమవుతూనే ఉన్నాయి. వివాదాలు, వ్యతిరేకతలు ఎన్ని ఉన్నా ప్రపంచ సుందరి పోటీలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మన రాష్ట్రంలోనే హైద్రాబాదు నగరం అందుకు వేదికయింది. ఈ పోటీ కార్యక్రమాన్ని ఇక్కడి విద్యార్థినులు తిలకించి స్ఫూర్తి పొందాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది కూడా. సాధికారత, ఆత్మవిశ్వాసం, యువతలో కలుగచేస్తుందని నిర్వాహకులు భావిస్తున్నట్లు ప్రకటించారు. నిజంగా అమ్మాయిలకు ప్రేరణ స్ఫూర్తి కలిగిస్తాయా ఇవి? 'అందమె ఆనందం, ఆనందమె జీవిత మకరందం' అంటాడు ఓ సినీ గీత రచయిత. ఆనందాన్ని కలిగించేదే అందమని కవి హృదయం, ఎవరికి దేనివల్ల ఆనందం కలుగుతుందో ఎలా చెబుతాము! 'అందమనేది చూసేవాళ్ల చూపులో ఉంటుందన్నది ఓ ఆంగ్ల సామెత. ఒకరికి అందంగా కనిపించింది మరొకరికి కనిపించకపోవచ్చు. అందం కొలతల ప్రమాణాల్లో, రంగుల్లో, ధరించే దుస్తుల్లో ఉండదు. "నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది" అంటాడు జాన్ కీట్స్. 'లోకో భిన్న రుచి' అన్నట్లు వివిధ సాంస్కృతిక జీవన పరిణామాల్లో రూపుదిద్దుకునే ఒక మానసిక భావనే అందం. అది భిన్న ప్రాంతాలలో భిన్న రీతులుగా ఉంటుంది. మరిప్పుడు ప్రపంచమంతటికీ అందమయినదీ అని ఎంపిక చేయడంలో సమంజసత్వం ఏమున్నది? అసలు అందమంటే రూపానికి సంబంధించినదే కాదు. భారతీయ తాత్విక ఆలోచనతో చూసినా 'సత్యం శివం సుందరం' అంటాడు. సత్యమే శివం, శివమే సుందరం. భౌతికమైన అందం శాశ్వతమైనది కాదంటారు. అసలు వస్తువుకీ, మనిషికి సంబంధించినది కాదు. మనస్సుకి సంబంధించినది. అందుకే 'ఆత్మ సౌందర్యం' అనే మాట వింటాం. అదే మనిషి మూలతత్వానికి సంబంధించినది. ప్రేమపూరిత మనసు, దయ, కరుణ, సుహృద్భావం వంటి వాటితో మనసు నిండి ఉంటే, ఆ రకమైన సానుకూల భావతరంగాలు మనిషిని కాంతివంతం చేస్తాయి. అప్పుడు అందంగా కనిపిస్తారు. అంతేకాదు, మనం చేసే పనితో, ప్రవర్తనతో, సామర్థ్యాలతో, సాధికారతను, ఆత్మవిశ్వాసాన్ని పొందుతాము తప్ప కేవలం రూపంతోకాదు. వాస్తవంగా పంటను సృష్టించే చేతులది అందం. కాలువలు పారించే కష్టానిది అందం. భవనాల్ని, మందిరాల్ని నిర్మించే శ్రమఫలాలు అందం. అందుకే "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదోరు" అన్నాడు శ్రీశ్రీ. ఎన్నెన్నో చేతులు నిత్యం శ్రమిస్తూ స్వేదాన్ని ధారపోయటం ద్వారానే మనం అందమైన దుస్తుల్ని, అలంకరణల్ని చేసుకోగలుగుతున్నాము. "కారులో షికారు కెళ్లే పాలబుగ్గల పసిడిచాన, నీ బుగ్గ మీద గులాబిరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా! నిన్ను మించిన కన్నెలెందరొ మండుటెండలో మాడిపోగ, వారి బుగ్గల నిగ్గు నీకు వచ్చి చేరెను తెలుసుకో"అని వివరించాడు ఆత్రేయ. మంచి మనసు, బాధ్యతగల ప్రవర్తన, సామాజిక అవగాహన, వాస్తవిక మానవీయ సంబంధాలను కలిగి ఉండటంలోనే నిజమైన అందం ప్రస్ఫుటమవుతుంది. కానీ నేటి అందాన్ని ప్రామాణికరించేది మీడయా, మార్కెటింగ్, వ్యాపారాలు, ప్రభుత్వాలు, ఇతర సంస్థలు. ఈ శక్తులే యువతను ప్రభావితం చేస్తున్నాయి. ప్రదర్శన, సౌందర్య సాధనాలు, దుస్తులు, ప్రవర్తన మొదలైన అంశాల ఆధారంగా తీర్చిదిద్దుతున్నారు. అందాల పోటీలు కేవలం అందాన్ని ప్రదర్శించటానికే కాదు, సమాజంపట్ల బాధ్యత, సమస్యల్లో ఉన్నవారికి చేయూత, సంతోషాలతో కూడిన అందమైన ప్రపంచాన్ని సృష్టించడానికని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ గత సుందరీమణుల ప్రచారమంతా సౌదర్య సాధనాల ప్రచారానికి, సినిమాలకి, సరుకుల మార్కెటింగ్ పెరుగుదలకు ప్రచారానికే వినియోగపడింది. ఇది ప్రపంచవ్యాపిత ఏకరూప వ్యాపార ఏర్పాటుకు చేసే తంతు మాత్రమే. ఈ దేశంలోని 35శాతం మంది అమ్మాయిలకు పోషక విలువలుగల ఆహారం అందటంలేదు. మొత్తం విద్యా శాతంలో బాలికల విద్యా శాతం తక్కువగానే ఉంది. వివక్షతకు, ఇంట్లో చాకిరికి, హింసకు గురవుతున్న మహిళల సంఖ్య తగ్గడమేలేదు. వీటి గురించిన చర్చ ఏమీ మనముందులేదు. వారి సాధికారతకు తీసుకునే చర్యలూ కానరావు. కానీ అందాల పోటీల పేరుతో వ్యాపార సరుకుల మోహాన్ని పెంచడమే కాదు, స్త్రీల వ్యక్తిత్వాన్ని అందానికి, ప్రదర్శనకు పరిమితం చేస్తున్నారు. అందమైన సరుకుగా మారుస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి ఇది పూర్తి వ్యతిరేకమైనది. కొంగు నడుముకు చుట్టి కొడవళ్లు చేతబట్టిన చైతన్య సంస్కృతి ఇక్కడి మహిళలది.

# ఆపదవేళ.. అన్నీ అందేలా..




**(లోకల్ గైడ్):**పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేయాలని ఆపరేషన్ సిందూర్‌ను భారత్ అప్రతిహతంగా చేపట్టగా, పాకిస్థాన్ మాత్రం సుదీర్ఘ పోరును కోరుకున్నట్టయితే దానిని ఎదుర్కోడానికి భారత్ సర్వదా సిద్ధంగానే ఉంది. ఆర్థికంగా, లాజిస్టిక్‌గా సౌకర్యవంతంగానే ఉంది. అతి ముఖ్యమైన చమురు, గ్యాస్ దిగుమతులు 30 నెలలపాటు కొనసాగించడానికి అలాగే ఇతర ముఖ్యమైన దిగుమతులు ఏడాదిపాటు కొనసాగించడానికి కావలసి విదేశీ మారక నిల్వలు భారత్ వద్ద ఉన్నాయి.ఇక ఆహార భద్రతకు సంబంధించి గోధుమలు, వరి నిల్వలు ప్రభుత్వ సౌకర్యవంతమైన స్థాయికి మించి ఉన్నాయి. దేశంలో పటిష్టమైన, వైవిధ్యమైన ఉత్పాదక రంగం నెలకొని ఉంది. అభివృద్ధి రేటు పైస్థాయిలో ఉండగా, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంది. కానీ ఇది సంతృప్తి చెందాల్సిన సమయం కాదు. సంఘర్షణలో ఎదురయ్యే అన్ని పరిస్థితులకు బడ్జెట్ వేసుకోక తప్పదు. అంటే కీలకమైన మౌలిక సౌకర్యాలపై ఓ కన్నేసి ఉంచాలి. అందువల్ల ఆకస్మిక ప్రణాళికలను ఎప్పటికప్పుడు రూపొందించుకోవడం ముఖ్యం. ఈ నేపథ్యంలో నిత్యావసరాల సరఫరా వ్యవస్థకు ఎలాంటి విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోడీ జాతీయ స్థాయిలో ఎంతవరకు మనం సన్నద్ధంగా ఉన్నామో వివిధ మంత్రిత్వ శాఖల సెక్రటరీలతో గురువారం సమీక్షించారు. భారీ సంఘర్షణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిత్యావసరాలు, ఇతర ముఖ్యమైన సేవలు ప్రజలకు అందేలా గట్టిగా నమ్మకం కల్పించేలా పనిచేయాలన్నారు. సరఫరా వ్యవస్థ ప్రధానంగా ప్రైవేట్ రంగంపైనే ఆధారపడినప్పటికీ, కలుపుకుని పోవడం కీలకం. జాతీయ ప్రయోజనాల విషయంలో భారతీయులు వెనుకంజవేయరన్న విశ్వాసం ఉన్నప్పటికీ, వీటన్నిటినీ ఒక మార్గంలో ముందుకు తీసుకెళ్లడం ఒక సవాలు. ఈ పరిస్థితుల్లో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండడంతో దేశం గోధుమ, చక్కెర, వంటనూనెలు నిల్వలు కావలసినంత సమకూర్చుకుంది. ఇవి అత్యవసర సమయంలో అవసరాలకు సరిపోతాయి. ముడి చమురు నిల్వలు కూడా తగినంత స్థాయిలో ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం 70 రోజులకు సరిపడే ముడి చమురు, 74 రోజులకు సరిపడే పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. దేశం మొత్తం మీద వినియోగానికి 60 నుంచి 64 రోజులకు సరిపడే ఇంధనం నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కలిగి ఉన్నాయి. మరో తొమ్మిది రోజులకు అదనంగా కావలసిన ఇంధనాన్ని ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వు నిల్వ చేసింది. ఇంధనం ధరలు తగ్గుముఖంలో ఉండడంతో కొనుగోళ్లు వేగవంతం చేయడానికి ఒఎంసి ప్రయత్నిస్తోంది. ధరలు నిలకడగా లేనప్పుడు ఈ విధంగా కొనుగోళ్లు చేయడం పరిపాటిగా వస్తోంది. ప్రస్తుతం చాలినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని సహజవాయు మంత్రిత్వశాఖకు చెందిన అధికార వర్గాలు పేర్కొన్నాయి. ముడిచమురును సరఫరా చేసే దేశాలు అందుబాటులో ఉండడంతో ముడి చమురు నిల్వలు లోటు లేకుండా ఉండడం గమనార్హం. 2025 కు ముందు 27 దేశాలనుంచి చమురు నిల్వలను దిగుమతి చేసుకోగా, 2025 మొదట్లో 40 దేశాల నుంచి ముడిచమురు నిల్వలను దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో 1.48 శాతం వరకు దిగుమతులు తగ్గినప్పటికీ, ఫిబ్రవరి, మార్చి వచ్చే సరికి 6.6 శాతం నుంచి 9.04 శాతం వరకు దిగుమతులు పెరిగాయి. ప్రత్యేక ప్రయోజనం కల్పించే వెహికల్ ఐఎస్‌ఆర్‌పిఎల్, మంత్రిత్వశాఖ కింది ఆయిల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ బోర్డు దేశం మొత్తం మీద మూడు ప్రాంతాల్లో ముడిచమురు నిల్వలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కర్ణాటకలోని మంగలూరు, పాడూరు (ఉడిపి సమీపాన) ప్రాంతాల్లో ఈ నిల్వలు ఉంటున్నాయి. అంతర్జాతీయ ఎనర్జీ ఏజెన్సీ ప్రమాణాల ప్రకారం సభ్యదేశాలు 90 రోజుల పాటు చేసుకున్న దిగుమతులకు సమానంగా ముడిచమురు నిల్వలను ఉంచుకోవచ్చు. ఇక ఆహార ధాన్యాల విషయాన్ని పరిశీలిస్తే ఆహార మంత్రిత్వశాఖ డేటా ప్రకారం ఏప్రిల్ 27 నాటికి దేశంలో మొత్తం 66.17 మిలియన్ టన్నుల గోధుమ, వరి ధాన్యాల నిల్వలు గిడ్డంగుల్లో ఉన్నాయి. 202324 లో 52 మిలియన్ టన్నులకు పైగా ఆహార ధాన్యాలను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేశారు. సూక్ష్మంగా చెప్పాలంటే గోధుమ, వరి నిల్వలు ఏడాది కాలానికి సరిపడే ఉన్నాయి.

ఈ ఏడాది మే 1 నాటికి చక్కెర ఉత్పత్తి గత ఏడాది కన్నా 18 శాతం తగ్గినప్పటికీ, రానున్న సీజన్‌లో అక్టోబర్ నాటికి చక్కెర ఉత్పత్తి నిల్వలు భారీగా అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. దేశం కొత్త చక్కెర సీజన్‌ను 202526 (అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు) దాదాపు 5.4 మిలియన్ టన్నుల చక్కెర నిల్వతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. అంటే రెండు నెలల వినియోగం కన్నా ఎక్కువ. ఇక పప్పు ధాన్యాల నిల్వలను పరిశీలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 1.8 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నాయి. సాధారణంగా 3.5 మిలియన్ టన్నుల వరకు నిల్వలు ఉంటాయి.అయితే పెసలు, బఠాణీలు అందుబాటులో ఉన్నాయి. కొత్త శనగ పంట ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చింది. అందువల్ల రానున్న నెలల్లో సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండబోవని పప్పుదినుసుల వ్యాపారులు భావిస్తున్నారు. ఇక ఖాద్య తైలాల నిల్వలు 1.6 మిలియన్ టన్నుల నుంచి 1.7 మిలియన్ టన్నుల వరకు ఉన్నాయి. వచ్చే 25 రోజుల వరకు వీటి సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదు. సాధారణంగా ఒక నెలకు సరిపడే నిల్వలను ముందుగానే జాగ్రత్త చేసి ఉంచుకుంటామని, కానీ ఇటీవల కాలంలో దిగుమతులు తగ్గాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెల్లడించారు.

# అప్పు తీర్చడం ఎలా?: చాట్‌జీపీటీ సమాధానం






చాలీచాలని జీతాలతో పనిచేసేవారి సంఖ్య ఎక్కువే ఉంది. జీతాలు సరిపోక పోవడంతో లోన్స్ తీసుకోవడం లేదా ఇతరుల దగ్గర అప్పు చేయడం వంటివి చేస్తారు. అప్పులు ఎక్కువైపోయినప్పుడు వాటిని ఎలా తీర్చాలో తెలియక కొందరు సతమతమవుతారు. చేసిన అప్పును సులభంగా ఎలా తీర్చాలి?, అనే ప్రశ్నకు.. చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం ఇక్కడ చూసేద్దాం.

స్నోబాల్ విధానం: మీరు చేసిన మొత్తం అప్పుల్లో చిన్న అప్పులను ముందుగా తీర్చేయాలి. ఇలా చేయడం వల్ల అప్పుల సంఖ్య తగ్గుతుంది. ఇది మీకు కొంతవరకు మానసిక ప్రశాంతతను అందిస్తుంది.

అవలాంచీ విధానం: అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న అప్పులను ముందుగా తీర్చేయాలి. వడ్డీ ఎక్కువ కడుతున్న అప్పులు తీర్చేయడం వల్ల.. ఆర్థిక భారం కొంత తగ్గుతుంది. ఎక్కువ వడ్డీ చెల్లించే అవసరం కూడా ఉండదు. బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్: చిన్న మొత్తంలో అప్పు ఉంటే.. దానిని క్రెడిట్ కార్డుకు బదిలీ చేయడం ఉత్తమం. ఇలా క్రెడిట్ కార్డు ద్వారా అప్పు చెల్లించడం ద్వారా ఆర్థిక ఒత్తిడి తగ్గుతుంది. వడ్డీ రేటు కూడా కొంత తగ్గుతుంది.

ఆదాయాన్ని పెంచి, ఖర్చులను తగ్గించండి: అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. ఆదాయాన్ని పెంచుకోవడానికి పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయడం వంటివి చేయాలి. పొదుపు చేయడం పెంచాలి. మీ డబ్బు ఎక్కడ.. ఎక్కువ ఖర్చు అవుతుందో అర్థం చేసుకోవడానికి మీ ఆదాయం, ఖర్చులను బేరీజు వేసుకోండి. ఇలా చేసినప్పుడు ఖర్చులు తగ్గించడం సాధ్యమవుతుంది. అప్పుల ఏకీకరణ: బ్యాంకులలో ఒకటి కంటే ఎక్కువ లోన్స్ తీసుకుని ఉన్నట్లయితే.. వాటన్నింటినీ ఒకటే లోన్ కిందికి వచ్చేలా మార్చుకోవాలి. ఇలా చేయడం వల్ల వడ్డీ తగ్గుతుంది. ఈఎంఐ విధానం ద్వారా అప్పు చెల్లిస్తారు కాబట్టి.. అప్పు చెల్లించడం సులభతరం అవుతుంది.



# ట్రిప్ కోసం బెస్ట్ గ్యాడ్జెట్స్ ఇవే..

ప్రపంచాన్ని చుట్టేయడం ఒక అందమైన అనుభవం. అందుకే, చాలామంది కాస్త తీరిక దొరికితే చాలు, బ్యాగ్‌లో బట్టలు సర్దేసుకుని, ప్రయాణాలకు సిద్ధపడుతుంటారు.ఇప్పుడు మీ ప్రయాణాన్ని మరింత సులభంగా, సౌకర్యవంతంగా మార్చేయడానికి అవసరమయ్యే ఎనర్జీ గేర్స్.. ఈ గ్యాడ్జెట్స్..

## చేతిలోనే వాటర్ ఫిల్టర్

ప్రయాణిం చేటప్పుడు ప్రతిచోటా శుభ్రమైన నీరు దొరకడం చాలా కష్టం. అలాగని, అపరిశుభ్రమైన నీటిని తాగితే, రోగాల బారిన పడతాం. ఇందుకోసమే మార్కెట్‌లోకి వివిధ వాటర్ ప్యూరిఫైయింగ్ వాటర్ బాటిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. ఇవి ఫిల్టర్, యూవీ- సీ లైట్ పద్ధతులతో నీటిలోని బ్యాక్టీరియా, వైరస్, ఇతర సూక్ష్మజీవులను, మలినాలను తొలగించి శుభ్రమైన తాగునీటిని అందిస్తాయి. ఇవి క్యాంపింగ్, ట్రెక్కింగ్, ట్రావెలింగ్ చేసే వారికి బాగా ఉపయోగపడతాయి. బ్యాటరీలతో పనిచేసే వీటిని చార్జ్ చేసుకొని వాడుకోవచ్చు. ధర వివిధ కంపెనీలను బట్టి రూ. పది నుంచి ఇరవై వేల వరకు ఉంటాయి.

## పాకెట్‌లో సూర్యశక్తి

ట్రావెలింగ్ చేస్తూ అడవిలో చిక్కుకున్నా కూడా మీ ఫోన్ బ్యాటరీ తగ్గిపోదు, ఒకవేళ మీ వద్ద ఈ 'సోలార్ పవర్ బ్యాంక్' కనుక ఉంటే. దీనిని చాలా చిన్నగా ఎక్కడికైనా సులభంగా జేబులో వేసుకొని వెళ్లేలా రూపొందించారు. ఇది కేవలం సౌరశక్తిని ఉపయోగించి, సుమారు 10,000 ఎమ్ఏహెచ్ వరకు బ్యాటరీని స్టోర్ చేసుకోగలదు. ఒకేసారి మూడు పరికరాలను చార్జ్ చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఇది ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్‌తో పాటు, వాటర్‌ప్రూఫ్, డస్ట్‌ప్రూఫ్‌తో వస్తుంది. ఇక దీనికున్న రెండు పవర్‌ఫుల్ ఫ్లాష్‌ట్కలే ట్లు మీకు మరో టార్చ్‌తో అవసరం లేకుండా చేస్తాయి. ధర రూ. 2,300.

## బ్యాగ్ పోయే రోజులు పోయాయి

ప్రయాణాల్లో బ్యాగ్ పోయినా, ఏమాత్రం భయపడనక్కర్లేదు. ఇకపై చిటికెలో పోయిన బ్యాగు ఆచూకీ తెలుసుకోవచ్చు. తాజాగా విడుదలైన 'అరిస్ట్రా వోల్ట్ స్మార్ట్ లగేజీ బ్యాగ్'లో అబ్బురపరిచే ఫీచర్స్ ఎన్నో ఉన్నాయి. ఇందులోని జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ సులభంగా బ్యాగ్ లొకేషన్‌ను ట్రాక్ చేస్తుంది. మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను చార్జ్ చేసుకోవడానికి వీలుగా ఒక ఇంటిగ్రేటెడ్ పవర్‌బ్యాంక్ ఉంటుంది. డిజిటల్ లాక్ సిస్టమ్‌తో బ్యాగ్ భద్రత కూడా క్షేమంగా, సులువుగా మొబైల్‌తోనే చేసేయొచ్చు. మరో ఆసక్తికర విషయం ఏంటంటే, ఆటోమేటిక్ లగేజీ వెయిట్ చెక్ ఫీచర్. ఇది విమాన ప్రయాణాలు చేసే వారికి బాగా ఉపయోగపడుతుంది. ధర. రూ. 81,100.

## మినీ ఐరన్ మాస్టర్

ప్రయాణాల్లో ఎదురయ్యే సమస్యల్లో బట్టల ఇస్త్రీ ఒకటి. సమస్య చిన్నదే అయినా, బిజినెజ్ ట్రిప్స్, ప్రత్యేక కార్యక్రమాలు, ఫంక్షన్స్‌కు వెళ్లేటప్పుడు నలిగిన బట్టల కారణంగా, ట్రిప్ వైబ్ మొత్తం పాడవుతుంది.

ఈ చిన్న సమస్యను, ఒక చిన్న పోర్టబుల్ స్టీమ్ ఐరన్‌తో పరిష్కరించవచ్చు. చూడ్డానికి చిన్నగా, అతి తక్కువ బరువుతో ఉంటే ఈ స్టీమ్ ఐరర్జీ , కేవలం కొద్ది సెకండ్లలోనే వేడి అయ్యి, స్టీమ్‌తో బట్టల మడతలను పోగొడుతుంది. యూఎస్‌బీ పోర్ట్ ద్వారా చార్జ్ చే సుకొని వాడుకోవచ్చు. ధర రూ. 999. అంతకంటే తక్కువ, ఎక్కువలోనూ వివిధ బ్రాండ్‌లలో లభిస్తున్నాయి.

# ఏ రంగంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారంటే..



భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో భౌగోళిక రాజకీయ మార్పుల కారణంగా భారతదేశ రక్షణ సాంకేతిక రంగాన్ని పెట్టుబడిదారులు అవకాశంగా చూస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం బలమైన విధాన మద్దతు, వేగవంతమైన సాంకేతిక పురోగతి ఇందుకు కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు కేంద్రం దృష్టి సారించడం, పరిశ్రమ ఆవిష్కరణలు, వ్యూహాత్మక పరిష్కారాలకు భారత్ గ్లోబల్ హబ్‌గా రూపాంతరం చెందే అవకాశం ఉండడంతో ఇన్వెస్టర్లు ఈ రంగంపై ఆసక్తిగా ఉన్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## పెట్టుబడుల వృద్ధికి కారణాలు

దేశీయ రక్షణ తయారీని బలోపేతం చేసే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ చర్యల వల్ల వివిధ కంపెనీలతో ఇటీవల 253 అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకోవడంతో రూ. 53,439 కోట్ల పెట్టుబడులు సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం వల్ల రక్షణ సాంకేతిక పరిజ్ఞానంలో పెట్టుబడిదారులకు భారత్ ఆకర్షణీయంగా మారుతోంది.

## సాంకేతికత అభివృద్ధి

సివిలియన్, మిలిటరీ అప్లికేషన్లకు సర్వీసులు అందించే డ్యుయల్-యూజ్ టెక్నాలజీలపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు. నిఘా, వ్యూహాత్మక కార్యకలాపాల కోసం స్వయంప్రతిపత్తి కలిగిన డ్రోన్ల తయారీ సంస్థలపై దృష్టి సారిస్తున్నారు. రియల్ టైమ్ ముప్పును గుర్తించడం కోసం ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థలను రూపొందించే కంపెనీలను గుర్తిస్తున్నారు. సముద్ర భద్రత, అన్వేషణ కోసం అండర్ వాటర్ డ్రోన్లు, అధునాతన డిఫెన్స్ ఇమేజింగ్, ఇంటెలిజెన్స్ కోసం హైపర్ స్పెక్ట్రల్ ఉపగ్రహాల వంటి వాటిపై పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నారు.

కంపెనీల తీరు

డిఫెన్స్ టెక్ స్టార్టప్‌లు డీప్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ (ఆర్ అండ్ డీ), మాడ్యులర్ టెక్నాలజీ, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాధాన్యత ఇస్తూ దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించే పనిలో ఉన్నాయి. కంపెనీలు తక్కువ ఖర్చుతో సుస్థిరమైన, కృత్రిమ మేధ ఆధారిత రక్షణ పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నాయి.

# ఈ స్మార్ట్ టీవీల ఫీచర్లు అదుర్స్.. రూ.25 వేల ధర నుంచే ప్రారంభం



ప్రముఖ బ్రాండ్ షియోమి మన దేశంలో క్యూలెడ్ టీవీ ఎఫ్ఎక్స్ ప్రో, 4కె టీవీ ఎఫ్ఎక్స్ సిరీస్ స్మార్ట్ టీవీలను ప్రవేశపెట్టింది. తద్వారా మార్కెట్ లో తన ఉత్పత్తుల శ్రేణిని విస్తరించింది.ఈ రెండు స్మార్ట్ టీవీలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. హై-ఎండ్ ఆడియో విజువల్, స్మార్ట్ హోమ్ ఫీచర్లతో వీక్షకులకు థియేటర్ అనుభవాన్ని కలిగిస్తాయి. ఇవి మే 12వ తేదీ నుంచి కొనుగోలుదారులకు అందుబాటులోకి వస్తాయి.షియోమి క్యూలెడ్ టీవీ ఎఫ్ఎక్స్ ప్రో విషయానికి వస్తే.. దీనిలోని 43 అంగుళాల టీవీ ధర రూ. 27,999 కాగా.. హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు రూ. 2 వేల క్యాష్ బ్యాక్ అందిస్తోంది. ఆ కార్డు ద్వారా ఈఎంఐ విధానంలో రూ. 25.999కి కొనుగోలు చేయవచ్చు. అమెజాన్.ఇన్, ఫ్లిప్ కార్ట్, ఎంఐ.కమ్ లలో ఈ టీవీ అందుబాటులో ఉంది. ఇక దీనిలోనే 55 అంగుళాల టీవీపై కూడా హెచ్ డీఎఫ్ సీ క్యాష్ బ్యాక్ అందుబాటులో ఉంది. కేవలం రూ. 37,999కి కొనుగోలు చేసుకోవచ్చు. అమెజాన్.ఇన్, ఎంఐ.కమ్ లో అందుబాటులో ఉంది. షియోమి 4కే టీవీ ఎఫ్ ఎక్స్ కు సంబంధించి 43 అంగుళాల టీవీ అసలు ధర రూ. 26,499 కాగా హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు క్యాష్ బ్యాక్ ద్వారా రూ. 24,499కి కొనవచ్చు. అమెజాన్.ఇన్, ఎంఐ.కమ్ లో ఈ టీవీ దొరుకుతుంది. 55 అంగుళాల టీవీని రూ. 34,999కి సొంతం చేసుకోవచ్చు. దీనికి హెచ్ డీఎఫ్ సీ క్యాష్ బ్యాక్ ఆఫర్ వర్తిస్తుంది. అమెజాన్.ఇన్, ఫ్లిప్ కార్ట్, ఎంఐ.కమ్ లలో అందుబాటులో ఉంది. రెండు స్మార్ట్ టీవీలూ హెచ్ డీఆర్10 ప్లస్ సపోర్టుతో ప్రతి ఫ్రేమ్ ను చక్కగా చూపిస్తాయి. డాల్బీ అట్మోస్ ద్వారా ట్యూన్ చేసిన 34 డబ్ల్యూ బాక్స్ స్పీకర్లతో ఆడియో చాలా బాగుంటుంది. ప్రైమ్ వీడియో, నెట్ ఫ్లిక్స్, జియో హాట్ స్టార్, జీ5, సోనీ ఎల్ఐవీ నుంచి అనేక కార్యక్రమాలను వీక్షించొచ్చు. అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్, యూట్యూబ్ తదితర వాటి ద్వారా కంటెంట్ ను ఆస్వాదించగలరు. తమ హోమ్ స్క్రీన్ నుంచి డీటీహెచ్ టీవీ చానెళ్లు, ఓటీటీ యాప్ ల మధ్య సజావుగా మారవచ్చు.

# స్మార్ట్ వాచ్‌లతో మరింత స్మార్ట్.. మదర్స్ డే గిఫ్ట్‌గా ఆర్డర్ చేసేయండి..!




ప్రతి ఒక్కరూ తమ తల్లికి ఏ బహుమతి ఇవ్వాలా అని ఆలోచిస్తారు. అయితే అమ్మకు స్మార్ట్ వాచ్ బహుమతిగా ఇస్తే బాగుంటుంది. సమయం చూసుకోవడంతో పాటు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది.ప్రస్తుతం మార్కెట్ లో అందుబాటులో ఉన్న బెస్ట్ స్మార్ట్ వాచ్ లు, వాటి ధరలు, ఇతర ప్రత్యేకతలను తెలుసుకుందాం.

## ఆపిల్ వాచ్ ఎస్ఈ

మణికట్టుకు అందాన్నివ్వడంతో పాటు నాణ్యమైన పనితీరు అందించడం ఆపిల్ వాచ్ ఎస్ఈ ప్రత్యేకత. దీనిలోని ప్రకాశవంతమైన డిస్ ప్లేతో నోటిఫికేషన్లను చక్కగా చూడవచ్చు. అన్ని పనులను ట్రాక్ చేసుకోవచ్చు. ఫిట్ నెస్ తో పాటు గుండె స్పందన తదితర ఆరోగ్య విషయాలను చెక్ చేసుకోవచ్చు. జీపీఎస్ 40 ఎంఎం వెర్షన్ తో కూడిన బేస్ మోడల్ వాచ్ రూ. 24,900 ధరకు అందుబాటులో ఉంది.

## సామ్సంగ్ గెలాక్సీ వాచ్ అల్ట్రా

ప్రముఖ బ్రాండ్ సామ్సంగ్ నుంచి విడుదలైన గెలాక్సీ వాచ్ అల్ట్రా ఆధునిక ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. దీనిలో 1.5 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్ ప్లే, 2 జీబీ ర్యామ్, టైటానియం కేస్, నీలమణి క్రిస్టల్ గ్లాస్, ఐపీ 68 వాటర్ రెసిస్టెంట్, లేటెస్ట్ హెల్త్ ట్రాకింగ్ తదితర ఫీచర్లు ఉన్నాయి. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ జీపీఎస్ తో అత్యవసర సైరన్ ను కూడా మోగిస్తుంది. ఈ వాచ్ అసలు ధర రూ. 50,999 కాగా.. ప్రస్తుతం ఆన్ లైన్ లో రూ. 34,900 కంటే తక్కువ ధరకు అందుబాటులో ఉంది.




## ఆపిల్ వాచ్ సిరీస్ 10

సమర్థవంతంగా పనిచేసే స్మార్ట్ వాచ్ లలో ఆపిల్ వాచ్ సిరీస్ 10 ముందుంటుంది. దీనిలో ఆల్వేస్ %-% ఆన్ రెటీనా డిస్ ప్లేలో విజువల్ ను ఏ కోణం నుంచి అయినా వీక్షించొచ్చు. ఎస్10 ఎస్ఐపీ ద్వారా పనితీరు వేగవంతంగా ఉంటుంది. గుండె వేగం, ఈసీజీ, రక్త ఆక్సిజన్ స్థాయిలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అల్యూమినియం కేసు, స్పోర్ట్ బ్యాండ్ తో కూడిన ఈ వాచ్ బేస్ వేరియంట్ మన దేశంలో రూ. 46,900 నుంచి ప్రారంభమవుతుంది.

గార్మిన్ ఇన్స్టింక్ట్ 3 సాహస యాత్రలు, పర్యటనలు చేసే వారికి ఎంతో ఉపయోగపడే గార్మిన్ ఇన్స్టింక్ట్ 3 వాచ్ లో అనేక ప్రత్యేకతలున్నాయి. 1.2 అంగుళాల అమోలెడ్ డిస్ ప్లే, థర్మల్, షాక్, నీటి నిరోధకత, కచ్చితమైన ట్రాకింగ్ కోసం మల్టీ బ్రాండ్ జీపీఎస్, రెడ్ లైడ్ మోడ్ తో అంతర్నిర్మిత ఎల్ఈడీ ఫ్లాష్ లైట్ బాగున్నాయి. గుండె స్పందన రేటు, నిద్ర, పల్స్, ఒత్తిడిని ట్రాకింగ్ చేసుకోవచ్చు. స్మార్ట్ నోటిఫికేషన్లు, స్పోర్ట్స్ యాప్ లు అదనపు ప్రత్యేకత. దీని బేస్ వేరియంట్ మన దేశంలో రూ. 52,990కి అందుబాటులో ఉంది.

## రెడ్ మీ వాచ్ 5 యాక్టివ్

అత్యంత తక్కువ ధరలో బెస్ట్ వాచ్ కొనుగోలు చేయాలనుకునే వారికి రెడ్ మీ వాచ్ 5 యాక్టివ్ మంచి ఎంపిక. దీని ధర కేవలం రూ. 2499 మాత్రమే. ఆకట్టుకునే ఫీచర్లు, స్టైలిష్ మెటల్ బాడీతో ఆకట్టుకుంటోంది.

దీనిలో 2 అంగుళాల హెచ్ డీ ఎల్సీడీ డిస్ ప్లే ఏర్పాటు చేశారు. ఇది డ్యూయల్ మైక్ నాయిస్ క్యాన్సిలేషన్ తో బ్లూటూత్ కాలింగ్ కు మద్దతు ఇస్తుంది. అలాగే గుండె స్పందన రేటు, ఎస్పీవో2, ఒత్తిడి, నిద్రను పర్యవేక్షిం చుకోవచ్చు. 140కి పైగా వర్కౌంట్ మోడ్ లు, 5 ఏటీఎం నీటి నిరోధకత, 18 రోజుల బ్యాటరీ లైఫ్ బాగు న్నాయి.

# కొత్త ఫోన్‌తో దుమ్మురేపుతున్న సామ్‌సంగ్.. ఫీచర్స్ తెలిస్తే షాకవుతారంతే..!

సామ్ సంగ్ కంపెనీ ఇటీవల దాని ఎఫ్ సిరీస్ లైనప్‌లో స్లిమ్ డిజైన్‌తో వచ్చే గెలాక్సీ ఎఫ్-56 5జీ ఫోన్‌ను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్మార్ట్ ఫోన్ కేవలం 7.2 ఎంఎం మందంతో ఉంటుంది. ఎల్‌పీడీడీఆర్ 5 ఎక్స్ ర్యామ్‌తో ఎక్సినోస్ 1480 ప్రాసెసర్ ద్వారా ఆధారంగా ఎఫ్-56 5జీ సున్నితమైన మల్టీ టాస్కింగ్, లాగ్-ఫ్రీ గేమింగ్, శక్తి సామర్థ్యాన్ని హామీ ఇస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ స్మార్ట్ ఫోన్ ముందు, వెనుక రెండు గ్లాసులు గొరిల్లా విక్టస్ ప్లస్ రక్షణతో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సొగసైన ఫారమ్ ఫ్యాక్టర్‌తో పాటు అధిక మన్నికను అందిస్తుంది.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్-56 5జీ ఫోన్ 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ సూపర్ ఎమోఎల్ఈడీ డిస్‌ప్లేతో ఆకట్టుకుంటుంది. 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 1200 నిట్స్ బ్రైట్‌నెస్‌కు మద్దతు ఇస్తుంది. గెలాక్సీ ఎఫ్56లో ఓఐఎస్, 12 ఎంపీ హెచ్‌డీఆర్ ఫ్రంట్ కెమెరాతో 50 ఎంపీ ప్రధాన కెమెరా ఉంది. అందువల్ల పోర్ట్రెయిట్ 2.0, బిగ్ పిక్సెల్ టెక్, ఏఐ ఐఎస్‌పీ వంటి ఫోటోగ్రఫీ ఫీచర్‌లతో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా వీడియో రికార్డింగ్ విషయానికి వస్తే 4 కే 30 ఎఫ్‌పీఎస్ హెచ్‌డీఆర్ సాయంతో రికార్డు చేసుకోవచ్చు. సామ్‌సంగ్ ఆబ్జెక్ట్ ఎరేజర్, ఎడిట్ సజెషన్స్ వంటి ఏఐ-ఆధారిత ఎడిటింగ్ సాధనాలు యూజర్లు అమితంగా ఆకట్టుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. సిక్స్ జనరేషన్ ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్‌లతో పాటు ఎఫ్-56 కోసం ఆరు సంవత్సరాల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని సామ్‌సంగ్ కంపెనీ ప్రకటించింది.





సామ్‌సంగ్ ఎఫ్-56 స్మార్ట్ ఫోన్ వన్ యూఐ7తో వస్తుంది. అందువల్ల గూగుల్ జెమినీ సపోర్టతో పాటు నౌ బార్ సాయంతో త్వరిత అప్‌డేట్స్ పొందుతుంది. ఈ స్మార్ట్ ఫోన్ ద్వారా సామ్ సంగ్ వ్యాలెట్ పేలో అందుబాటులో ఉన్నా ట్యాప్ అండ్ పేకు కూడా సపోర్ట్ చేస్తుంది. సామ్‌సంగ్ ఎఫ్-56 ద్వారా 45 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో కూడిన 5,000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ స్మార్ట్ ఫోన్ రెండు కాన్ఫిగరేషన్‌లలో లభిస్తుంది. 8 జీబీ ం 128 జీబీ వేరియంట్‌తో వచ్చే ఫోన్ ధర రూ. 25,999గా ఉంటే 8 జీబీ ం 256 జీబీ రూ. 28,999గా ఉంది. అలాగే ఈ రెండు ఫోన్లను కొనుగోలు చేస్తే రూ. 2000 తక్షణ బ్యాంక్ డిస్కౌంట్‌ను పొందవచ్చు. సామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్-56 5 జీ స్మార్ట్ ఫోన్ రెండు రంగుల్లో అంటే గ్రీన్‌తో పాటు వైలెట్ కలర్స్‌లో అందుబాటులో ఉంది.

# ఒంటరి దీవిలో యంగ్ బ్యూటీ బికినీ ట్రీట్!





బికినీ బీచ్ సెలబ్రేషన్స్ తో స్టార్లు మరిగిస్తున్న సంగతి తెలిసిందే. ఒంటరి దీవుల్లో మంటలు పెట్టేందుకు అందాల భామలు వెనకాడటం లేదు. ఇప్పుడు తన బర్త్ డే వేడుకల్ని పురస్కరించుకుని యంగ్ బ్యూటీ అమైరా దస్తూర్ బీచ్ పరిసరాల్లో చెలరేగి పోతోంది. అందుకు సంబంధించిన ఫోటో షూట్లు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి.

తాజాగా అమైరా బికినీ బీచ్ సెలబ్రేషన్స్ కి సంబంధించిన ఫోటోలు యువతరం వాట్సాపుల్లోకి వచ్చాయి. అమైరా అందచందాలు, టీజింగ్ యాటిట్యూడ్ కి ఫిదా కాని వాళ్లు లేరు. ఈ ఏడాదితో అమైరా 32 బార్డర్ క్రాస్ చేస్తోంది. ఇప్పటికే చాలా సాధించాల్సి ఉన్నా, నటిగా కెరీర్ అంతంత మాత్రమే. కానీ మోడలింగ్ లో టాప్ క్వీన్ గా వెలిగిపోతోంది. నిరంతరం అమైరా రెడ్ కార్పెట్ ఈవెంట్లలో సందడి చేస్తూనే ఉంది.

శ్రీలంక దీవుల్లో బికినీ షూట్లకు సంబంధించిన ఫోటోలు హీటెక్కిస్తున్నాయి. అమైరా తెలుగు చిత్రసీమలో అవకాశాలు అందుకుంది. ముంబై బ్యూటీ అమైరా దస్తూర్ - మనసుకు నచ్చింది -% సినిమాతో టాలీడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అటుపై రాజ్ తరుణ్ - రాజుగాడు - లో నటించింది. కానీ ఈ రెండు చిత్రాలు ఫ్లాపయ్యాయి. కోలీవుడ్ లో భగీరా అనే చిత్రంలో నటించింది. అలాగే కొన్ని వెబ్ సిరీస్ లతోను బిజీ అయింది. 2017లో జాకీ చాన్‌తో కలిసి తన అంతర్జాతీయ ప్రాజెక్ట్ కుంగ్ ఫూ యోగాలో నటించడం ద్వారా క్రేజ్ తెచ్చుకుంది. కానీ అది బాలీవుడ్ కెరీర్ కి కలిసి రాలేదు.

ప్రస్తుతం కెరీర్ బండిని ట్రాక్ లో పెట్టేందుకు చాలా ప్రయత్నాలు చేస్తోంది అమైరా. నిరంతర ఫోటోషూట్లతో అభిమా నులకు, ఫిలింమేకర్స్ కి టచ్ లో ఉంది.

## తమ్ముడు ఆ విషయంలో కూడా వేరే లెవెల్ ప్లాన్..!



నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమా తమ్ముడు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో సప్తమి గౌడ హీరోయిన్ గా నటిస్తుంది. సినిమాలో సిస్టర్ రోల్ లో ఒకప్పటి హీరోయిన్ లయ నటిస్తుంది. నితిన్ లయ కాంబినేషన్ సీన్స్ అదిరిపోతాయని అంటున్నారు. తమ్ముడు ఒక ఎమోషనల్ ఎంటర్టైనర్ గా రాబోతుందని తెలుస్తుంది. ఈ సినిమాలో నితిన్ కూడా అదరగొడతాడని అంటున్నారు.దిల్ రాజు కాంపౌండ్ లో ఆస్థాన డైరెక్టర్ గా ఉన్నాడు వేణు శ్రీరామ్. అతని సినిమాలు మినిమం గ్యారెంటీ అవుతున్నాయి. అందుకే తమ్ముడు సినిమా మీద అంచనాలు ఏర్పడ్డాయి. ఐతే తమ్ముడు సినిమా విషయంలో మరో స్పెషల్ థింగ్ క్రేజీగా మారింది. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ గా అజనీష్ లోక్ నాథ్ పనిచేస్తున్నాడు. కాంతారా తో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న అజనీష్ తెలుగులో మంగళవారం సినిమా చేశాడు.ఈమధ్యనే వచ్చిన ఓదెల 2, అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాలకు కూడా అతనే మ్యూజిక్ అందించాడు. ఐతే అజనీష్ మ్యూజిక్ అంటే అది రెగ్యులర్ కి భిన్నంగా ఉంటుందని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. తమ్ముడు సినిమాకు అతన్ని ఏరి కోరి కావాలని తీసుకున్నారట. అజనీష్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానుందని తెలుస్తుంది. తమ్ముడు సినిమా ఒక ఎమోషనల్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈ సినిమాలో కొన్ని సీన్స్ థియేటర్ లో ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తాయని అంటున్నారు.సినిమాకు అజనీష్ మ్యూజిక్ మరో అట్రాక్షన్ అవుతుందట. రీసెంట్ గా రాబిన్ హుడ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నితిన్ ఆ సినిమాతో ఆకట్టుకోలేకపోయాడు. ఐతే తమ్ముడు సినిమాతో హిట్ కొట్టాలని చూస్తున్నాడు. తమ్ముడు తర్వాత వేణు డైరెక్షన్ లో ఎల్లమ్మ సినిమా చేయనున్నాడు నితిన్.

ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రాబోతుంది. ఐతే తమ్ముడు, ఎల్లమ్మ రెండు ప్రాజెక్ట్ లు దిల్ రాజు బ్యానర్ లో తెరకెక్కుతున్న సినిమాలే అవ్వడం విశేషం. హీరో నితిన్ హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా కెరీర్ కొనసాగిస్తున్నాడు. ఐతే భీష్మ తో సక్సెస్ అందుకున్న నితిన్ మరో హిట్ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఐతే తమ్ముడు, ఎల్లమ్మ రెండు సినిమాలైతే కచ్చితంగా వర్క్ అవుట్ అయ్యేలా ఉన్నాయని తెలుస్తుంది.

# Cinema

## నరసింహస్వామి అవతారంపై హొంబలే






నరసింహా పేరుతో విష్ణువు అవతారాల్లో అత్యంత కీలక అవతారాన్ని ప్రజలకు యానిమేటెడ్ ఫిలిం రూపంలో చూపించేందుకు సన్నాహకాల్లో ఉంది హొంబలే. కేజీఎఫ్, కేజీఎఫ్ 2, కాంతార వంటి పాన్ ఇండియన్ చిత్రాలను అందించిన హొంబలే సంస్థ వరుసగా ప్రయోగాత్మక చిత్రాలతో సంచలనాలు సృష్టిస్తోంది. హొంబలేతో కలిసి అశ్విన్ కుమార్ నిర్మించిన 'మహావతార్ నరసింహ' జూలైలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మహావతార్ సిరీస్ నుండి మొదటి ప్రాజెక్ట్ టీజర్ ని మూడు నెలల క్రితం విడుదల చేయగా అద్భుత స్పందన వచ్చింది. విష్ణువు అనేక అవతారాలను ఈ సిరీస్ లో చూపించబోతున్నామని హొంబలే ప్రకటించింది. తాజాగా రిలీజ్ డేట్ ని ప్రకటిస్తూ, థియేటర్లకు రావాల్సిందిగా హొంబలే సంస్థ కోరింది. నరసింహ స్వామి శక్తివంతమైన గర్జనను అనుభూతి చెందడానికి.. పెద్ద తెరపై ఇంతకు ముందు ఎన్నడూ లేని అనుభవాన్ని పొందడానికి! మహావతార్ నరసింహ గ్లింప్స్‌ను ప్రదర్శిస్తున్నాము. గర్జనతో మీ ఆత్మను మేల్కొల్పండి! అనుభవించండి. జీవించండి... బీ రెడీ.. ! అంటూ టీజ్ చేసింది. %-%మహావతార్ నరసింహ%-% అద్భుతమైన పురాణేతిహాస కథ. అత్యంత క్రూరమైన, సగం మనిషి-సగం సింహం అవతారం.. విష్ణువు అత్యంత శక్తివంతమైన అవతారం అయిన నరసింహ భగవానుడి పురాణ కథకు ప్రాణం పోసే ప్రయత్నమిది. హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుడు కథను ఇందులో చూపిస్తున్నారు.

ఈ చిత్రం హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళ భాషలలో విడుదల కానుంది.

సినిమా పురాణేతిహాసాలపై భారీ పాన్ ఇండియన్ సినిమాలు తెరకెక్కించాలనే ఆసక్తి దేశవ్యాప్తంగా ఫిలింమేకర్స్ లో ఉంది. అయితే దీనికోసం వందల కోట్ల బడ్జెట్లు అవసరం. పైగా ప్రతి భాష నుంచి స్టార్లను వెతికి హాలీవుడ్ స్థాయిలో సాంకేతిక నిపుణులను సమకూర్చుకుని, విజువల్ వండర్ ని క్రియేట్ చేస్తేనే జనం థియేటర్లకు వస్తున్నారు. ఇలాంటి కథలను ఒరిజినాలిటీ చెడకుండా ఉన్నది ఉన్నట్టు తీయలి. లేదంటే మనోభావాల కాలంలో చాలా సవాళ్లను ఎదుర్కోవాలి. ఇంత చేసినా రిలీజయ్యాక హిట్టవుతుందంటే చెప్పలేం. ఏ యుద్ధం వచ్చిందనో, కరోనా రంగ ప్రవేశం చేసిందనో వార్త వెలువడితే చాలు జనం ఓటీటీలో చూద్దాం.. థియేటర్లకు ఎందుకులే! అనుకుంటున్నారు. మరి ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో పురాణేతిహాసాలను ప్రజలకు ఎలా చూపించాలో ఇప్పుడు హొంబలే ఫిలింస్ చేసి చూపిస్తోంది. మహావతార్

## 2027 క్రిస్ మస్ కి సాధ్యమయ్యే పనేనా..?

పుష్ప 2 తో పాన్ ఇండియా సెన్సేషనల్ హిట్ అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన నెక్స్ట్ సినిమా అట్లీతో చేస్తున్నాడు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కాబోతుందని తెలుస్తుంది. సన్ పిక్చర్స్ బ్యానర్ లో తెరకెక్కనున్న ఈ మూవీని ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్ తో నిర్మించబోతున్నారట. ఐతే ఈ సినిమా నుంచి వచ్చే ప్రతి అప్డేట్ అల్లు ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. సినిమాలో అల్లు అర్జున్ డబుల్ రోల్ అని వార్తలు రాగా..

సినిమాలో బన్నీ ముగ్గురు హీరోయిన్స్ తో రొమాన్స్ చేస్తాడని హడావిడి చేస్తున్నారు. ఇదిలా ఉంటే అట్లీ సినిమాలు అన్నీ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో వస్తాయి. ప్రీ ప్రొడక్షన్ లోనే సినిమా షెడ్యూల్, ప్రమోషన్స్, రిలీజ్ అన్నీ విషయాల గురించి డీటైల్డ్ గా ఫిక్స్ చేస్తారు. ముఖ్యంగా సినిమాను అనుకున్న డేట్ కి రిలీజ్ టార్గెట్ గా అట్లీ పెట్టుకుంటాడు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ అట్లీ సినిమా వన్ ఇయర్ లో షూటింగ్ పూర్తి చేసి 3 నెలలు పోస్ట్ ప్రొడక్షన్ చేసి మరో 3 నెలల్లో రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. అంటే 2025 నుంచి 2026 చివరి వరకు షూటింగ్ కే టైం తీసుకుంటున్నారట. 2026 లో షూటింగ్ పూర్తి కాకపోయినా 2027 ఫస్ట్ హాఫ్ లో ఎట్టి పరిస్థితుల్లో సినిమాను పూర్తి చేసి 2027 సెకండ్ హాఫ్ అంటే దసరా లేదా క్రిస్ మస్ లో రిలీజ్ అనుకుంటున్నారట. అంటే రెండేళ్లలో ఈ సినిమా రిలీజ్ అవ్వాలన్నమాట.

ఈ సినిమాను హాలీవుడ్ రిఫరెన్స్ లతో భారీ ప్లానింగ్ తోనే సిద్ధం చేస్తున్నారు. జస్ట్ అనౌన్స్ మెంట్ వీడియోనే ఆడియన్స్ కి పూనకాలు తెప్పించేసింది. పుష్ప 1, 2 సినిమాలతో పాన్ ఇండియా లెవెల్ లో అల్లు అర్జున్ రేంజ్ పెరిగింది. పుష్ప 1 తో నేషనల్ అవార్డ్ సైతం అందుకున్న అల్లు అర్జున్ పుష్ప 2 తో కూడా మరోసారి జాతీయ అవార్డ్ అందుకునే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఐతే అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమా కూడా అంచనాలకు మించి ఎవరి ఊహలకు అందని విధంగా ఉంటుందని అంటున్నారు. టెక్నికల్ గా హై స్టాండర్డ్స్ లో ఈ సినిమా సెట్ చేయబోతున్నారట. మరి ఇండియన్ తెర మీద రాబోతున్న ఈ సూపర్ హీరో మూవీ ఎలా ఉండబోతుందో చూడాలి.



## జూనియర్ ఎన్టీఆర్‌కు రామ్ చరణ్ సర్‌ప్రైజ్.. ఇంతకీ అదేంటంటే?



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. ఈ మూవీ రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ హీరోలుగా మెప్పించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ఆలియా భట్ హీరోయిన్‌గా కనిపించింది. తాజాగా ఆర్‌ఆర్‌ఆర్ టీమ్ లండన్‌లో సందడి చేసింది. లండన్‌లోని రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరిగిన ఆర్‌ఆర్‌ఆర్ లైవ్ ఆర్కెస్ట్రా స్క్రీనింగ్‌లో రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఒకే వేదికపై మెరిశారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్‌కు రామ్ చరణ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా జూనియర్ బర్త్ డేకు పది రోజుల ముందే చెర్రీ విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా ఒకరినొకరు హృదయపూర్వక ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ చెంపపై ముద్దు కూడా పెట్టారు. ఇది చూసిన ఫ్యాన్స్ చప్పట్లు కొట్టారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాగా.. ఆదివారం ఆర్‌ఆర్‌ఆర్ మూవీని లండన్‌లోని లెజెండరీ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో ప్రదర్శించారు. ఈ స్క్రీనింగ్ వేడుకలో దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌లతో కలిసి సందడి చేశారు. దాదాపు మూడేళ్ల తర్వాత మొదటిసారి వేదికపైకి కనిపించారు. ఈ కార్యక్రమంలో ఆస్కార్ విజేత స్వరకర్త ఎంఎం కీరవాణి నేతృత్వంలోని రాయల్ ఫిల్హార్మోనిక్ కాన్సర్ట్ ఆర్కెస్ట్రా ఆర్‌ఆర్‌ఆర్ సంగీతాన్ని ప్రదర్శించారు. కాగా.. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, అలియా భట్, శ్రియ శరణ్ కీలక పాత్రల్లో నటించారు. 2023లో 'నాటు నాటు' పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డును గెలుచుకున్న తొలి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది.

## విశ్వక్ కల్ట్.. అతను పర్ఫెక్ట్ చాయిస్..!



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ లైలా తర్వాత ఈసారి పక్కా ప్లానింగ్ తో వస్తున్నాడు. లైలా కోసం విశ్వక్ ఎంతో రిస్క్ తీసుకుని మరీ లేడీ గెటప్ వేయగా సినిమా ఆడియన్స్ ని మెప్పించడంలో విఫలమైంది. టాలీవుడ్ యువ హీరోల్లో 100 కోట్లు కొట్టగల సత్తా ఉన్నా కూడా ఎందుకో వెనకపడ్డాడు విశ్వక్ సేన్. అందుకే ఇక మీదట తన మాస్ స్టామినా చూపించాలని ఫిక్స్ అయ్యాడు. ప్రస్తుతం విశ్వక్ సేన్ అనుదీప్ కెవి డైరెక్షన్ లో ఫంకీ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ఆల్రెడీ షూటింగ్ జరుపుకుంటుంది. డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ ఈ సినిమాలో విశ్వక్ సనస నటిస్తుంది. ఇక ఈ సినిమాతో పాటుగా విశ్వక్ సేన్ మరో సినిమా షురూ చేశాడు. ఈసారి తన డైరెక్షన్ లో సినిమా చేస్తున్నాడు విశ్వక్ సేన్. విశ్వక్ సేన్ డైరెక్షన్ లో వచ్చిన ఫలక్ నుమా దాస్ మాస్ ఆడియన్స్ ని మెప్పించింది. ఆ సినిమా చూసే విశ్వక్ కి మాస్ ఆడియన్స్ దగ్గరయ్యారు. ఇక ఇప్పుడు మరోసారి అతని డైరెక్షన్ టాలెంట్ చూపించాలని ఫిక్స్ అయ్యాడు విశ్వక్ సేన్. కల్ట్ అంటూ క్రేజీ టైటిల్ తో వస్తున్నాడు విశ్వక్ సేన్. ఈ సినిమా డైరెక్షన్ మాత్రమే కాదు నిర్మాతగా కూడా తనే వ్యవహరిస్తున్నాడు. ఐతే విశ్వక్ సేన్ కల్ట్ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ తానే అయినా డైలాగ్స్ మాత్రం మరో దర్శకుడు తరుణ్ భాస్కర్ కి ఛాన్స్ ఇచ్చాడు. విశ్వక్ సేన్ తో ఈ నగరానికి ఏమైంది సినిమా చేశాడు తరుణ్ భాస్కర్. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మంచి బాండింగ్ ఉంది. తరుణ్ భాస్కర్ రైటింగ్ కి ప్రత్యేక ఫ్యాన్స్ ఉన్నారు. విశ్వక్ సేన్ కల్ట్ కి తరుణ్ భాస్కర్ రైటింగ్ సంథింగ్ స్పెషల్ అని చెప్పొచ్చు. ఈమధ్య విశ్వక్ సేన్ సినిమాలు అంచనాలను అందుకోలేకపోతున్నాయి. అందుకే ఈసారి టార్గెట్ మిస్ అవ్వకూడదని గట్టిగా ఫిక్స్ అయ్యి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో విశ్వక్ సేన్ ఈ కల్ట్ సినిమాను చేస్తున్నాడు. కల్ట్ పోస్టర్ కూడా సంథింగ్ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. మరి సినిమా ఎలా ఉంటుందో చూడాలి. విశ్వక్ సేన్ ఫంకీ ఈ ఇయర్ సెకండ్ హాఫ్ లో రిలీజ్ ఉండే ఛాన్స్ ఉంది. ఐతే ఈ కల్ట్ సినిమా మాత్రం నెక్స్ట్ ఇయరే వచ్చే అవకాశాలు ఉన్నాయి.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed at Gayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDY EMAIL: Localguide9999@gmail.com web:www.localguidenews.com,contact:8977761499